శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు సిపిఐ రాజకీయ ప్రచారోద్యమం
సమాజాన్ని షేక్ చేస్తున్న 'ఫేక్' న్యూస్
దేవాదుల 3వ దశ మోటార్లు ప్రారంభం
నీలాగా మేము రోడ్లను అమ్మబోము
లోపలి పేజీల్లో




సంపుటి 08, సంచిక: 109 | బుధవారం | 19-03-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## ఓటర్ ఐడితో ఆధార్ లింక్

- కేంద్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన
- ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం–1960, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడి అనుసంధాన ప్రక్రియ
- యుఐడిఎఐ, సాంకేతిక నిపుణులతో త్వరలో చర్చలు




**న్యూఢిల్లీ :** ఓటర్ కార్డులను ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) మొగ్గు చూపింది. అమలులో ఉన్న చట్టం, అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం సాంకేతిక సంప్రదింపుల మధ్య దాని నిపుణులు, యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ) తరువాయి 2లో



సిఎంను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు

# ఎస్‌సి వర్గీకరణకు అసెంబ్లీ ఓకె

- బిల్లుకు బిఆర్‌ఎస్, సిపిఐ, బిజెపి, ఎంఐఎం సంపూర్ణ మద్దతు
- 2026లో నిర్వహించనున్న జనాభా లెక్కల ఆధారంగా ఎస్‌సి రిజర్వేషన్లు పెంచుతాం
- వర్గీకరణ ఉద్యమంలో మరణించిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది
- ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా పారదర్శకంగా వ్యవహరిస్తాం
- సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన
- తాను సిఎంగా ఉన్నప్పుడే వర్గీకరణకు శాశ్వత పరిష్కారం దక్కడం పట్ల హర్షం

### 59 ఎస్‌సి ఉపకులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ బిల్లుకు ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్

''షెడ్యూల్డ్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) బిల్లు–2025''ను శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. 59 ఎస్‌సి కులాలను 3 గ్రూపులుగా వర్గీకరిస్తూ బిల్లును ఆమోదించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఎస్‌సి వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఎస్‌సి వర్గీకరణలో ఎస్‌సి, ఎస్‌సి ఉప కులాలు మొత్తం 59 కులాలను మూడు గ్రూపులుగా విభించి, గ్రూప్–1లోని అత్యంత వెనుకబడిన 15 కులాలకు 1 శాతం, మాదిగలు ఉన్న గ్రూప్–2లోని కులాలకు 9 శాతం రిజర్వేషన్లను, మాలలు ఉన్న గ్రూప్3లోని కులాలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రతిపాదించారు. అంతకుముందు సభలో జరిగిన వర్గీకరణ చర్చలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 2026లో నిర్వహించనున్న జనాభా లెక్కల ఆధారంగా ఎసిసి రిజర్వేషన్లను పెంచుతామని ప్రకటించారు. వర్గీకరణ ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని, ఆ కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం, 'రాజీవ్ యువ వికాసం' తరువాయి 2లో

### ప్రతి దళిత కుటుంబానికి న్యాయం జరగాలి : కూనంనేని

చారిత్రాత్మకమైన ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు

**రా**ష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) రిజర్వేషన్ హేతుబద్ధీకరణ బిల్లును తీసుకురావడం ద్వారానే ఆ వర్గాలకు పూర్తి న్యాయం జరుగుతుందని భావించరాదని, సమాజంలో తరతరాలులో సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా అత్యంత వెనకబడిన దళితులు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలోని ప్రతి ఎస్‌సి ఇంటికి న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులను కేటాయించి వారి సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. శాసనసభలో మంగళవారం ఎస్‌సి వర్గీకరణ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చరిత్రాత్మకమైన ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఎస్‌సి తరువాయి 2లో



## నేడు రాష్ట్ర బడ్జెట్

- అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి భట్టి
- మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు పద్దు ప్రవేశం
- ఉదయం 9 గంటలకు కేబినేట్ సమావేశం

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర 2025–26 వార్షిక బడ్జెట్‌ను ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం ఉదయం 11.00 గంటలకు శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. అదే విధంగా శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనమండలిలో ప్రవేశపెడతారు. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క మంగళవారం ఉదయం సంబంధిత ఉన్నతాధికారులతో సమావేశమై బడ్జెట్‌కు తుదిరూపం ఇచ్చారు. ఈసారి బడ్జెట్ దాదాపు రూ.3 లక్షల కోట్ల నుంచి రూ.3.15 లక్షల కోట్ల ఉండవచ్చని తెలిసింది. బడ్జెట్ తరువాయి 2లో




## అంతరిక్షం నుంచి భువికి సునీతా

**కేప్ కేనవరాల్ :** సునీతావిలియమ్స్ సహా నలుగురు వ్యోమగాములు భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుమున 3.30 గంటలకు (అమెరికా టైమ్ ప్రకారం మంగళవారం సాయంత్రం) భూమికి చేరుకుంటారు. ఫ్లోరిడాలోని సముద్ర జలాల్లో స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ దిగిన వెంటనే సహాయ బృందాలు దానిని సేకరించి నలుగురు వ్యోమగాములను బయటకు తీసుకువస్తారు. విలియమ్స్‌తో పాటు మరో అమెరికా వ్యోమగామి విల్మోర్, నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ భూమికి తిరిగి వస్తారు. సునీతా విలియమ్స్ బృందం ఐఎస్ఎస్ నుండి బయలుదేరి తర్వాత నాసాకు చెందిన అన్నే షార్లెట్ మెక్ క్లెయిన్ (45) అంతరిక్షంలోని స్పేస్ స్టేషన్ నుండి ఒక సందేశం పంపుతూ ''మీ సాంగత్యానికి మేం దూరమయ్యాం, కానీ మీరు సురక్షితంగా భూమికి వెళుతున్నారు, తరువాయి 2లో

## దేశ భద్రతకు విఘాతం

- స్టార్ లింక్‌కు శాటిలైట్ స్పెక్ట్రమ్ కేటాయింపుపై సిపిఐ ఆగ్రహం
- తక్షణమే వెనక్కి తగ్గాలని డిమాండ్
- దేశ భద్రతతో ముడిపడి ఉన్నందున ఆచితూచి వ్యవహరించాలని హితవు
- మోదీ నాయకత్వంలో భారత్ ట్రంప్‌కు తలొగ్గుతుందని విమర్శ




న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ పూర్తి స్థాయిలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు తలొగ్గుతోందని సిపిఐ విమర్శించింది. ట్రంప్, ఆయన సహచరులు చెప్పినట్లు తలాడిస్తోందని దుయ్యబట్టింది. ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు వాణిజ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు మోదీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని సిపిఐ కార్యదర్శి వర్గం మంగళవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం తరువాయి 2లో

## ఒయు నిర్వహణలో ఇబ్బంది ఉంటే చర్చించి చర్యలు తీసుకోవాలి



ధర్నాలు, ఆందోళనలు నిషేధించడం అప్రజాస్వామికమవుతుంది
అసెంబ్లీ జిరో అవర్‌లో కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ధర్నాలు, ఆందోళనలు, నినాదాలు చేయడాన్ని నిషేధించడం అప్రజస్వామిక చర్యగా ఉంటుందని, విశ్వవిద్యాలయ నిర్వహణలో ఏమైనా ఇబ్బంది ఉంటే విద్యార్థి సంఘాలు, ఫ్యాకల్టీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమష్టిగా చర్చించి, తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభలో మంగళవారం జరిగిన జీరో అవర్‌లో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఉస్మానియా తరువాయి 2లో

## ఉపాధిహామీ వేతనం రూ.400కు పెంచాలి

- ఏడాదికి 150 పనిదినాలు కల్పించాలి
- రాజ్యసభలో సోనియాగాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జాతీయ ఉపాధిహామీ పథకాన్ని క్రమబద్ధంగా అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకం కింద రోజువారీ కూలీ రూ. 400లకు పెంచాలని, ఏడాదికి 150 రోజులు ఉపాధిహామీ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. మంగళవారం రాజ్యసభలో సోనియాగాంధీ జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. యుపిఎ హయాంలో నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం 2005ను తీసుకోచ్చారని చెప్పారు. ఈ చట్టం లక్షలాది మంది గ్రామీణపేదలకు రక్షణ వలయంగా మారిందన్నారు. అయితే ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని ఒక క్రమబద్ధంగా అణచివేస్తుందని సోనియా గాంధీ విరుచుకుపడ్డారు. ఈ పథకం కోసం రూ. 86,000 కోట్ల వద్దే బడ్జెట్ కేటాయింపులు నిలిచిపోయాయని, ఇది జిడిపిలో 10 సంవత్సరాల కనిష్ట స్థాయి అని ఆమె ఆరోపించారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ప్రభావవంతమైన బడ్జెట్ రూ. 4,000 కోట్లు తగ్గుతుందని, కేటాయించిన నిధులలో దాదాపు 20 శాతం గత సంవత్సరాల నుండి పెండింగ్‌లో ఉన్న బకాయిలను తరువాయి 2లో

## మహారాష్ట్రలో ఉద్రిక్తత

- ఔరంగజేబు సమాధి తొలగించాలని నాగపూర్‌లో హిందూ మూకల నిరసన ప్రదర్శన
- వదంతుల వ్యాప్తితో పలుచోట్ల హింస, వాహనాలు దగ్ధం
- 34 మంది పోలీసులకు గాయాలు, కర్ఫ్యూ
- హింస ముందస్తు కుట్ర : ముఖ్యమంత్రి ఫడ్నవీస్




**నాగపూర్ :** మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ హిందూ మూకలు నాగపూర్‌లో చేసిన నిరసన ప్రదర్శనతో మ హారాష్ట్రలో మత ఉద్రిక్తతలు నెలకొన్నాయి. వదంతులు వ్యాప్తి చెందడంతో హింస చెలరేగింది. వాహనాలు దగ్ధమయ్యాయి. ఇళ్ళు, క్లినిక్‌లు ధ్వంసమయ్యాయి. ఛావా సినిమాలో చిత్రించిన కొన్ని దృశ్యాలు ఈ ఘర్షణలకు ఆజ్యం పోశాయి. సోమవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో సెంట్రల్ నాగపూర్‌లోని మహల్ ప్రాంతలో ఉన్న చిట్నిస్ పార్కు వద్ద హింస చెలరేగింది. ఛత్రపతి శంభాజీనగర్‌జిల్లాలో ఉన్న 17వ శతాబ్దంనాటి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ మతోన్మాదశక్తుల విభాగం ఆందోళన చేసిన సందర్భంగా మరో మతానికి చెందిన పవిత్ర గ్రంథాన్ని దగ్ధం చేశారన్న వదంతులు వ్యాప్తి చెందడంతో చిట్నిస్ పార్కు వద్ద హింస చెలరేగింది. అదేవిధంగా సోమవారం రాత్రి 10.30, 11.30 గంటల సమయంలో ఓల్డ్ భండారా రోడ్ సమీపంలోని తరువాయి 2లో

## పిటిషనర్‌కు కోటి జరిమానా

- హైకోర్టు సంచలన తీర్పు
- కేసులు గుట్టుగా ఉంచడంపై ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక మంగళవారం సంచలన తీర్పు వెలువరించారు. హైకోర్టును తప్పుదోవ పట్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డికి రూ.కోటి జరిమానా విధించారు. ప్రభుత్వ భూముల కబ్జా యత్నాలను హైకోర్టు అడ్డుకున్నారు, భూమి వివాదానికి సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్ ఉందనే విషయాన్ని గుట్టుగా ఉంచి మరో ధర్మాసనం వద్ద అదే భూమి వ్యవహారంపై తిరిగి పిటిషన్ వేయడంతో ఆగ్రహించిన న్యాయమూర్తి పిటిషనర్‌కు భారీ జరిమానా విధించారు. ఒక పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, మరో ధర్మాసనం వద్ద పిటిషనర్ తరువాయి 2లో

## గాజాలో మళ్లీ భీకర దాడులు



- 400 మంది పైగా మృతి
- హమాస్ ప్రభుత్వ అధినేత అల్ దలిస్ మృతి
- భద్రతామండలి జోక్యానికి హమాస్ వినతి
- గాలికి కొట్టుకుపోయిన కాల్పుల విరమణ

**గాజా :** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంగాలికి కొట్టుకుపోయింది. హమాస్ ఉగ్రవాదులను మట్టుపెట్టేందుకు ఇజ్రా యెల్ సైన్యం మళ్ళీ భీకర యుద్ధం ప్రారంభించింది. కడపటి వార్తలు అందేసరికి 400 మందికిపైగా పాలస్తీనియన్లు దాడుల్లో మరణించారు. వీరిలో పిల్లలు, మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో మరో 660 మంది గాయపడ్డారు. గాజా స్ట్రిప్‌లో జరిపిన దాడుల్లో హమాస్ ప్రభుత్వ అధినేత ఎస్సామ్ అల్‌దలిస్ కూడా మరణించినట్లు హమాస్ తరువాయి 12లో



## సిపిఐ సిద్ధాంతాలు విస్తృతంగా ప్రజల్లోకి

- ఏప్రిల్ 23 నుంచి దేశవ్యాప్తంగా రాజకీయ ఎజెండాతో ప్రచార కార్యక్రమాలు
- సిపిఐ పునర్నిర్మాణమే లక్ష్యం : డి.రాజా
- ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శ

**అమరావతి:** సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణమే లక్ష్యంగా దృష్టి కేంద్రీకరించామని, ఆ దిశగా పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వెల్లడించారు. సిపిఐ ఆవిర్భవించిన డిసెంబరు 26, 1925 నుంచి కొనసాగిన అనేక ఉద్యమాలు, ఘట్టాలను రాజా సంక్షిప్తంగా గుర్తుచేశారు. విజయవాడ దాసరి భవన్‌లో సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తరువాయి 12లో

# యెమెన్‌లో హౌతీలపై ఆగని దాడులు





సనా : యెమెన్‌లో హౌతీ ఉగ్రవాదులపై అమెరికా సైన్యం దాడులు మూడోరోజు మంగళవారంనాడు కూడా కొనసాగాయి. మూడోరోజు దాడుల్లో డజన్లసంఖ్యలో హౌతీలు మరణించారు. వారి స్థావరాలు ధ్వంసమయ్యాయి. రెండు రోజుల దాడుల్లోనే 53 మంది యెమెన్‌లో మరణించారు. ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్, దాని మిత్రదేశాల వాణిజ్య నౌకలపై దాడులు పునఃప్రారంభిస్తామని హౌతీలు ప్రకటించారు. దీంతో అమెరికా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మార్చి 15వ తేదీన యెమెన్‌లో తిష్టవేసి ఉన్న హౌతీలపై వైమానిక దాడులు ప్రారంభించింది. అమెరికా విమానవాహక నౌకల ద్వారా యెమెన్‌లో హౌతీలపై ఈ దాడులు జరుగుతుండగా మరోవైపు హౌతీలు కూడా అమెరికా హ్యారీ ట్రూమన్ విమానవాహకనౌకపై దాడులు చేస్తున్నారు. జనవరిలో ట్రంప్ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టాక ఒక విదేశంపై చేసిన అతి పెద్ద సైనిక దాడి ఇదే అని హౌతీల ''అల్ మషీరాహ్'' టీవీ ప్రకటించింది. హౌతీలు గురిపెట్టే ప్రతితూటాకు ఇరాన్ ప్రతిఫలం అనుభవించవలసి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు హెచ్చరిక చేశారు. హౌతీలపై దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. 2014లో హౌతీలు యెమెన్‌కు ఆక్రమించుకున్నారు. యెమెన్‌లో దాదాపు మూడు వంతుల ప్రాంతంలో హౌతీలే ఉన్నారు. 2023 అక్టోబరు మొదటివారం తర్వాత గాజాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటిస్తూ హౌతీ ఉగ్రవాదులు ఎర్రసముద్రంలో ఇజ్రాయెల్, అమెరికా దాని మిత్రదేశాల వాణిజ్య నౌకలపై దాడులు ప్రారంభించారు. ఇలా దాదాపు 100 వాణిజ్య నౌకలపై హౌతీల దాడులు జరిగాయి. అనేక నెలలుగా ఇజ్రాయెల్ వాణిజ్యనౌకను హైజాక్‌చేసి దానిని హౌతీలు ఇప్పటికీ తమ అధీనంలోనే ఉంచుకున్నారు.

# తైవాన్ సమీపంలో చైనా జల,వాయు విన్యాసాలు



తైపే : తైవాన్ సమీపంలో చైనా సైన్యం జల,వాయు విన్యాసాలు నిర్వహించింది. సుమారు 59 ఎయిర్ క్రాఫ్ట్‌లు తమ దీవి దేశాన్ని చుట్టుముట్టాయని, తమ దేశం చుట్టూ చైనా సైన్యం విన్యాసాలు చేస్తోందని తైవాన్ ఒక ప్రకటనలో పేర్కొంది. తొమ్మిది యుద్ధనౌకలు, రెండు బెలూన్స్ కూడా తమ దీవి దేశాన్ని చుట్టుముట్టాయని పేర్కొంది. గడచిన అక్టోబరు తర్వాత భారీస్థాయి విన్యాసాలు చేయడం మళ్ళీ ఇదే. ఇటీవల అమెరికా చేసిన ప్రకటనలకు దీటుగా తాము ఆచరణలో ఈ విధంగా సైనిక విన్యాసాల ద్వారా సమాధానం చెబుతున్నట్లు చైనా ప్రకటించింది. చైనా దాదాపు రోజువారీ ప్రాతిపదికపై తమదేశం చుట్టూ సైనిక విన్యాసాలు చేస్తోందని తైవాన్ విమర్శించింది. తైవాన్ రక్షణమంత్రి వెల్లింగ్టన్ కూ ఆ దేశ పార్లమెంటులో ఒక ప్రకటన చేస్తూ, తైవాన్‌కు చైనా అతిపెద్ద ప్రమాదంగా మారిందని, ఈ ప్రాంతంలో శాంతికి పెద్ద అడ్డంగా ఉందని అన్నారు. తైవాన్ వేర్పాటువాదులకు ఇదొక హెచ్చరిక అని చైనా విదేశీమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ అన్నారు.

## చర్యలు తీసుకోవాలి (మొదటి పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమానికి పోరాట క్షేత్రంగా నిలిచిందని గుర్తు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రారంభమైన సుమారు 80 సంవత్సరాల కాలంలో అనేక వామపక్ష, ప్రగతిశీల మేధావులు వచ్చారన్నారు. వారంతా అనేక పోరాటాలకు ఆద్యులుగా నిలిచారని, అంత గొప్ప విశ్వవిద్యాలయంలో ధర్నాలు, నినాదాలను నిషేధం విధించడం అప్రజాస్వామికంగా ఉంటుందన్నారు. శాసనసభ సమావేశాల నేపథ్యంలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, పోలీసులు అనుమతులు ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. నిరసన కార్యక్రమాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. బాధితులు తమ బాధలను చెప్పుకునేందుకు హైదరాబాద్‌కు వస్తారని, శాసనసభ సమావేశాలు జరుగుతున్న సమయంలో తమ డిమాండ్లను చెబితే, కొంత వరకు పరిష్కారం అవుతాయని వారు ఆశిస్తారని కూనంనేని తెలిపారు.

**న్యాయ స్థానం ద్వారా ఇందిరా పార్కు ధర్నా చౌక్‌ను పునరుద్ధరించాం..**

గత ప్రభుత్వ హయంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌ను రద్దు చేస్తే, అనేక పోరాటాలు, న్యాయ స్థానం ద్వారా ధర్నాచౌక్ పునరుద్ధరణ జరిగిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014 ముందు శాసనసభ సమావేశాల సమయంలో ధర్నాచౌక్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాల వద్దకు ప్రభుత్వమే ఆయా శాఖల మంత్రులను పంపించి, హామీల ద్వారా భరోసా ఇచ్చే సంప్రదాయం ఉండేదని కూనంనేని సాంబశివరావు తెలిపారు. రైతు సమస్యలపై గతంలో కొల్లి నాగేశ్వర్ రావు చేపట్టిన నిరసన కార్యక్రమానికి అప్పటి మంత్రిగా తుమ్మల నాగేశ్వర్ రావు వెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. శాసనసభ సమావేశాల సమయంలో ఆందోళన, నిరసన తెలిపేందుకు అవకాశాలు కల్పించాలని, అనుమతులు ఇవ్వాలని, ఉమ్మడి రాష్ట్రంలో 2014 సంవత్సరానికి పూర్వం ఉన్న పరిస్థితులను పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.


**తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..**

తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది ఉద్యమకారులపైన కేసులు నమోదయ్యాయని, జైలుకు వెళ్లిన వారు కూడా ఉన్నారని, ప్రస్తుతం వారి పరిస్థితులు బాగా లేవని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వం వారికి ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. గ్రామ సభులు, లేదా అధికారుల ద్వారా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సూచించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో గురైన కుటుంబాలు ఉంటే, వారికి కూడా ఏదైనా సహాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.





## మా భయాలే నిజమయ్యాయి



టెల్‌అవీవ్ : గాజాపై ఇజ్రాయెల్ సైనిక దాడులు పునఃప్రారంభించడంతో ఆ దేశంలో ఉన్న బందీల కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. బందీల కుటుంబాలవారంతా ఇజ్రాయెల్‌లో ఒక సంఘంగా ఏర్పడి ప్రభుత్వంతో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇజ్రాయెల్ సైన్యం తాజా దాడులు ప్రారంభించడంతో బందీల కుటుంబాలు టెల్‌అవీవ్‌లో వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శన చేపట్టాయి. తక్షణం దాడులు ఆపాలనీ, తమ బంధువులను కాపాడాలని కోరాయి. తమ బంధువులను ఇజ్రాయెల్ ప్రభుత్వం పణంగా పెట్టిందని, వారి ప్రాణాలను త్యాగం చేసి దాడులు పునఃప్రారంభించిందనీ ఆందోళన వ్యక్తం చేశారు. విడుదలైనవారు విడుదల కాగా ఇంకా 59 మంది ఇజ్రాయెలీ పౌరులు హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు. ఐతే వీరిలో కేవలం 24 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని కూడా అంచనావేస్తున్నారు. దాడులు చేయడంవల్ల బందీల జాడ తెలియకుండా పోతుందనీ, సజీవులను కూడా హతమార్చే ప్రమాదం ఉందని బందీల కుటుంబాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యుద్ధం ఆపాలనీ, సంప్రదింపుల ద్వారా బందీలను విడుదల చేయాలని వారి కుటుంబీకులు నేతన్యాహూను మొదటి నుండీ కోరుతున్నారు. తమ భయాలే ఇప్పుడు నిజమయ్యాయనీ, తమ బంధువుల ప్రాణాలను ప్రభుత్వం త్యాగం చేసిందని బందీల కుటుంబీకులు రోదిస్తున్నారు.

## భువికి సునీతా (మొదటి పేజీ తరువాయి)

మీ ప్రయాణం శుభప్రదం కావాలి'' అని పేర్కొన్నారు. అంతరిక్షంలో బాధ్యతలు నిర్వహించడానికి వెళ్ళిన సునీతా విలియమ్స్, విల్మోర్ ఇద్దరూ ఎనిమిది రోజులే అక్కడ గడపాల్సి ఉండగా, తిరుగు ప్రయాణ సాధనంలో సాంకేతిక లోపం వల్ల వారు తొమ్మిది నెలలు అక్కడే చిక్కుకుపోయారు. దీంతో వారిద్దరూ ప్రపంచ ప్రజలదృష్టిలో నిత్యం వార్తల్లోకి వచ్చారు. ఎట్టకేలకు నాసా ప్రయత్నాలు ఫలించడంతో మంగళవారం ఉదయం 10 గంటలకు ఐఎస్ఎస్ నుండి విడిపోయిన స్పేస్ఎక్స్ క్యాప్స్యూల్ 17 గంటలు ప్రయాణించి భూమికి చేరుకుంటున్నది.

## రాష్ట్ర బడ్జెట్ (మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టడానికి ముందు ఉదయం 9:00 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం సమావేశమై 2025–26 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలపనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం రెండవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈసారి వార్షిక బడ్జెట్ భారీగా ఉండబోదని ఇటీవల సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్న నేపథ్యంలో గత ఏడాది బడ్జెట్ కంటే స్వల్పంగానే పెరగవచ్చని ఆర్థిక, రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉండగా 2025–26 బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండనున్నాయోనని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది, ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు నిధులను కేటాయించనున్నదనే విషయాలు ఆసక్తిగా మారాయి. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## రూ.400కు పెంచాలి (మొదటి పేజీ తరువాయి)

క్లియర్ చేయడానికి ఉపయోగించబడుతుందని అంచనాలు సూచిస్తున్నాయని ఆమె అన్నారు. వీటికి తోడు ఈ పథకం బహుళ సవాళ్లను ఎదుర్కొంటుందని, వాటిలో మినహాయింపు ఆధార్ ఆధారిత చెల్లింపు, జాతీయ మొబైల్ మానిటరింగ్ వ్యవస్థ, వేతన చెల్లింపులో నిరంతర జాప్యాలు, ద్రవ్యోల్బణాన్ని భర్తీ చేయడానికి వేతన రేట్లు సరిపోవు అని ఆమె పేర్కొన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్ జియోట్యాగ్ చేయబడిన ఛాయాచిత్రాలతో పాటు ఉపాధిహామీ పని ప్రదేశాలలో కార్మికుల వాస్తవ హాజరు నమోదుకు అనుమతిస్తుంది. కాగా, పథకాన్ని కొనసాగించడానికి, విస్తరించడానికి తగిన ఆర్థిక కేటాయింపులు చేయాలని సోనియాగాంధీ డిమాండ్ చేశారు. అదే విధంగా కనీస వేతనాన్ని రోజుకు రూ.400కి పెంచాలని, సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. హామీ ఇవ్వబడిన పనిదినాల సంఖ్యను సంవత్సరానికి 100 నుండి 150కి పెంచాలని సూచించారు. గత సంవత్సరం సార్వత్రిక ఎన్నికలు ప్రకటించడానికి ముందు 2024–25 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ వేతనాలను నామమాత్రంగా 3–10 శాతం పెంచిందని గుర్తుచేశారు. ఈ వేనాలు రాష్ట్రాల వారీగా మారుతూ ఉంటాయని, అవి ఒక రోజుకు రూ.237 (ఉత్తరాఖండ్) నుండి రూ.300 (ఆంధ్రప్రదేశ్) వరకు ఉన్నాయన్నారు. ఆధార్ చెల్లింపుల బ్రిడ్జి వ్యవస్థ (ఎపిబిఎస్) ఎన్ఎంఎంఎస్‌లను తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఉపాధిహామీ పథకం ద్వారా గౌరవప్రదమైన ఉపాధి, ఆర్థిక భద్రతను అందించేలా చూసుకోవడానికి ఈ చర్యలు చాలా అవసరమన్నారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో రాజ్యసభకు ఎన్నికైనప్పటి నుండి సోనియా గాంధీ జీరో అవర్‌లో ఒక అంశాన్ని లేవనెత్తడం ఇది రెండవసారి.

## భద్రతకు విఘాతం (మొదటి పేజీ తరువాయి)

చేసింది. అమెరికా అంతరిక్ష సంస్థ స్టార్ లింక్‌కు స్పెక్ట్రమ్ వనరుల కేటాయింపుపై తక్షణమే వెనక్కి తగ్గాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఇది తేలికగా తీసుకునే అంశం కాదని దేశ భద్రతతో కూడుకున్నది కాబట్టి ఆచితూచి వ్యవహరించాలని హితవు పలికింది. 'హై స్పీడ్ శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలను భారత్‌లో అందించేందుకు స్టార్ లింక్‌తో జియో, ఎయిర్‌టెల్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఇందుకు భారత టెలికమ్యూనికేషన్స్ విభాగం కూడా అంగీకారం తెలిపింది. ఈ పరిణామం దేశ భద్రతకు, ఇతరత్రాలకు తీవ్ర ముప్పు కలిగించవచ్చు' అని సీపీఐ పేర్కొంది. 2జీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకంగా తాజా వ్యవహారం తోస్తోందని తెలిపింది. స్పెక్ట్రమ్ కేటాయింపు పారదర్శకంగా, బహిరంగ వేలం ద్వారా జరగాలని సూచించింది. ప్రైవేటు ఒప్పందాలు జరిగితే దేశ చట్టాలను అతిక్రమించడమే అవుతుందని సీపీఐ తెలిపింది. విదేశీ అంతరిక్ష సంస్థకు కీలక శాటిలైట్ స్పెక్ట్రమ్ డేటా ఇవ్వడమంటే దేశానికి ముఖ్యమైన భద్రతా మ్యాప్‌లు, ప్రాంతాలు, వనరులు, ప్రజల కాల్ డేటా అప్పగించి... ముప్పును కొనితెచ్చుకోవడమే అవుతుందని హెచ్చరించింది. పెంటగాన్, నాసా, అమెరికాకు సర్వీస్ ప్రొవైడర్‌గా ఉన్న స్టార్ లింక్‌కు భారత రక్షణ, ఇస్రో డేటా ఇవ్వడం ఎంత వరకు సమంజసమో కేంద్రం ఆలోచించాలని సూచించింది. 'విదేశీ సంస్థలను నమ్మి, భారత వ్యూహాత్మక స్పెక్ట్రమ్ డేటాను ఇవ్వడానికి ముందు రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం వేళ స్టార్ లింక్ సేవల ఉపసంహరణను హెచ్చరికగా పరిగణించాలి. సార్వభౌమ భారతదేశ నిర్మాణానికిగాను టెలికమ్యూనికేషన్స్ కల్పన, ఖనిజ వనరుల గుర్తింపు, వాతావరణం, వ్యవసాయం, అంతరిక్ష అన్వేషణల దిశగా 1960లో విక్రమ్ సారాభాయి, ఇతర శాస్త్రవేత్తల విజన్లతో ఇస్రో స్థాపించబడింది' అని సీపీఐ పేర్కొంది.

## కోటి జరిమానా (మొదటి పేజీ తరువాయి)

ఉత్తర్వులు పొందడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. చట్ట ప్రకారం పిటిషన్‌లోని అంశాలకు సంబంధించి అప్పటికే పిటిషనర్ కేసు వేసుంటే ఆ విషయాలను తాజా పిటిషన్‌లో చాలా స్పష్టంగా వివరించాల్సివుంటుంది. అలా చేయకుండా తొలి పిటిషన్ గురించి ప్రస్తావన లేకుండా మళ్లీ పిటిషన్ వేసి హైకోర్టును తప్పుదోవ పట్టించడంపై జస్టిస్ నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.ఒక కోటి జరిమానా విధిస్తూ సంచలన తీర్పు వెలువరించారు.బండ్లగూడ మండలం కందికల్ సర్వే నెంబర్ 310/1, 310/2లలో 9.11 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిని అధికారులు రిజిస్ట్రేషన్ చేయడం లేదని వెంకట్రామిరెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్‌కు చెందిన ఆ భూములు రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ బండ్లగూడ తహశీల్దార్ లేఖ రాశారని పిటిషనర్ తరపున న్యాయవాది కందగట్ల ధీరజ్ వాదించారు. పిటిషనర్ తన భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పిటిషనర్ పేర్కొన్న సర్వే నెంబర్లు కందికల్ గ్రామంలో లేవని, ఆ గ్రామంలో 309/5తోనే సర్వేనెంబర్ ముగుస్తుందని ప్రభుత్వ న్యాయవాది ప్రతివాదన చేశారు.. తప్పుడు పత్రాలు సృష్టించిన పిటిషనర్ వెంకట్రామిరెడ్డి ప్రభుత్వ భూమిని కాజేసే కుట్రను అడ్డుకోవాలని కోరారు. ఈ భూమిపై గతంలోనే పిటిషనర్ తండ్రి హైకోర్టులో రెండు వేర్వేరు వ్యాజ్యాలను దాఖలు చేశాక వాటిని వాపస్ తీసుకున్నారని చెప్పారు. ఈ పిటిషన్ల గురించి వెంకట్రామిరెడ్డి తన అఫిడవిట్‌లో కనీసం ప్రస్తావన కూడా చేయలేదన్నారు. పాత పిటిషన్ల గురించి చెప్పకుండా వెంకట్రామిరెడ్డి కోర్టును తప్పుదోవ పట్టించారన్నారు. కందికల్‌లోని ప్రభుత్వ భూమిపై ఇప్పటికే యాజమాన్య హక్కులపై న్యాయవివాదాలు కోర్టుల్లో ఉన్నాయన్నారు. ఈ వాదనల తర్వాత పాత కేసులోని పత్రాలను పరిశీలించిన న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక పిటిషనర్ ఉద్దేశపూర్వకంగా కోర్టును తప్పుదోవ పట్టించడంతో పాటు, విలువైన కోర్టు సమయాన్ని వృధా చేశారని మండిపడ్డారు. పిటిషనర్‌కు గత హైకోర్టు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అక్షరాలా కోటి రూపాయలను జరిమానాగా విధిస్తూ సంచలన తీర్పును వెలువరించారు.

## న్యాయం జరగాలి (మొదటి పేజీ తరువాయి)

వర్గీకరణ ప్రస్తుతం పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలలో అమలు జరుగుతుండగా, ఇప్పుడు 4వ రాష్ట్రం తెలంగాణ కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా దేశ వ్యాప్తంగా ఎస్‌సి వర్గీకరణను అమలు చేయాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. అత్యంత వెనకబడిన దళితులు అభివృద్ధి చెందాలంటే వారికి ఆర్యోగశ్రీ, ఉచిత విద్య సదుపాయాలు మాత్రమే సరిపోవని, వైద్యపరంగా పూర్తి ఖర్చులను ప్రభుత్వమే భరించడంతో పాటు అత్యంత నాణ్యమైన విద్యను అందించాలని, హాస్టళ్లలో విద్యార్థులు ఆత్మగౌరవంగా బతికే విధంగా అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువవికాస పథకం కింద అన్ని దళిత కుటుంబాలకు అందే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్‌సిలకు జనాభా ప్రకారం బడ్జెట్‌లో నిధులను కేటాయించడంతో పాటు ఆ నిధులను వారి అభ్యున్నతికే ఖర్చు చేయాలని సూచించారు. సబ్‌ప్లాన్ నిధులను కేటాయించినప్పటికీ వాటిని అష్ట వంకర్లు తిప్పుతూ ఇష్టానుసారంగా ఖర్చు చేయడం భావ్యం కాదన్నారు. ఈ నిధులను ఎస్‌సిల అభ్యున్నతికే ఖర్చు చేసే విధంగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి మెహతర్, రెల్లి ఉపకులాల వారు ఒకేవిధంగా పను లు నిర్వహిస్తారని, అయితే మెహతర్‌ను మాత్రం అత్యంత వెనకబడిన గ్రూ ప్1లో చేర్చగా, రెల్లి ఉపకులాన్ని మాత్రం మెరుగైన ప్రయోజనాలు పొందిన గ్రూప్3లో చేర్చడం పట్ల వారు తమకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని కోరారు. మాంగ్ ఉప కులాలనికి సంబంధించి కుల ధృవీకరణ పత్రం తీసుకోవాలంటే కేవలం ఆర్‌డిఒకు మాత్రమే జారీచేసే అధికారాలు ఉన్నాయని, తహసీల్దార్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని చెప్పారు. వర్గీకరించిన మూడు గ్రూప్‌లలో పొందికలు సరిగ్గా లేవని పలువురు బాధితులు తన దృష్టికి తీసుకువచ్చారని, అలాంటివి ఏమైనా ఉంటే సరిదిద్దాలని కూనంనేని సూచించారు.

## ఓటర్ ఐడితో ఆధార్ లింక్ (మొదటి పేజీ తరువాయి)

దీనికి సంబంధించిన కసరత్తును త్వరలోనే చేయనుంది. ఓటరు జాబితాల తయారీలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయంటూ ఇటీవల విపక్షాలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం నాడు ఒక కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కేంద్ర హోం కార్యదర్శి, లెజిస్టేటివ్ సెక్రటరీ (న్యాయమంత్రిత్వ శాఖలోనిది), ఎలక్ట్రానిక్స్, ఐటి శాఖ కార్యదర్శి, యుఐడిఎఐ సి.ఇ.ఒ ఓటర్ కార్డుఆధార్ అనుసంధానంపై జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. 2023ఏప్రిల్ 23న ప్రభుత్వం రాజ్యసభకు ఇచ్చిన ఒక రాతపూర్వక సమాధానంలో ఓటర్ ఐడి కార్డులను ఆధార్ వివరాలతో అనుసంధానం చేసే ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని తెలిపింది. ఈ కసరత్తు ప్రక్రియ డ్రైవ్ కసరత్తు మొదలైందని, అయితే ఎలాంటి టార్గెట్ లేకుండా ప్రతిపాదిత కసరత్తు కోసం సమయపాలన నిర్దేశించబడిందని తెలియజేసింది. ఆధార్ వివరాలతో లింక్‌చేయని వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించబడవు అని ప్రభుత్వం నొక్కిచెప్పింది. మంగళవారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ఒక ప్రకటనలో భారతీయ పౌరుడిగా ఉండటం ద్వారా మాత్రమే ఓటింగ్ హక్కులను పొందగలుగుతారని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఆధార్ tఒక వ్యక్తి గుర్తింపును నిలదొక్కుకునేలా చేసిందని ఎన్నికల సంఘం తెలిపింది. కాబట్టే ఎలక్టోర్ ఫోటో ఐడెంటిటీ కార్డు (ఇపిఐసి)ని ఆధార్ కార్డుతో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326లోని 1950 ప్రజాప్రాతినిథ్య చట్టంలోని సెక్షన్లు 23(4), 23(5), 23(6), సుప్రీంకోర్టు తీర్పు(2023యొక్క) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది. ఈ నేపథ్యంలో త్వరలోనే యుఐడిఎఐ, ఎన్నికల సంఘం సాంకేతిక నిపుణులు, సాంకేతిక సంప్రదింపులు జరుగనున్నట్లు ఇసి వెల్లడించింది. ఈ చట్టం ఓటరు జాబితాలో ఆధార్ డేటా బేస్‌తో వాలంటరీ సీడింగ్‌ను అనుమతిస్తుందని తెలియజేసింది.

**10రోజులలోగా పిటిషనర్లు పోల్ ప్యానెల్ ముందు ఒపీనియన్స్ : 'సుప్రీం'**

పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల ఓటింగ్ డేటాను తన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలనే డిమాండ్‌పై చర్చిండానికి సిద్ధంగా ఉన్నామని మంగళవారం భారత ఎన్నికల సంఘం(ఇసి) సమర్పించిన వాదనలను సుప్రీంకోర్టు గుర్తించింది. పిటిషనర్లు 10రోజులలో పోల్ ప్యానెల్ ముందు తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జస్టిస్ కెవి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రా, 2019లో ఎన్‌జిఓ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ దాఖలు చేసిన ఈ రెండు పిటిషన్‌లను విచారణ చేపట్టింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నిలు ముగిసిన 48గంటల్లోగా వెబ్‌సైట్‌లో పోలింగ్ స్టేషన్ వారీగా ఓట్లేసిన ఓటర్ల జాబితాను ఉంచేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ దాఖలు చేసిన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం (పిల్)లో కోరారు. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది మనీందర్ సింగ్ హాజరయ్యారు. ఈ సమస్యకు సంబంధించిన గ్రీవెన్స్‌ను చర్చించేందుకు ఎన్నికల సంఘం ప్రధానాధికారి గ్యానేష్‌కుమార్ కలవాలని కోరుతున్నట్లు చెప్పారు. ఆయన ప్రస్తుతం నూతన చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా ఉన్నారు. పిటిషనర్లు ఆయనను కలిసి దీనిపై చర్చించవచ్చని మనీందర్ సింగ్ ధర్మాసనానికి తెలియజేశారు. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ 'పిటిషనర్లు ఇసికి వినతి పత్రాలను 10రోజులలో అందజేయవచ్చు' అని సూచించారు.

## ఉద్రిక్తత (మొదటి పేజీ తరువాయి)

హన్సాపూరిలో ఘర్షణ చెలరేగింది. అల్లరి మూకలు ఆ ప్రాంతంలో ఉన్న అనేక వాహనాలను దగ్ధం చేశాయి. ఇళ్ళను, క్లినిక్‌లను ధ్వంసం చేశాయి.ఈ ఘర్షణల సందర్భంగా హిందూ–ముస్లింలకు చెందిన అల్లరి మూకలను అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఘర్షణల్లో 34 మంది పోలీసులు గాయపడ్డారు. పరిస్థితులను అదుపు చేసేందుకు పలు చోట్ల కర్ఫ్యూ విధించారు. ఐతే ఈ హింస పథకం ప్రకారం చేసిన కుట్ర అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారంనాడు చెప్పారు. జరిగిన హింస రాష్ట్రంలో మతపరమైన అశాంతిని వ్యాప్తి చేసేందుకు ముందుగానే రచించిన పథమన్నారు. ఈ కేసులకు సంబంధించి 50 మంది పైగా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, నాగపూర్‌లోని వివిధ ప్రాంతాలలో కర్ఫ్యూ విధించామనీ చెప్పారు. ఛావా సినిమా విడుదలతో భావోద్వేగాలు పెచ్చరిల్లాయని అన్నారు. ఈ సినిమాలో శంభాజీ మహారాజ్‌కు వ్యతిరేకంగా ఔరంగజేబు దారుణమైన ఘోరాలకు పాల్పడినట్లు చిత్రించారు. ఛిత్నిస్ నగర్, ఇతర ప్రాంతాలలో ఇళ్ళపై రాళ్ళతో దాడులు చేసేందుకు సుమారు రెండు లేదా మూడువేలమంది ముందుగానే అక్కడ గుమిగూడారనీ, వారే రాళ్ళు రువ్వి దాడులు చేశారని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే అన్నారు. ఈ హింసకు సంబంధించి ఐదు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసినట్లు నాగపూర్ పోలీస్ కమిషనర్ రవీందర్ కుమార్ సింగాల్ చెప్పారు.కాగా మంగళవారంనాడు నాగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులను బిజెపి మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడు, మంత్రి చంద్రశేఖర్ బవంకులే పరామర్శించారు. సోషల్ మీడియాను ఉపయోగించి ఈ ప్రాంతంలో వాతావరణాన్ని, మనుషుల ఆలోచనలను కలుషితం చేశారనీ, ఈ విషయంలో మహారాష్ట్ర హోంశాఖ వైఫల్యం ఏమీ లేదని చంద్రశేఖర్ అన్నారు. హిందూ–ముస్లిం మతస్థులమధ్య హింస సందర్భంగా పోలీసులు ఒక బలమైన వలయంగా నిలబడ్డారనీ ఈ కారణంగా పెద్దసంఖ్యలో పోలీసులు గాయపడ్డారనీ చెప్పారు. అక్కడ పరిస్థితిలో కొంత ఉద్రిక్తత ఏర్పడిందనీ, కానీ నగరంలో పోలీసు బలగాలను మోహరించిన తర్వాత పరిస్థితి అదుపులో ఉండి శాంతి నెలకున్నదని చెప్పారు. కొత్వాలీ, గణేశ్‌పేట్, తెహసిల్, లఖడ్‌గంజ్, శాంతినగర్, సక్కర్‌దారా, నందన్‌వన్, ఇమాంబాద, యశోధర నగర్, కపిల్ నగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కర్ఫ్యూ విధించారు.

**పురిగొల్పింది ప్రభుత్వమే : ఒవైసీ**

ఎఐఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ మహారాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. నాగపూర్‌లో హింసకు ముందుగా ఇటీవల ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు చేసిన ప్రకటనలను పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ హింస చెలరేగడానికి అతిపెద్ద ప్రేరేపణ ప్రభుత్వంవైపు నుండే జరిగిందని, కానీ వారు కనీస బాధ్యతగా కూడా భావించడంలేదని విమర్శించారు. మొఘల్ చక్రవర్తి ఫోటోలను ప్రదర్శన సందర్భంగా సమాధి వద్ద దగ్ధం చేశారనీ, కానీ ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదనీ, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నాననీ అన్నారు.

## అసెంబ్లీ ఓకె (మొదటి పేజీ తరువాయి)

స్వయం ఉపాధి పథకంలో మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఎస్‌సి వర్గీకరణతో ఏ ఒక్కరికీ అన్యాయం జరకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామన్నారు. దశాబ్దాలుగా సాగిన వర్గీకరణ పోరాటంలో ఎంతోమంది ప్రాణాలను అర్పించారని, వారికి నివాళ్లు అర్పించారు. జెడ్‌పిటిసి, ఎంఎల్‌ఎ, ఎంపిగా తన మనసుకు ఈ వర్గాలు దగ్గరగా ఉన్నాయన్నారు. తాను సిఎంగా ఉన్నప్పుడే వర్గీకరణ సమస్యకు శాశ్విత పరిష్కారం దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సభా నాయకుడిగా తాను మాట ఇస్తున్నానని, ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు అన్యాయం జరగబోదని, రిజర్వేషన్లను పెంచి వాటిని అమలు చేసే బాధ్యతను తాను తీసుకుంటానని భరోసనిచ్చారు. వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే రాష్ట్ర ప్రభుత్వం తరపున తాను అసెంబ్లీ సమావేశంలోనే వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. వర్గీకరణను అమలు చేసేందుకు వీలుగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని, మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు ష మీమ్ అక్తర్ కమిషన్‌ను నియమించామని,ఈ కమిషన్ ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలను స్వీకరించిందని, కమిషన్ నివేదికను ప్రభుత్వం ఏ మాత్రం కూడా మార్చకుండా పూర్తిగా ఆమోదించిందని చెప్పారు. 59 ఎస్‌సి ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించిందని, ఈ కులాలు ఇప్పటి వరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ పలు సిఫార్సులు చేసిందని సభలో సిఎం వివరించారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించినందుకు సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2004లో ఉషా మెహ్రా కమిటీని ఏర్పాటు చేసి, వర్గీకరణ సమస్య పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, స్వాతంత్ర్యం వచ్చిన మొదటి కేంద్రమంతివర్గంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు న్యాయశాఖ మంత్రిగా పనిచేశారని, బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలోని ముఖ్యమైన రక్షణ శాఖ బాధ్యతలను అప్పగించారని సిఎం గుర్తు చేశారు. దేశంలోనే తొలిసారిగా దళిత వర్గానికి చెందిన దామోదరం సంజీవయ్యను ముఖ్యమంత్రిని చేసిందే కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. దళిత వర్గానికి చెందిన మల్లికార్జున ఖర్గేను ఎఐసిసి అధ్యక్షునిగా ఉన్నారన్నారు. సుప్రీం కోర్ట్‌లోని వర్గీకరణ కేసులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున వర్గీకరణకు అనుకూలంగా వాదనలు వినిపించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

**చారిత్రాత్మకమైన నిర్ణయం : మంత్రి దామోదర రాజనరసింహా**

షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనరసింహా అన్నారు. శాసనసభలో ఎస్‌సివర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా దళితుల దశాబ్దాల కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నేరవేర్చిందని చెప్పారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల ఏకీకృత, ఏకరీతి అభివృద్ధికి గాను వారి రిజర్వేషన్లను హేతు బద్ధీకరిస్తూ ఎస్‌సిలను 1,2,3 మూడు గ్రూప్‌లుగా వర్గీకరిస్తూ మంగళవారం శాసనసభలో మంత్రి దామోదర రాజనరసింహా బిల్లును ప్రవేశ పెట్టారు. సభలో బిల్లుపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిపిఐ శాసనసభా పక్షనాయకులు కూనంనేని సాంబశివరావు, బిజెపి సభ్యులు పాయల్ శంకర్, బిఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్‌రెడ్డి, మణిక్యరావు, ఎంఐఎం సభ్యులు మాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ సభ్యులు గడ్డం వివేక్, మందుల శామ్యూల్, వేముల వీరేశం, కాలే యాదయ్య, కె.సత్యనారాయణ, కె.ఆర్.నాగరాజు , కడియం శ్రీహరి, తొట లక్ష్మీ కాంతరావు పాల్గొన్నారు. తొలుత మంత్రి దామోదర రాజనరసింహా మాట్లాడుతూ దళితుల వర్గీకరణ దశాబ్దాల కలను నెరవేరుస్తున్న విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ప్రశంసించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన 6 నెలల లోపే ఎస్‌సి వర్గీకరణ ప్రక్రియను పూర్తిచేసి బిల్లు రూపంలో చట్టసభలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఎస్‌సి వర్గీకరణ డిమాండ్ ఈనాటిది కాదని, స్వాతంత్ర్యం వచ్చిన 15 ఏళ్లకే ఇది మొదలై 1990 నుంచి ఉద్యమం తీవ్రతరమైందన్నారు. ఈ ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారని, వారి ఆశయాలను, దశాబ్దాల మాదిగల ఆకాంక్షను సిఎం రేవంత్‌రెడ్డి నెరవేరుస్తున్నారు. గతంలో ఓసారి వర్గీకరణ చేసినా, కోర్టు తీర్పులతో అది నిలిచిపోయిందని, నాటి వర్గీకరణకు, నేటి వర్గీకరణకు పెద్దగా తేడా ఏమి లేదన్నారు. కేవలం 1.78 లక్షల జనాభా ఉన్న 26 కులాలు మాత్రమే ఇతర గ్రూపుల్లో చేర్చబడ్డాయని ఇది మొత్తం మాదిగల్లో ఈ 26 కులాల జనాభా 3.43 శాతమే కావడం గమనార్హమని, మిగిలిన 33 కులాలు, పాత గ్రూప్‌ల ప్రకారమే కొనసాగుతున్నాయన్నారు. దళితులు అస్పృశ్యత, అత్యంత నీచమైన అంటరానితనంతో పీడించబడ్డారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో 19వ శతాబ్దంలో అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ, ఆత్మగౌరవం కోసం మహాత్మ జ్యోతిరావు పూలె, మహాత్మ గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వంటి మహనీయులు సామాజిక ఉద్యమాలను చేపట్టారని, ఆ పోరాటాల ఫలితంగా ఉపశమన చర్యలుగా సంఘ సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు. అందులో భాగంగానే 1931లో తొలిసారి కుల గణన చేశారని, 1936లో షెడ్యూల్డ్ కులాల జాబితాను ప్రకటించారని, ఈ దేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత అత్యంత వెనుకబడి ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఆ రిజర్వేషన్ల ఫలాలు ఎస్‌సిలలో అన్ని వర్గాలకు సమానంగా అందకపోవడంతో అందులో అనేక ఉపకులాలు సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ పరంగా వెనకబాటుకు గురయ్యాయని, ఈ నేపథ్యంలో వర్గీకరణ ఉద్యమం పుట్టుకురావడం, ఓసారి చట్టం రూపంలో రావడం దానిని సుప్రీంకోర్టులో కేసు వల్ల అమలు కాకపోవడం, తిరిగి అదే సుప్రీంకోర్టు ఎస్‌సి వర్గీకరణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తూ తీర్పు నివ్వడం జరిగిందని మంత్రి వివరించారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ వేయడం, ఆ కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 59 మాదిగ, మాల ఉప కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరిస్తూ చట్టం తీసుకురావడం జరిగిందని చెప్పారు.

**చారిత్రత్మాకమైన రోజు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ఎస్‌సిల 3 దశబ్దాల వర్గీకరణ కల నిజమవుతున్న ఈ రోజు శాసనసభ చరిత్రలోనే ఇది చారిత్రత్మాకమైనది మంత్రి ఉత్తమ్ కుమార్ అభివర్ణించారు. ఎస్‌సి వర్గీకరణకు సంబంధించి చారిత్రక బిల్లు ప్రక్రియలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నన్నారు. ఎస్‌సి వర్గీకరణ కు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం లో అన్ని వర్గాలు మద్దతు ఇచ్చిన బిల్లు రూపంలో రాకపోయిందని తెలిపారు..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో చిత్తశుద్ధి తో వర్గీకరణనకు శ్రీకారం చుట్టామన్నారు.

## 18 మందితో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు

మంత్రి కొండాసురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్ : దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై మంగళవారం తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట దేవస్థానానికి ఆలయ పాలకమండలి ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపారు. 18 మంది సభ్యులతో యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు ఉంటుందని, వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలుగా పేర్కొన్నారు. కాగా బోర్డు చైర్మన్‌కు, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని, డిఎం మాత్రం ఉంటాయని అన్నారు. ఆలయ ఇఒగా ఐఎఎస్ అధికారి ఉంటారని వెల్లడించారు. బోర్డు బడ్జెట్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటుందని.. బోర్డు ఆధ్వర్యంలో, యాదగిరిగుట్టలో విద్యాసంస్థలు,ఆధ్యాత్మిక పాఠశాలలను నెలకొల్పి, నిర్వహించవచ్చునని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో రాష్ట్రంలోని దేవాలయాలకు భక్తుల తాకిడి పెరిగిందన్నారు. గతంలో యాదగిరిగుట్టలో సాధారణ భక్తులకు సరైన సదుపాయాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లు ఖర్చు చేసి వసతులు ఏర్పాటు చేసిందన్నారు. ఇంకా మంచి సౌకర్యాలు కల్పనకు పాలక మండలి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసిందన్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో యాదగిరిగుట్టను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణలో రూ.100కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలన్నీ దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనే పనిచేస్తాయని సురేఖ పేర్కొన్నారు.

## ఎట్టకేలకు సిఎంను కలిసిన గుమ్మడి నర్సయ్య



ప్రజాపక్షం / హైదరాబాద్ : సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందు నియోజకవర్గానికి ఇవ్వాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ఆయన మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో నర్సయ్య మాట్లాడుతూ "సిఎం రేవంత్ రెడ్డిని కలవగానే నన్ను చూసి నవ్వి సమస్య ఏమిటని అడిగారు. నీటి సమస్య అని చెప్పాను. సరే అని అన్నారు. అంతకుమించి ఏమీ మాట్లాడలేదు. కొద్దిరోజుల క్రితం ఇదే సమస్యపై సిఎంను కలిసేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంటికి వెళ్ళాను. నాకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. మీడియాలో నాకు సిఎం అపాయింట్ మెంట్ ఇవ్వలేదని వార్తలు వచ్చినా సిఎం స్పందించలేదు. నేను ఎందుకు వచ్చానో ఆ విషయం చెప్పాను. సిఎం సరే చూస్తా అన్నారు. నాకు కావాల్సింది నా నియోజకవర్గానికి సాగు, తాగు నీరు'' అని చెప్పారు.

# మీలాగా మేము రోడ్లను అమ్మబోము

### ట్రిపుల్ ఆర్ పూర్తయితే సిటీ రూపు రేఖలు మారుతాయి

### శాసనమండలిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్)ను నిర్మించి హైదరాబాద్‌ను అభివృద్ధి చేయగా రూ.300 నుంచి రూ.400 కోట్ల ఆదాయం సంపాదించే ఒఆర్ఆర్‌ను గత బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు 30 ఏళ్లకు అమ్ముకున్నారని, తాము తాజాగా నిర్మించతలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)ను బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా అమ్ముకోబోమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శాసనమండలిలో అన్నారు. శాసనమండలిలో మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ట్రిపుల్ ఆర్ అభివృద్ధిపై కాంగ్రెస్ సభ్యులు టి.జీవన్‌రెడ్డి, బి.మహేష్‌కుమార్ గౌడ్, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ పూర్తయితే హైదరాబాద్ మహానగరం రూపురేఖలు మారిపోతాయని, బీఆర్ఎస్ మాదిరిగా తమకు రోడ్లు అమ్ముకునే అలవాటు లేదన్నారు. ఇప్పటివరకు ఆర్ఆర్ఆర్ విషయంలో ఏడుసార్లు కేంద్ర మంత్రి గడ్కరీని కలిసినట్టు చెప్పారు. రెండు నెలల్లో పనుల ప్రారంభానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు. మూడున్నర నుంచి నాలుగేళ్లలో ట్రిపుల్ ఆర్ పూర్తిచేస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంపై శాసనమండలిలో ఎమ్మెల్సీలు జీవన్ రెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు నార్త్ పార్ట్‌కి 2016లో కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2017లో కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసిందని, అయితే గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టు వెనుకబడిపోయిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్ఆర్ఆర్‌ను పట్టాలెక్కించాం. ఇప్పటికే రీజినల్ రింగ్ ఉత్తరభాగానికి సంబంధించి 7,100 కోట్ల రూపాయలతో టెండర్లు పిలవడం జరిగిందని స్పష్టం చేశారు. ఒఆర్ఆర్ వల్ల ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్, రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, పివిఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే వంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు.

**తెలంగాణపై కేంద్రం కపట ప్రేమ : మంత్రి శ్రీధర్‌బాబు**



గంగానది, సబర్మతి నది పునరుజ్జీవం కార్యక్రమానికి ఇచ్చినట్లు మూసీ నదికి కూడా నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే అనేకసార్లు సిఎం రేవంత్ రెడ్డి కోరారని, అయినా ఎలాంటి స్పందన లేదని, కేంద్ర ప్రభుత్వం గుజరాత్, యుపిలపై చూపిస్తున్నప్రేమ తెలంగాణ రాష్ట్రంపై చూపించడంలేదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో ఎవరికైనా అపోహలుంటే నివృత్తి చేస్తామని చెప్పారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో మూసీ పునరుజ్జీవన కార్యక్రమంపై సభ్యులు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, టి.జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. మూసీ ఒడ్డున ఉంటున్న పేదలు, మధ్య తరగతి ప్రజల కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. వాళ్లు ఇతరులను నమ్మి మోసపోయారని గుర్తించి వారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేస్తున్నం. 'మూసీ ప్రక్షాళన' జరగకుండా ఎంతో మంది ఎన్నోరకాలుగా ప్రయత్నం చేస్తున్నారు. అయినా... ఈ విషయంలో ప్రభుత్వం వెనకడుగేయదన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట బీఆర్ఎస్ పార్టీ హడావుడి చేసింది. కానీ.. చేసిందేం లేదన్నారు. 'మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్' ద్వారా మూసీ ప్రక్షాళనను దశలవారీగా చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. మొదటి దశలో బాపుఘాట్ దగ్గర 'గాంధీ సరోవర్ ప్రాజెక్ట్' పేరిట పనులు చేపడతాం. ఇందుకు సంబంధించిన మాస్టర్‌ప్లాన్ రెడీ అవుతుందని చెప్పారు. మూసీ ప్రక్షాళనలో ఇళ్లు కోల్పోయేవారికి డబుల్ బెడ్ రూం ఇస్తాం. ఇప్పటికే 309 మందికి ఇచ్చాం. ప్రతిపక్షాలు వస్తే ఎక్కడ... ఎవరెవరికి ఇచ్చామో చూపిస్తాం.

**నీటి విషయంలో కేంద్రం నుంచి నిధులు వచ్చే పరిస్థితి లేదు : మంత్రి సీతక్క**



తెలంగాణలో నీటి విషయంలో కేంద్రం నుంచి నిధులు వచ్చే పరిస్థితి లేదని మంత్రి దనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు తాత మధుసూదన్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినట్లు మిషన్ భగీరథలో నూరు శాతం మంచినీటి సౌకర్యం కల్పించలేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సర్వే చేస్తే 4లక్షల ఇళ్లకు నీళ్లు రావట్లేదని, మరో 3 లక్షల ఇళ్లకు నీళ్లు పూర్తిస్థాయిలో రావట్లేదని తెలిపారు. నీటి సంక్షోభం ఇప్పటివరకు లేదు.. రావొద్దని ప్రకృతిని ప్రార్థిస్తున్నానని అన్నారు. నీటి సరఫరాకు నిధులు కేటాయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, నీటి సమస్యపై ప్రతి రోజూ అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. ఆదిలాబాద్‌లో నీటి సరఫరా పనుల కోసం రూ.60 కోట్లు ఇచ్చామన్నారు. నీటి సమస్యలపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని సీతక్క తెలిపారు. నీటి సరఫరా అవసరాలకు 2024 జనవరి నుంచి రూ.298 కోట్లు మంజూరు చేశామన్నారు.

**ఒక్కో దానికి ఒక్కో ఫెడరేషన్ ఇవ్వలేం : మంత్రి జూపల్లి కృష్ణారావు**



సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్థలో ఒగ్గు కళాకారులకు కూడా అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ సభ్యుడు యెగ్గె మల్లేశం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఒగ్గు కళారూపాల్లో 64 రకాలున్నాయి. ఒక్కోదానికి ఒక్కో ఫెడరేషన్ ఏర్పాటు చేయడం సాధ్యం కాదు. గత ప్రభుత్వం అనేక ఫెడరేషన్లు ఇచ్చింది. కానీ అవన్నీ రాజకీయ పునరావాస కేంద్రాలుగానే ఉన్నాయి మంత్రి అన్నారు.

**ఛండీగఢ్ మాదిరిగా 'ఫ్యూచర్ సిటీ' : మంత్రి శ్రీధర్‌బాబు**

ప్రస్తుతం దేశంలో ప్రణాళికాబద్ధమైన నగరంగా చండీగఢ్ గుర్తుకు వస్తుందని, రానున్న రోజుల్లో హైదరాబాద్‌ను కూడా అటువంటి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సుంకరి రాజు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ శంషాబాద్ విమానాశ్రయం, ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్)ను కేంద్రంగా చేసుకుని పట్టణీకరణ వేగంగా జరుగుతోందని. ఈ నేపథ్యంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా 'ఫ్యూచర్ సిటీ' పేరుతో ప్రత్యేక నగరాన్ని అన్ని హంగులతో నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌కు దీటుగా ఈ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ఫ్యూచర్ సిటీ పరిధి రంగారెడ్డి జిల్లాకు చెందిన 7 మండలాల్లోని 56 రెవెన్యూ గ్రామాల పరిధిలోని 770 చ.కి.మీల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుంది. ఈ ఫ్యూచర్ సిటీ తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలిచి, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడుతుంది. పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు తోడ్పడుతుందన్నారు.

## మీడియా పాయింట్

### బలహీనవర్గాల అభ్యున్నతే సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పం : ఎంఎల్‌ఎ ఆదిశ్రీనివాస్

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్రంలో కులగణన ఆధారంగా బలహీనవర్గాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం అసెంబ్లీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు అని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ ఆదిశ్రీనివాస్ అన్నారు. ఈ బిల్లు ఆమోదం సమయంలో తాము సభలో ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిసి బిడ్డ కానప్పటికీ సిఎం రేవంత్‌రెడ్డి బలహీనవర్గాల సంక్షేమం కోసం ఆలోచించారని కొనియాడారు. తెలంగాణ కులగణన దేశానికి రోల్ మాడల్ అని రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో ప్రస్తావించడం హర్షణీయమన్నారు. గతంలో కులగణనను తప్పుబట్టిన అఖిలపక్షాలు బిల్లుకు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ బిల్లును కేంద్రం తొమ్మిదవ షెడ్యూల్‌లోలో చేర్చేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని ఆయన కోరారు. బిల్లు ఆమోదం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### అన్ని పార్టీలకు కృతజ్ఞతలు : ఎమ్మెల్యే శంకరయ్య

ప్రజాపక్షం / హైదరాబాద్ : వెనుకబడ్డ బలహీన వర్గాలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని 42శాతం రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం, ఇందుకు సహకరించిన అన్ని రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఎంఎల్‌ఎ వి.శంకరయ్య పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదనడానికి ఈ బిల్లు ఆమోదమే నిదర్శనమన్నారు. బిల్లుపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందిస్తారనే నమ్మకం ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

### బిసి బిల్లు చరిత్రాత్మక నిర్ణయం

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్రంలో జనాభా ప్రకారం ఎవరి వాటా ఎంతో చూపించే ప్రయత్నంలో భాగంగానే కులగణన చేపట్టామని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే వి.శ్రీహరి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిల్లు ఆమోదం సమయంలో బిసి నాయకులుగా సభలో ఉండటం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కోరామని, బిజెపి నేతలు బిల్లు విషయంలో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### రైతుల సమస్యలపై చర్చించాలి : ఎమ్మెల్యే

ప్రజాపక్షం / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నదని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రస్తుతం నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో సమస్యలపై చర్చించాలని కోరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలకు నీళ్లు అందక రైతులు ఇబ్బందిపడుతున్నారని, దీనిపై చర్చ జరగాలని కోరారు. రైతులు రోడ్డు మీదికొచ్చి ఆక్రోశం వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు. మోటర్లు కాలిపోతున్నాయని, నాణ్యమైన కరెంట్ సరఫరా కావడం లేదన్నారు. రైతు భరోసా, రైతు రుణమాఫీపై చర్చ జరగాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉత్తర్వులిచ్చారని, దానిని పక్కకు ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. వడ్ల సేకరణపై , రైతు రుణమాఫీపై చర్చించేందుకు క్వశ్చన్ అవర్‌ను నిర్వహించాలని ఆయన కోరారు.

# సాగునీరు, తాగునీరు అందించాలి

### అసెంబ్లీ జీరో అవర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : సాగునీరు, తాగునీరు అందించాలని, అసంపూర్తిగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయాలని పలువురు ఎంఎల్ఎలు శాసనసభలో ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు సాఫీగా పారేందుకు కాలువల మరమ్మతులు చేపట్టాలని అన్నారు. శాసనసభలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం ప్రశ్నోత్తరాలను రద్దుచేశారు. జీరో అవర్ ద్వారా సభను నిర్వహించారు. జీరో అవర్‌లో కాంగ్రెస్, సిపిఐ, బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన దాదాపు 26 మంది సభ్యులు మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం కల్పించారు. సభ్యులు రాష్ట్రంలోని వివిధ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులు సభలో లేవనెత్తిన సమస్యలకు మంత్రులు పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

**అధికారుల తీరుపై ప్రివిలేజ్ నోటీస్ ఇస్తా : దానం నాగేందర్**



అధికారుల తీరుపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో ఈద్గా గ్రౌండ్ పక్కన క్యాంప్ ఆఫీస్‌కు స్థలం ఇవ్వమని అడిగితే, అధికారుల నుంచి సరైన స్పందన లేదన్నారు. అప్లై..అప్లై.. నో రిప్లై అన్నట్లు పరిస్థితి ఉందన్నారు. అధికారులపై ప్రివిలేజ్ నోటీస్ ఇస్తాను, తనకు సమాచారం ఇవ్వకుండా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారన్నారు. అధికారులు, అధికారులు మాట్లాడుకుని రాజీపడుతున్నారని, ఎమ్మెల్యేలు చెప్పినా వింటలేరన్నారు. నేను పోయి నా స్టైల్‌లో ఫౌండేషన్ స్టోన్‌ను పగల కొట్టేసిన అని అన్నారు. స్కూల్ పిల్లకు మిడ్ డే మీల్స్‌లో ఎగ్స్ అందించడం లేదని, అరటిపండ్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆర్ఆర్ ప్లాంట్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు. సోషల్ మీడియాకు భయపడి వెంటనే రెస్పాండ్ అయ్యే అధికారులు ఎంఎల్‌ఎ ఫిర్యాదుకు స్పందించటం లేదని సభలో దానం ఆవేదన వ్యక్తం చేశారు.

**అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలి : మల్ రెడ్డి రంగారెడ్డి**



రంగారెడ్డి జిల్లాలో వస్తున్న సంపదను ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తున్నారని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లాలో విలువైన భూములు అమ్మి, ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో అనేక ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. కొంగరకాలాన్ దగ్గర భూములను అక్రమంగా కబ్జా చేశారన్నారు. ప్రభుత్వ భూములపై సమీక్ష నిర్వహించి, భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. భూములు ఉంటే ప్రభుత్వం వద్ద ఉండాలని, లేదా పేద ప్రజలకు పంచాలని కోరారు. తుర్కయాంజాల్ చెరువు మధ్యలో రోడ్డు నిర్మించారని సభ దృష్టికి తీసుకోచ్చారు. వందలాది లారీల మట్టితో చెరువును పూడ్చి మధ్యలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించారన్నారు. రోడ్డును తొలగించి, చెరువును రక్షించాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు.

**దేవాదుల ఫేజ్ 3 పనులు పూర్తి చేయాలి : యశస్వినిరెడ్డి**



పాలకుర్తి నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాన్ని ప్రైవేట్ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి స్థలాలు కేటాయించి, సొంత భవనాలు నిర్మించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కోరారు. ఒక దాత స్థలం ఇవ్వడంతో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరుగుతుందని, ఎంపిడిఒ కార్యాలయం కూడా అక్కడ నిర్మించేందుకు రూ.కోటి మంజూరు చేయాలని, పోలీస్ స్టేషన్ భవనం కూడా నిర్మించాలన్నారు. పాలకుర్తిలో బస్ స్టేషన్‌ను ఎవరూ పట్టించుకునే నాథుడే లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు ప్రాజెక్టులపై దృష్టి పెట్టారన్నారు. తమ చిరకాలపు కోరిక దేవాదుల కింద ఫేజ్ 3 రిజర్వాయర్ల పనులకు నిధులు కేటాయించాలని యశస్విని రెడ్డి కోరారు.

**రైతులకు రుణమాఫీ చేయాలి : కల్వకుంట్ల సంజయ్**



కోరుట్ల ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, వెంటనే సౌకర్యాలు కల్పించాలని కోరుట్ల ఎంఎల్‌ఎ కల్వకుంట్ల సంజయ్ కోరారు. రుణమాఫీపై ఎగవేతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. రుణమాఫీ పూర్తిచేయాలన్నారు. రుణమాఫీ కాలేదని, సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసేందుకు వెళ్లుతున్న రైతులను పోలీసులు అరెస్టు చేశారన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసేందుకు వెళ్లితే కూడా అరెస్టు చేస్తారా? అని ప్రశ్నించారు.

**నూరు శాతం రుణమాఫీ నిరూపిస్తే రాజీనామా చేస్తా : పాడి కౌశిక్ రెడ్డి**

హుజూరాబాద్ నియోజకవర్గంలో 107 గ్రామాల్లోని ఒక్క గ్రామంలో అయినా 100 శాతం రుణమాఫీ అయితే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎంఎల్‌ఎ పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. సాగునీరు లేక పంటపొలాలు ఎండిపోతున్నాయని, సాగునీరు, తాగునీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, కావున వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు.

**వంద చెరువులు పాడయ్యాయి : రామారావు పటేల్**

ముథోల్ నియోజకవర్గంలో వంద చెరువులు పాడయ్యాయని, ఇప్పటివరకు వాటి మరమ్మతులకు చర్యలు చేపట్టలేదని ఎంఎల్‌ఎ రామారావు పటేల్ అన్నారు. కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు ఒక్క టెండర్ పిలవలేదన్నారు. ఈ విషయంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడంలేదన్నారు. దక్షిణ భారత దేశంలోనే జ్ఞానసరస్వతి దేవాలయం తమ నియోజకవర్గంలో ఉందని, పుష్కరాలు వస్తున్నాయని, ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. సర్కార్ నిధులు కేటాయించలేకపోతే, దాతలు సిద్ధంగా ఉన్నారని, అందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని కోరారు.

**అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి : కాలేరు వెంకటేశ్**

అంబర్‌పేట్ ఫ్లైఓవర్ ప్రారంభించారు కానీ, సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయలేదని ఎంఎల్‌ఎ కాలేరు వెంకటేశ్ అన్నారు. సర్వీసు రోడ్డు అందుబాటులో లేకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొందని, దీంతో అటు మలక్‌పేట్, ఇటు అంబర్‌పేట్ ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తి చేయాలి : మేడిపల్ల సత్యం**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపించిందని మేడిపల్లి సత్యం అన్నారు. కేవలం 10 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, కావున పనులు పూర్తి చేయాలన్నారు. గత ప్రభుత్వం కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.500 కోట్లు ఇస్తామని ప్రకటించి, ఒక్కపైస ఇవ్వలేదన్నారు. దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, అలాగే తన నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

**బి.ఎన్.రెడ్డి నగర్ ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలి : ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డి**

బి.ఎన్.రెడ్డి నగర్‌లో 1984లో హుడా అనుమతులిచ్చిన లేఔట్‌లో ప్రజలు స్థలాలు కొనుగోలు చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నారని, 1997లో ఆ స్థలం ప్రభుత్వ స్థలం అని చెప్పడంలో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఎల్.బి.నగర్ ఎంఎల్‌ఎ డి.సుధీర్ రెడ్డి తెలిపారు. అక్కడ రిజిస్ట్రేషన్‌లు కూడా చేయడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం 118 జిఒ ఇచ్చిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించి, ప్రజలకు సాయం చేయాలని ఆయన కోరారు.

**ఆరోగ్యశ్రీ బిల్లులు మంజూరు చేయాలి : పాల్వాయ్ హరీశ్ బాబు**

ఆరోగ్యశ్రీ బిల్లులు మంజూరు చేయాలని పాల్వాయ్ హరీశ్ బాబు కోరారు. బిల్లులు విడుదల కాకపోవడంతో ఆసుపత్రులలో ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయన్నారు. కాళేశ్వరం జోన్‌లో ఎస్ఐలకు 13 ఏళ్లుగా పదోన్నతులకు నోచుకోవడం లేదని, వారికి పదోన్నతులు కల్పించి, న్యాయం చేయాలని కోరారు.

**బస్తీ దవాఖానాలలో వైద్యులు ఎక్కడ? : జాఫర్ హుస్సేన్**

బస్తీ దవాఖానాలలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని జాఫర్‌హుస్సేన్ అన్నారు. డయాగ్నస్టిక్ సేవలు కూడా స్తంభించిపోయాయని ఆయన సభ దృష్టికి తీసుకొచ్చారు. యాకత్‌పురలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి జిహెచ్‌ఎంసి ఎన్‌ఒసి ఇవ్వడం లేదని, త్వరగా ఎన్‌ఓసి మంజూరు చేసి, ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన కోరారు.

**ఎక్కువ సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి : బత్తుల లక్ష్మారెడ్డి**

మిర్యాలగూడలో ఆసుపత్రి పనులు పూర్తి చేయాలని బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయినందున, మిగిలిన పనులు పూర్తి చేయాలన్నారు. మిర్యాలగూడ పారిశ్రామిక ప్రాంతమైనందున విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తన నియోకవర్గంలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయని, ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువ సంఖ్యలో మంజూరు చేయాలని కోరారు.

# దేవాదుల 3వ దశ మోటార్లు ప్రారంభం

### మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలకు ఘనస్వాగతం



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ మోటార్లను రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. దేవాదుల ఫేస్ 3 ప్యాకేజి పంపు హౌజ్ మోటార్ల వద్ద తొలుత పూజలు చేసి లాంఛనంగా వారు ప్రారంభించారు. హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటకు మంత్రులు చేరుకోగా ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దేవన్నపేటలో దేవాదుల ప్యాకేజీ 3లో భాగంగా నూతనంగా నిర్మించిన పంపుహౌస్ మోటార్లను ప్రారంభించేందుకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ నుండి హెలికాప్టర్ ద్వారా దేవన్నపేటకు చేరుకోగా వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దేవాదుల అధికారులు పుష్పగుచ్చాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవాదుల మూడు ఫేస్‌ల ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా ఫేస్ 3 ద్వారా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంతో పాటు పాలకుర్తి, జనగామ నియోజకవర్గాలకు ప్రత్యక్షంగా, పరకాల, భూపాలపల్లికి చలివాగు ద్వారా నీరందించే చర్యలు చేపడుతున్నామన్నారు. పెండింగ్‌పనులు పూర్తిచేస్తామని చెప్పారు.

## బిసి బిల్లుకు శాసనమండలి ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వెనుకబడిన తరగతులకు గ్రామీ ణ, పట్టణ స్థానిక సంస్థలలో, విద్యా సంస్థలలో సీట్లు, రాష్ట్ర సర్వీసులలో నియామకాలు, పదవుల రిజర్వేషన్' రెండు వేర్వేరు బిసి బిల్లుల 2025ను శాసనమండలి మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల రెండు వేర్వేరు బిల్లులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో ప్రవేశపెట్టగా, బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. అంతకుముందు బిల్లును ప్రవేశపెడుతూ పొన్నం ప్రభాకర్ పాత చరిత్రకు సంబంధించిన అంశాలు మాట్లాడారు.. మండల కమిషన్ పై చరిత్రను ఎవరు కాదనలేరని, 1979 లో దీనిని మొరార్జీ దేశాయ్ ఏర్పాటు చేయడంతో 1980 లో కమిషన్ రిపోర్ట్ ఇచ్చిందన్నారు. 1990 లో విపి సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు అమలు చేయాలని నిర్ణయించుకున్నారని, 1993 నుండి తెలంగాణ బిడ్డ పివి నరసింహారావు నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. 2006 లో మన్మోహన్ సింగ్ ఐఐటి, ఐఐఎం కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో బిసి రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. రాజ్యాంగ సవరణ 103 ప్రకారం ఇడబ్ల్యూఎస్ కింద 50 శాతం రిజర్వేషన్లు స్లాబ్ ఎత్తివేసిన తరువాత మార్గం సుగమమైందన్నారు. చాలా రాష్ట్రాల్లో 50 శాతం స్లాబ్ దాటి రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని, తమిళనాడు లో జయలలిత నేతృత్వంలో కొట్లాడి తెచ్చారని పేర్కొన్నారు. బిల్లుపై జరిగిన చర్చలో సభ్యులు మధుసూదనచారి, టి.జీవన్‌రెడ్డి, బి.మహేష్ కుమార్‌గౌడ్, కవిత, ఎగ్గె మల్లేష్, తీర్మాన్ మల్లన్న, భానుప్రసాద్, అమీర్‌అలీఖాన్‌తో పాటు పలువురు మాట్లాడారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కూకట్‌పల్లి సర్కిల్ - 24

Lr No. 38/GHMC/KPC-24/EE/2024-25 తేది: 18.03.2025

NIT No. 38/GHMC/KPC-24/EE/2024-25, తేది: 11.03.2025, పని పేరు: వ్యక్తుల నిమఘ్నమం చేయడం, అంచనా విలువ / ఇసివి: రూ.11.34 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 19.03.2025న ఉ.11.30గం.ల నుండి 26.03.2025న ఉ.11.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్ఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 11670-PP/CL/ADVT/1/2024-25, Date: 18-03-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ
**శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం**
యం.జి.రోడ్, కొత్తగూడెం పట్టణం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

Rc.No.SSVSD/09/2024 సీల్డ్ టెండరు-కం-బహిరంగ వేలం ప్రకటన - 7 తేది: 18.03.2025

ఈ దిగువ తెలిపిన వాటికి 'సీల్డ్ టెండరు -కం-బహిరంగ వేలం' పాటలు ఈ క్రింద షెడ్యూల్ నందు పేర్కొనిన విధముగా నిర్వహించబడును. బహిరంగ వేలం పాటలలో పాల్గొనదలచినవారు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలం పాటలలో పాల్గొనవలెను. తేది: 28-03-2025 శుక్రవారం రోజున ఉ.08.00 గంటల నుండి దేవస్థాన టికెట్ కౌంటర్ నందు టెండర్-కం-బహిరంగ వేలం పాట షెడ్యూల్స్ ఇవ్వబడును ఉ.09.00 గంటల నుండి దేవస్థాన ఆవరణ యందు బహిరంగ వేలములు ఒక్కొక్కదానికి వేరువేరుగా నిర్వహించబడును. దేవస్థానమునకు బకాయి ఉన్నవారు మరియు కోర్టు కేసులు ఉన్నవారు వేలం పాటలో పాల్గొనుటకు అనర్హులు. వేలంపాటలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. పూర్తి వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు.

| క్ర.సం. | షెడ్యూలు వివరములు | డిపాజిట్ (రూ.) | పాట కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | షాప్ నెం. 5, 8(A) (2 షాపులు) | రూ.30,000/-లు (షాపు ఒక్కంటికి) | స్వాధీనం చేసుకున్న నాటి నుండి 3 సంవత్సరములు. |
| 2. | కొబ్బరిచిప్పలు ప్రోగుచేసుకొనే హక్కు | రూ. 10,000/- లు | తేది: 01-04-20285 నుండి 31-03-2026 వరకు (1 సం.) |
| 3. | షాపు నెం. 6,7 లలో గల వస్తువులు | రూ. 20,000/- | |
| 4. | దేవాలయము నందు గల స్క్రాప్. | రూ. 10,000/- | |
| 5. | శ్రీ స్వామివారి, అమ్మవారి వస్త్రాల అమ్మకం | రూ. 20,000/- | |

దేవస్థానము నందు ది. 30-03-2025న జరుగు ఉగాది పండుగను పురస్కరించుకొని 1) లైటింగ్ & సౌండ్ సిస్టమ్, 2) ఋత్వికులు సంభావనలు, 3) సన్నాయిమేళం వాయిద్యకారులకి, 4) పూలు, పూలదండలు, దేవాలయ డెకరేషన్ కొరకు, 5) బ్యాండ్ మేళం ఏర్పాటుకు, 6) బాణసంచా సమాగ్రి కొనుగోలుకి టెండర్ / కొటేషన్ కోరబడుచున్నవి. కావున ఆసక్తి కలవారు తేది: 20-03-2025 సాయంత్రం 05.00 గం.ల లోపు కొటేషన్స్‌ను దేవస్థాన కౌంటర్ నందు సమర్పించగలరు.

DIPR R.O. No. : 11643-PP/CL/ADVT/1/2024-25, Date: 18-03-2025 సం/- కార్యనిర్వహణాధికారి

# ప్రజాపక్షం

బుధవారం, మార్చి 19


## హర్యానా నగరాలు బిజెపి వశం

గత సంవత్సరం హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరహాలోనే ఈ సంవత్సరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కొనసాగాయి. ఇది ప్రధానంగా బిజెపి – కాంగ్రెస్ పార్టీల మధ్య ముఖాముఖీ పోటీవున్న రాష్ట్రం. దేవీలాల్, ఓంప్రకాశ్ చౌతాలా క్రియాశీల రాజకీయ జీవితకాలంలో జనతాపార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్ ప్రాబల్యం పొందినా అనంతరకాలంలో ప్రాంతీయ పార్టీల హవా దాదాపు అంతరించింది. వారి వారసులు సారథ్యం వహిస్తున్న పార్టీలు గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పాకెట్లకు పరిమితం. ఈ నేపథ్యంలో ఢిల్లీ రాజకీయాల ప్రభావంతో దశాబ్దకు పైబడి బిజెపి పరిపాలన సాగుతోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగలదని భావించే వాతావరణం ఏర్పడినప్పటికీ జాట్లు ఆధిపత్యం వహిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఆ అవకాశాన్ని చేజార్చుకుంది. దళితులు, ఒబిసిలు రాజకీయ క్షేత్రంలో మునుపెన్నడూ లేనంతగా క్రియాశీలమవుతున్న వాస్తవాన్ని గ్రహించటంలో కాంగ్రెస్ విఫలమైంది. అది పార్టీలో అంతర్గత పోరాటానికి దారితీసి ఎన్నికల్లో ఘోరమైన దెబ్బతీసింది. తనదైన ముద్రతో పరిస్థితి అదుపు చేయటంలో అధినాయకత్వం విఫలమైంది. పర్యవసానం – బిజెపితో ముఖాముఖీ పోటీలో కాంగ్రెస్ నిలబడలేకపోతోందన్న ఆరోపణ కొనసాగుతున్నది. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడి మనుగడ సాగిస్తున్న 'పరాన్నభుక్కు' కాంగ్రెస్ అని ప్రధాని నరేంద్రమోదీ దెప్పిపొడవటం గుర్తుచేసుకోదగింది.

ఇటీవల జరిగిన హర్యానా మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు పట్టణ, నగర ప్రాంతాల్లో కాంగ్రెస్ బలహీనతను మరోసారి బహిర్గతం చేశాయి. 10మున్సిపల్ కార్పొరేషన్లకు (పానిపట్, గురుగ్రాం, రోహతక్, హిస్సార్, కర్నాల్, అంబాలా, సోనిపట్, ఫరీదాబాద్, యమునానగర్, మనేసార్) జరిగిన ఎన్నికల్లో 9 బిజెపి ఖాతాకు చేరగా, మనేసార్‌లో స్వతంత్ర అభ్యర్థి ఇందర్‌జిత్ యాదవ్ (ఇతను బిజెపి తిరుగుబాటు అభ్యర్థిగా పోటీచేసి మేయర్‌గా గెలిచారు)గెలుపొందారు. 10లో 9 గెలుపొందటం అద్భుత ఫలితంగా కనిపించవచ్చు. కాని వాటిలో 8 అంతకుముందు కూడా బిజెపివే. మనేసార్‌కు ఇదే తొలి ఎన్నిక. అయితే కాంగ్రెస్‌కు ఎప్పటివలె 'సున్న' రావటమేకాదు, బిజెపితో పోల్చినపుడు ఓట్లలో పెద్ద తేడా కాంగ్రెస్‌ను కృంగదీయక మానదు. బిజెపి అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ నుంచి, ప్రాంతీయ పార్టీలనుంచి నాయకులను కొనుగోలు చేసి తన స్థితిని పటిష్ట చేసుకుంది అని విమర్శించినంత మాత్రాన సరిపోదు. పట్టణ, నగరవాసుల్లో నరేంద్రమోదీకి ఉన్న ఆకర్షణ శక్తిని విస్మరించకూడదు. అదే సమయంలో బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్ పరివారానికున్న కార్యకర్తల దక్షత, నిబద్ధత ఎన్నికల ప్రచారంలో, బూత్ కమిటీల ద్వారా ఓటర్లను ఎంచుకుని పోలింగ్‌కు తీసుకురావటంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న లక్షణం. బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకుల మధ్య పొరపొచ్చాలు, ఆధిపత్యపోరు ఉన్నట్లు అప్పుడప్పుడు వార్తలొస్తున్నా ఆ రెండు సంస్థలదీ బొడ్డుతాడు సంబంధం. ప్రతి ఎన్నికల్లోనూ లక్షలాదిమంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు అనేక మాసాల ముందునుంచే సంబంధిత రాష్ట్రానికి చేరి తమ పద్ధతుల్లో ప్రచారం చేస్తుంటారు. బిజెపి అర్థ, అంగ బలంతో పాటు మత విభజన చేయటంలో, సామాజిక కూర్పులో, తదనుగుణంగా అభ్యర్థుల ఎంపికలో నేర్పు ప్రదర్శిస్తున్నది. దీన్నుంచి కాంగ్రెస్ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. కట్టుబాటుతనం, నిబద్ధతలేని లూజ్ ఆర్గనైజేషన్, అధికార లాలస తప్ప సేవాతత్పరత లోపించిన నాయకులు, అగ్రకులాల ఆధిపత్యం, బహిరంగ ఆరోపణలకు స్వేచ్ఛతో కూడిన పాతచట్రం బిజెపిని ఎదుర్కొలేదు. అందువల్ల క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన కార్యకర్తల మీద ఆధారపడిన పార్టీ నిర్మాణం ఆ పార్టీకి ఈనాటి అవసరం. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంపై రాహుల్‌గాంధీ సాగిస్తున్న పోరాటానికి పార్టీ నిర్మాణం తోడుకావాలి. యువ నాయకత్వాన్ని, దళితులు, ఒబిసిలనుంచి నాయకులను తయారు చేయాలని చెప్పినంత మాత్రాన సరిపోదు. అందుకు నిర్మాణాత్మక కృషి అవసరం. 21వ శతాబ్దంలో పాతికేళ్లు గడిచిపోతున్నాయి. పాత నిర్మాణ పద్ధతులకు కాలం చెల్లింది. సమాజంలో బలహీన తరగతుల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆకాంక్షలను అవగాహన చేసుకుని, వారిలోనుంచే సరైన నాయకులను ముందుకు తేవటమే ఈనాడు రాజకీయ పార్టీల ముందున్న కర్తవ్యం. గ్రాండ్ ఓల్డ్ పార్టీ అయిన భారత జాతీయ కాంగ్రెస్ పునరుజ్జీవనం ఆ పార్టీ ప్రస్తుత నాయకత్వం ముందున్న పెనుసవాలు. దేశ భవిష్యత్‌కు కూడా అది ప్రాముఖ్యతగల అంశం.

## మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు

# సిపిఐ జాతీయ రాజకీయ ప్రచారోద్యమం



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం నేడు కూడలిలో నిలబడి ఉంది. మన గణతంత్రానికి అండగా నిలిచిన సామ్యవాదం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వం అనే ఆదర్శాలు పెనుముప్పుకు గురవుతున్నాయి. మెజారిటీవాదం దిశగా మొగ్గు పెరగడం, అధికారాల కేంద్రీకరణ, సమాఖ్యవాదం క్షీణత, పెరుగుతున్న అసమానతలు వంటివి విభజన, అసహనం, అన్యాయం వంటి రాజకీయ, సామాజిక వాతావరణానికి దారితీస్తుంది.

మోదీ ప్రభుత్వం ఉధృతంగా అమలు చేస్తున్న ఆర్థిక విధానాలు కార్మికవర్గ జీవనోపాధిని నాశనం చేస్తున్నాయి. మరో వైపు కార్పొరేట్‌ల లాభాలు పెరిగిపోతుంటే, సామాన్య పౌరులు పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పడిపోతున్న ఉద్యోగ అవకాశాలు, దిగజారుతున్న జీవన ప్రమాణాలతో సతమతమవుతున్నారు. భారత జనాభా పెరుగుదలనే ఒకప్పుడు బలంగా భావించగా, పెరిగిన నిరుద్యోగం కారణంగా ఇప్పుడు పెరిగిన జనాభా నష్టానికి కారణమవుతుంది. భారీ కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రభుత్వ రంగాన్ని క్రమపద్ధతిలో విధ్వంసం చేస్తుండడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత పెరిగి కార్మిక వర్గాన్ని, అణగారిని సమూహాలను మరింత అంచుకు నెట్టేస్తున్నాయి. రాజ్యాంగంలో లిఖించిన సమాఖ్య సూత్రాలను పణంగా పెట్టి కేంద్ర ప్రభుత్వం అధికారాల కేంద్రీ కరణ చేసుకోవడం భారతదేశం నేడు ఎదుర్కొంటున్న క్లిష్టమైన సవాళ్ళలో ఒకటి. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి కీలక రంగాలలో రాష్ట్రాల అధికారాలను కాలరాస్తూ , జాతీయ విద్యా విధానం అనబడే విధానాన్ని, ఏకవిధమైన ఆహార అలవాట్లను బలవంతంగా రుద్దుతుండటం ఈ ధోరణికి స్పష్టమైన సంకేతాలు. ఒకే భాషను జాతీయ భాషగా రుద్దడం భారతదేశ గొప్ప వైవిధ్యాన్ని అగౌరవపరచటమే కాకుండా, సాంస్కృతిక ఆధిపత్యాన్ని స్థాపించాలనే ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపిల మెజారిటీ వాద ఎజెండాకు అనుగుణంగా సాగుతోంది.

సమాఖ్యవాదం క్షీణత అనేది కేవలం రాజకీయ ఆందోళన మాత్రమే కాదు, ఇది భారతదేశంలోని 'భిన్నత్వంలో ఏకత్వం'పై ప్రత్యక్ష దాడి. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో తరచుగా కేంద్రంతో తలపడాల్సి వస్తుంది. ఆర్థిక వనరుల పంపిణీలో కానీ, దర్యాప్తు అధికారాల దుర్వినియోగం కానీ, ప్రకృతి విపత్తుల సమయంలో సరైన చర్యల విషయంలో కానీ, ఇలాంటి ధోరణులు కనపడుతున్నాయి. తద్వారా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గతంలో అవకాశం ఉన్న ప్రతి సారి మాట్లాడిన, భారతదేశ పరిపాలన నిర్మాణానికి పునాధిగా ఉన్నటువంటి సహకార సమాఖ్య వాదం దాడికి గురవుతున్నది.

భారతదేశంలో ఆర్థిక అసమానతలు ఆందోళన కలిగించే స్థాయిలో పెరిగిపోతున్నాయి. శతకోటీశ్వరుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతుండగా, జనాభాలో అధిక సంఖ్యలో ప్రజలు దినసరి అవసరాల కోసం సంపాదించుకునేందుకు పోరాడుతున్నారు. ప్రైవేటీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి మోదీ ప్రభుత్వ ఆర్థిక విధానాలు ధనిక, పేదల మధ్య అంతరాన్ని మరింత విస్తృతం చేస్తున్నాయి. స్థిరమైన ఉద్యోగాలకు కీలక వనరుగా ఉన్న ప్రభుత్వరంగాన్ని, ప్రజాసేవల రంగాలలో ఉద్యోగాలు పోవడమే కాకుండా ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు వంటి తప్పనిసరి సేవలను కూడా బలహీనపరుస్తున్నారు.

కార్పొరేట్ అనుకూల ప్రభుత్వ వైఖరితో కార్మిక హక్కులు, సామాజిక భద్రత చర్యలను కోల్పోవాల్సి వస్తుంది. కార్మిక చట్టాలను పలుచన చేసి, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అమ్మేస్తూ, లక్షలాది మంది జీవనోపాధిని స్థంభింపజేస్తున్నారు. సామాజిక–ఆర్థిక ప్రభావాలు, ఇలాంటి విధానంతో దళితులు, ఆదివాసీ, మైనారిటీలు సహా అణగారిన సమూహాలు ఆర్థికంగా నెట్టివేతకు గురవుతున్నారు. భారతదేశం కలవరపడేలా కుల ఆధారిత వివక్ష, హింసల ఏకీకరణను చూస్తుంది. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థను సమర్థించే మనువాది సిద్ధాంతానికి కట్టుబడిన ఆర్‌ఎస్‌ఎస్ కు, సమ సమాజ, కుల రహిత తత్వ నాయకులు డాక్టర్ భీం రావ్ అంబేద్కర్ వాళ్ళ సిద్ధాంతాలు తలపడుతున్నాయి. పెరుగుతున్న కుల వివక్ష, హింసాత్మక సంఘటనలు, దళితులు, అణగారిన వర్గాలకు రాజ్యాంగ హక్కులను తిరస్కరించబడడం వంటివి పెచ్చుమీరుతున్నవి. విధానపరమైన, సాంస్కృతిక సంస్థల ద్వారా కులతత్వ వృత్తాంతాలను ప్రచారం చేయటం తిరోగమన ధోరణికి సంకేతం.





ఈ నేపథ్యంలో భూస్వామ్య వ్యవస్థను, అణచివేత సామాజిక వ్యవస్థలను పునరుద్ధరించాలని కోరుకుంటున్న శక్తులు క్రమపద్ధతిలో డాక్టర్ అంబేద్కర్ వారసత్వాన్ని, ఆయనలో న్యాయం, సమాన భారతదేశం అనే భావనలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. అంబేద్కర్ వారసత్వాన్ని పరిరక్షించాల్సిన, రాజ్యాంగంలో లిఖించిన హక్కులను కాపాడాల్సిన ప్రాధాన్యతను భారత కమ్యూనిస్టు పార్టీ గుర్తించింది.

ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక అంతర్జాతీయంగా రాజకీయ సవాళ్ళకు మరో కోణాన్ని సైతం జత చేసింది. అంతర్జాతీయంగా మితవాద కూటమి ఆవిర్భావం, విభజించే స్వభావం, విదేశీయులంటే భయం, సంపన్నులకు అనుకూలమైన ఆర్థిక విధానాలతో సమ్మిళిత, బహుళత్వ విలువలకు ప్రపంచవ్యాప్తంగా ముప్పు ఏర్పడింది. ట్రంప్ పాలనా యంత్రాంగం, ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ద్వయం మధ్య సైద్ధాంతిక కలయిక భారతదేశంలో ప్రతీప శక్తులకు మరింత ప్రోత్సాహం కలిగి, గణతంత్ర రాజ్యాంగ విలువలను మరింత దిగజారుస్తాయి.

పైగా భౌగోళికంగా మితవాదం దిశగా మార్పు సామ్రాజ్యవాద ధోరణుల బలోపేతానికి సంకేతాలు ఇస్తున్నాయి. శాంతి, అభివృద్ధి, స్థిరత్వాలను సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. ఇది భారతదేశంలోనే కాదు ప్రపంచమంతటా కనిపిస్తుంది. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో భారత కమూనిస్టు పార్టీ అగ్రగామిగా నిలబడి, అలీనోద్యమ విదేశాంగ విధానానికి సమర్ధణ కొనసాగిస్తూ, భౌగోళికంగా శాంతి, అంతర్జాతీయ సంఘీభావ ప్రగతిశీల ఉద్యమాలతో కలిసి నడుస్తుంది.

బహుముఖ సవాళ్ళను తిప్పికొట్టేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ ఉధృతమైన రాజకీయ ప్రచారోద్యమాన్ని షహీద్ భగత్‌సింగ్ అమరుడైన రోజు మార్చి 23న ప్రారంభించి, డాక్టర్ భీంరావ్ అంబేడ్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 13 వరకు కొనసాగిస్తుంది. భారతదేశ మహోన్నత స్వాతంత్రోద్యమ ఆదర్శాలను, ఆ ఉద్యమాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్–బిజెపిల కుయుక్తులను ప్రజల్లోకి తీసుకెళ్ళే లక్ష్యంతో ఈ ప్రచారోద్యమాన్ని చేపడుతున్నాం. జాతాలు, ప్రదర్శనలు, సెమినార్‌లు, బహిరంగ సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర బహుళ రూపాలలో ఈ ఉద్యమం ఉంటుంది.

ఈ ప్రయత్నం కేవలం రాజకీయ ప్రచారోద్యమానికే పరిమితం కాకుండా, గణతంత్ర మూల సూత్రాలైన సామ్యవాదం, లౌకికవా దం, సామాజిక న్యాయం, సమానత్వం పునరుద్ధరణ ఉద్యమంగా సాగుతుంది. దేశ స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని అర్పించిన భగత్ సింగ్ జీవితం, చేసిన పనులు; న్యాయం, స్వేచ్ఛ, సామానత్వం, సౌభ్రాతృత్వం వంటి వాగ్దానాలతో దేశానికి రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ అంబేద్కర్; నేటికీ న్యాయం, సుసంపన్న భారతదేశం కోసం చేసే పోరాటానికి నిరంతర స్ఫూర్తి.

చరిత్రలోని ప్రస్తుత కీలక తరుణంలో ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను తిప్పికొట్టడం తప్పనిసరి అని భారత కమ్యూనిస్టు పార్టీ భావిస్తోంది. అలా చేయడంలో విఫలమైనట్లయితే దేశ బహుళత్వ చట్రానికి, పౌరుల ప్రజాస్వామిక హక్కులకు పూడ్చలేని నష్టం వాటిల్లుతుంది. జనసమూహాల వద్దకు వెళ్ళి, మెజారిటీ వాదం ప్రమాదాల గురించి వివరించడంపై ప్రచారోద్యమం దృష్టి సారిస్తుంది. అలాగే లౌకిక విలువల పరిరక్షణ ప్రాధాన్యతను, ప్రత్యేకంగా కొందరికే కాకుండా, పని చేసే ప్రతి ఒక్కరికీ అవసరమైన ఆర్థిక వ్యవస్థ గురించి వివరిస్తాం.

నేడు భారత దేశ పోరాటం కేవలం రాజకీయ పోరు మాత్రమే కాదు, ఇది దాని ఆత్మను కాపాడుకోవడం కోసం జరిగే పోరాటం. సామ్యవాదం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ సిద్ధాంతాలు కేవలం రాజ్యాంగ సూత్రాలే కాకుండా భారత రాజ్యాంగ సారం. షహీద్ భగత్ సింగ్, డాక్టర్ అంబేద్కర్ వారసత్వంతో భారత కమ్యూనిస్టు పార్టీ వీధుల్లోకి వెళ్తుంది. భారతదేశ బహుళత్వ, సమ్మిళిత అస్థితాన్ని పరిరక్షించుకునేందుకు జరుగుతున్న ఈ పోరాటంలో సకల ప్రజాతంత్ర, అభ్యుదయ శక్తులతో చేతులు కలపాలని పిలుపునిస్తున్నాం. ముందున్న మార్గం సవాళ్ళతో కూడుకున్నది. కానీ, అత్యంత శక్తివంతమైన సవాళ్ళను కూడా ఎదిరించిన శక్తి ప్రజలదని చరిత్ర చాటుతోంది. న్యాయమైన దృష్టిని, సమ్మిళిత, సుసంపన్న భారతదేశాన్ని తిరిగి పోందేందుకు నిలబడి, ప్రతిఘటించాల్సిన సమయం ఆసన్నమైంది.

## 'త్రిభాషా సూత్రం'వివాదం ఎక్కడివరకు వెళ్తుందో?



ఫిరోజ్ ఖాన్
9640466464

జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీష్‌తోపాటు ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నది. అయితే దీనిపై దక్షిణాది రాష్ట్రాల్లో.. ముఖ్యంగా తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. తమిళనాడు సిఎం స్టాలిన్ ఒక ముందడుగు వేసి రాష్ట్ర అధికారిక పత్రాల్లో హిందీలో ఉన్న రుపీ సింబల్‌ను తొలగించి తమిళ రూపీ సింబల్‌ను చేర్చడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా త్రిభాష సూత్రంలో దక్షిణాది రాష్ట్రాల్లో హిందీ భాషను బోధిస్తే.. మరి ఉత్తరాది రాష్ట్రాల్లో మూడో భాషగా ఏ లాంగ్వేజ్‌ను నేర్పిస్తారని అడగడం సైతం డిస్కషన్‌కు దారితీసింది. హిందీవల్లే ఉత్తర భారతంలో ఇప్పటికే 25 భాషలు కనుమరుగయ్యాయని స్టాలిన్ విమర్శించడం చాలామందిని ఆలోచింపజేసింది. మరో భాషా పోరాటానికైనా తమిళనాడు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్టాలిన్ ప్రకటించడంతో.. ఇప్పుడు ఈ వివాదం ఎంతవరకు వెళ్తుందోననే ఆందోళన చాలామందిలో కనిపిస్తున్నది.

**ఎనిమిదో షెడ్యూల్‌లో...** భారతదేశానికి జాతీయ భాష లేదు. కేంద్ర స్థాయిలో హిందీ, ఇంగ్లీష్ అధికార భాషలు గా ఉన్నాయి. రాష్ట్రాల్లో ప్రాంతీయ భాషలను అధికార భాషలుగా ఉపయోగిస్తున్నారు. 1960 ప్రాంతంలో హిందీ భాషను 'రుద్దడాన్ని' తీవ్రంగా వ్యతిరేకిస్తూ దక్షిణాది రాష్ట్రాల్లో, మరీ ముఖ్యంగా తమిళనాడులో పెద్దయెత్తున ఆందోళనలు పెల్లుబికాయి. ఆ తర్వాత 1963లో అధికార భాషల చట్టం వచ్చింది. అధికార లావాదేవీలన్నింటా హిందీతో పాటు ఇంగ్లీష్‌ను కూడా వినియోగించడం తప్పనిసరి చేస్తూ ఆ చట్టం తీసుకొచ్చారు. తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం, ఒడియా, గుజరాతీ, పంజాబీ, బెంగాలీ వంటి 22 భాషల్ని ఆయా ప్రాం తాల్లో అధికార భాషలుగా రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్ గుర్తించింది. హిందీ అధికార భాషగాలేని రాష్ట్రాలతో కేంద్రం ఇంగ్లీష్‌లో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని నిర్దేశిస్తూ 1967లో అధికార భాషల చట్టాన్ని సవరించారు.

**బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలం భాషే...**పాకిస్తాన్ రెండు ముక్కలు కావడానికి, బంగ్లాదేశ్ దేశంగా ఆవిర్భవించడానికి ప్రధాన కారణం భాషేనన్న వాస్తవాన్ని దేశ పాలకులు మరిచిపోకుంటే బాగుంటుంది. ఇండియా, పాకిస్తాన్ వేరు అయినప్పుడు బంగ్లాదేశ్‌ను తూర్పు పాకిస్థాన్‌గా పిలిచేవారు. వారి మాతృభాష బెంగాలీ. కానీ, వారి భాషకు తగిన గుర్తింపు లేదు. అందు కే, తమ భాషకు గుర్తింపు ఇవ్వాలని అక్కడి ప్రజలు ఉద్యమించారు. ఆ ఉద్యమం 1952 నుంచి నాలుగేళ్లపాటు సాగింది. ఉద్యమాన్ని అణచివేసేందుకు పాక్ ప్రభు త్వం మేధావుల్ని, అధ్యాపకులను జైళ్లలో వేసింది. ఫిబ్రవరి 21న పోలీసులతో కాల్పు లు జరిపించింది. మాతృభాష కోసం మొదలుపెట్టిన ఆ ఉద్యమంలో నెత్తురు ఏరులైపారింది. ఆ తర్వాత రెండు ప్రాంతాల మధ్య తీవ్ర వైరుధ్యం నెలకొంది. ఆఖరికి దేశం రెండుగా విడిపోవడానికి కారణమైంది. 1971లో బంగ్లాదేశ్ ఏర్పడింది.

**మాతృభాషతోనే లాభం...** భాష ప్రజల సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. భారతదేశం బహుభాషా, బహుళమత గుణములు కలిగిన ఒక విశ్వ విఖ్యాతమయిన దేశం. అంతేకాదు ఎవరికైనా మాతృ భాష అంటే మమకారం ఉంటుంది. భాష అనేది కేవలం భావాలు వ్యక్తం చేయడమే కాదు.. ఒక జాతి ఉనికిని, సంస్కృతిని, జీవన విధానాన్ని పరిచయం చేస్తుంది. మాతృభాష ఎంత గట్టిగా నేర్చుకుంటే దాని ద్వారా ఇతర భాషల్ని అంత గట్టిగా నేర్చుకోగలరని మెకంజి, వాకర్ లాంటి భాషా శాస్త్రవేత్తలు ఎప్పుడో చెప్పారు. ఇతర భాషలకన్నా మాతృభాషలో నేర్చుకోగల సామర్థ్యం ఎక్కువగా ఉంటుందని సాథియాసీలన్, కీసర్ ఎట్ ఆల్ లాంటి పరిశోధకులు తేల్చి చెప్పారు.

**దేశం విచ్ఛిన్నం కాకుండా...** స్వాతంత్ర్యానికి పూర్వం సైతం హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలు జరిగితే, దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిపి ప్రత్యేక ద్రవిడనాడు ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా దేశవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. దేశంలో హిందీయేతర భాషలు మాట్లాడేవారు 60 శాతంమంది ఉంటే... హిందీ, దానికి దగ్గరగా ఉండే భాషలు మాట్లాడేవారు 40 శాతంమంది ఉంటారు. వాస్తవాలిలా ఉంటే హిందీ భాష మాత్రమే దేశాన్ని ఏకం చేయగలదనడం అవివేకమే అవుతుంది. హిందీ భాషను నేర్చుకోవడం తప్పనిసరి చేసినా, ఉద్యోగావకాశాలను షరతుగా విధించినా మళ్లీ ఆందోళనలు చెలరేగే ప్రమాదముంది. అంతేకాకుండా హిందీ భాషపై తీవ్ర విముఖత పెరుగుతుంది. దేశం మనుగడకు ఒకే ఒక్క అధికార భాష ఉండాల్సిన అవసరం లేదు. ఏడున్నర దశాబ్దాలుగా భారతదేశం ఒకే ఒక్క అధికార భాషను అమలు చేయకుండా సైతం మనుగడలో ఉంది.

# సమాజాన్ని షేక్ చేస్తున్న 'ఫేక్' న్యూస్




మేకిరి దామోదర్
9573666650

ఆధునిక టెక్నాలజీ రెండువైపులా పదునున్న కత్తిలాంటిది. దాన్ని మంచికి వాడుకుంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవచ్చు. దానిని చెడుకు వాడుకుంటే! ఆ ఫలితాలతో చెడునే అనుభవించాల్సి వస్తుంది. మానవ సంబంధాలు, సమాజ ప్రగతి, సామాజిక విలువలు, ఆర్థిక సమానతలతో.. మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకున్నప్పుడే ఆధునిక టెక్నాలజీకి సార్థకత. కానీ నేటి ఆధునిక సాంకేతికత కాలంలో 'నిజం చెప్పులేసుకోక ముందేఫేక్ న్యూస్ (అబద్ధం)ప్రపంచాన్నే చుట్టేస్తుంది'. అలా సామాజిక మాధ్యమాల్లో ఫేక్ న్యూస్ శరవేగంగా వ్యాపిస్తూ పెత్తనం చెలాయిస్తుంది. మన దేశంలో అసత్య ప్రచారం (ఫేక్ న్యూస్)డీప్ ఫేక్ వీడియోల( ప్రసిద్ధ వ్యక్తుల చిత్రాలు, వీడియోలను చూపుతూ, వారు చెప్పినట్లుగా తప్పుడు సమాచారాన్ని కృత్రిమ మేధ టూల్స్ తో వ్యాప్తి చేయడం) సమస్య తీవ్రమవుతోంది.ఎంతలా అంటే తప్పుడు సమాచారమే నిజం అనే రీతిలో ప్రచారం చేయడం బాగా పెరిగిపోయింది. ఫేస్ బుక్, ఎక్స్ (గతంలో ట్విట్టర్ ) వంటి సామాజిక మాధ్యమాలు ఇందుకు వేదికలవుతున్నాయి. ఫలానా కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెడితే, అధిక ప్రతిఫలం వస్తుందంటూ ప్రసిద్ధ వ్యాపారవేత్తలు, చివరకు ఆర్బీఐ గవర్నర్ చెప్పారంటూ! రాజకీయ నాయకులు, సినిమా నటీనటు లు, వ్యాపారవేత్తలు ఇలా అనేకమంది ప్రముఖులను అపఖ్యాతి పాలు చేసేలా! వారే చెప్పారనేలా సృష్టించబడతాయి. అంతేకాదు అబద్ధాల్ని నిజాల పక్కన నిర్భయంగా నిలబెట్టేస్తున్నారు. ఎవరికో ఎవరితోనో అక్రమ సంబంధాలు అంటగడుతూ, మచ్చలేని వ్యక్తుల్ని కించపరుస్తారు. ఘన విజయాలు కూడా తేలిక చేసి చూపడం,మాట్లాడడం పెరిగిపోతోంది. ఇలాంటి విపరీత ప్రవర్తనలు సామాజిక మాధ్యమాలకు వేదికగా మారుతున్నాయి. వ్యక్తుల సమూహమే సమాజం.వ్యక్తులు ఉన్నత స్థాయికి సామాజిక విలువలతో చేరుకున్నప్పుడు సమాజం ప్రగతి వైపుప్రయాణిస్తుంది. ఎదుటి మనిషి ఓ ఎత్తుకు చేరుకున్నప్పుడు ఆ స్ఫూర్తితో మనము అంతటి స్థాయిని అందుకోవాలని ఆరాటపడడంలో తప్పులేదు. అలాంటి ప్రయత్నమేదీ లే(చేయ)కుండా బురద జలాల్లో, రాళ్లు విసిరో మనకంటే ఓ మెట్టు కిందికి లాగాలనుకోవడం ముమ్మాటికీ అనైతికం. ఇలాంటి తీరు సమాజానికి శ్రేయస్కరం కాదు. ఆధునిక టెక్నాలజీ సాయంతో రూపొందుతున్న ఫేక్, డీప్ ఫేక్ వీడియోలు, ఏ ఐ డీప్ ఫేక్ వీడియోల ఫోటోలు మార్ఫింగ్ తో ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులు, సినీ తారల వ్యక్తిగత జీవితాలను బజార్ కీడ్చడంతో కుటుంబాలు మానసిక ఆవేదనకు లోనవుతున్నారు. సమాజాన్ని వక్ర మార్గం పట్టిస్తున్నాయి.ఇలాంటి వేళ తక్షణమే వీటి నిరోధానికి మార్గాలు అన్వేషించాలంటూ ప్రభుత్వాలపై ఒత్తిడి అధికమవుతుంది. ఈ సమస్యపై ఐ ఎస్ బీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్), సైబర్ పీస్ అనే సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ప్రకారం అనేక వివరాలు వెలుగులోకి వచ్చాయి..

అసత్య ప్రచారం 77.4% సామాజిక మాధ్యమాల ద్వారానే ప్రచారంలోకి వస్తోంది. అందులో ఎక్స్ ద్వారా 61%, ఫేస్ బుక్ ద్వారా 34% అసత్య ప్రచారం ప్రజల్లోకి వెళ్తుంది.



వార్తలు, సమాచారం కోసం సామాజిక మాధ్యమాలను చూస్తున్న వినియోగదారుల సంఖ్య దాదాపు 74.89 శాతానికి చేరింది. అందులోనూ 68.21 శాతం మంది వీడియో సమాచారాన్ని ఇష్టపడుతున్నారు.

తప్పుడు వార్తల ప్రభావానికి లోనయ్యే వారిలో 18–24 సంవత్సరాల యువత అధికంగా ఉంటోంది.వీరిలోనూ తక్కువ ఆదాయాలు గల కుటుంబ సభ్యులు, తక్కువ విద్యార్హతలు గల యువతీ యువకులే ఎక్కువ.

సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతున్న తప్పుడు వార్తల్లో రాజకీయ రంగానికి సంబంధించినవి 46% ఉంటున్నాయి. సాధారణ అంశాలు, మత సంబంధ విషయాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో ఫేక్ మనుషులతో, ఫేక్ సమాచారంతో, ఫేక్ వీడియోలతో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉందనేది ఈ నివేదిక సారాంశం.

సామాజిక మాధ్యమాల్లో కనిపించే తప్పుడు వార్త (ఫేక్ న్యూస్), పూర్తిగా తప్పు లేదా పూర్తిగా నిజం కాని సమాచారాన్ని ఫేక్ న్యూస్ అంటారు. అది ఎక్కడి నుంచి వస్తుందో, ఎవరు పంపుతున్నారో స్పష్టంగా వెల్లడి కాదు. ఏదో ఒక ఐడి నుంచి వచ్చి సోషల్ మీడియాలో చలామణి అవుతుంది. ఐడి కూడా ఫేక్‌దే కావచ్చు. కొంతమంది వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారంలోకి తెస్తున్నారు. తద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించడం కోసం ఉన్నది లేనట్లు లేనిది ఉన్నట్లు చూపిస్తున్నారు. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ఇటువంటి అసత్య ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అది తప్పుడు వార్త అనే అనుమానం రానంత పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తారు. సోషల్ మీడియా వేదికలన్నింటిలోనూ దీన్ని వైరల్ చేస్తారు. తప్పుడు సమాచారం ఫేక్ న్యూస్ వీడియోల వల్ల రాజకీయ పార్టీ(నాయకు)ల జయాపజయాలను, ప్రవర్తనను ప్రభావితం చేస్తోంది. వ్యాపార దిగ్గజాలు, సినీ ప్రముఖులు, పాలక ప్రతిపక్షాలు,మాన్యులు,సామాన్యులు ఇలా ఎంతో మంది సమాజంలో ఇబ్బందులు పడుతున్నారు. ఏది వాస్తవమో ఏది అవాస్తవమో తెలియక తల్లడిల్లి పోతున్నారు.

అంతెందుకు మన రాష్ట్ర రాజధానిలో10వ తరగతి చదువుతున్న విద్యార్థి, తన తోటి విద్యార్థిని ఫోటోలను మార్ఫింగ్ చేసి నాతో ఒంటరిగా గడపాలని, లేదంటే? సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని బ్లాక్ మెయిల్ చేస్తున్న ఉదంతాలను చూస్తుంటే..టెక్నాలజీ ఎవరి కోసం ఎందుకు వచ్చిందో, ఇలా టెక్నాలజీని విచక్షణ కోల్పోయి దుర్వినియోగం చేస్తున్న తీరు అమానుషం.టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలి గాని సమాజ విలువలు తగ్గించే చర్యలు మంచిది కాదు. ఆధునిక నాగరికత ముసుగు వేసుకున్న సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ సామాజిక రుగ్మతను నిరోధించడానికి సమిష్టి కృషి ఎంతో అవసరం. సైబర్ సెక్యూరిటీ చర్యలను బలోపేతం చేయడం పై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి,ప్రజలు కూడా సమిష్టి బాధ్యతతో వ్యవహరించాలి.

అస(అర్ధ)త్యాల ప్రచారాన్ని అడ్డుకునేందుకు కఠిన చర్యలకు పూనుకోవాలి. సాంకేతిక పరిష్కారాలకు మాత్రమే పరిమితం కాకుం డా, ప్రచార సాధనాలపై ప్రజల్లో చైతన్యం, అవగాహన పెంపొందించాలి.

## రక్షణరంగంలో 4వ అద్వితీయ శక్తి ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు

దేశ రక్షణలో అహరహం తలమునకలైన త్రివిధ దళాలు భారతీయ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావికా బలగాలకు ఆయుధ శక్తిని నింపుతున్న ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు గత రెండు శతాబ్దాలకు పైగా అవిశ్రాంత, అమూల్య సేవలను అందిస్తున్నాయి. మన దేశ త్రివిధ దళాలకు అవసరమయ్యే ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణకు వినియోగించే ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసే ప్రభుత్వ రక్షణ రంగ సంస్థగా ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు అమూల్య సేవలను అందిస్తున్నాయి. భారతదేశ త్రివిధ సాయుధ దళాల వెనుక ఆయుధ శక్తిగా తన విశిష్టతలను ప్రదర్శిస్తున్న ఆర్డనెన్స్ ఫ్యాక్టరీల చరిత్ర చాలా గొప్పది. వలసపాలకుల కాలంలో 18 మార్చి 1801న తొలి ఆర్డనెన్స్ ఫ్యాక్టరీ కలకత్తా సమీపాన కొస్సిపోర్ ప్రాంతంలో నెలకొల్పడం జరగడంతో ఆ చారిత్రాత్మక సన్నివేశానికి గుర్తుగా ప్రతి ఏట 18 మార్చిన దేశ త్రివిధ దళాలు, ఆర్డనెన్స్ ఫ్యాక్టరీ బోర్డులు సంయుక్తంగా ఆర్డనెన్స్ ఫ్యాక్టరీల దినోత్సవంను ఘనంగా జరుపుకోవడం కొనసాగుతున్నది. మన త్రివిధ దళాలకు ధీటుగా 4వ సాయుధ బలగంగా ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు విశిష్ట సేవలను అందిస్తున్నాయి. కాలానుగుణంగా వివిధ రకాలైన ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, రక్షణరంగ వాహనాల రూపకల్పన, సిబ్బంది ప్రత్యేక దుస్తుల తయారీ, పర్వత ప్రాంత రవాణాకు సంబంధించిన ఉపకరణాలు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలను మన దేశ అవసరాలకు అనుగుణంగా తయారుచేసి సమయానికి అందిస్తూ దేశ రక్షణలో ప్రధాన భూమికను నిర్వహిస్తున్న ఆర్డనెన్స్ ఫ్యాక్టరీల సిబ్బంది సేవలను గుర్తించడం, దేశ రక్షణలో అమరత్వం పొందిన యోధులను స్మరించుకోవడం, ఆర్డనెన్స్ ఫ్యాక్టరీల సేవకు సంబంధించిన ఫోటో ప్రదర్శనలు, పరెడ్ల నిర్వహణ లాంటి కార్యక్రమాలను ఈ వేదికగా నిర్వహించడం జరుగుతుంది. దేశవ్యాప్తంగా 41 ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు 24 ప్రాంతాల్లో స్థాపించడంతో పాటు 9 శిక్షణ కేంద్రాలు, 3 ప్రాంతీయ మార్కెటింగ్ కేంద్రా లు, 4 ప్రాంతీయ భద్రత కార్యాలయాలు, 5 ఆపరేషనల్ విభాగాలుగా విస్తరించి ఉన్నాయి. ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలు రానున్నకాలంలోనూ త్రివిధ దళాలకు ఆయుధ శక్తిని అందిస్తూ దేశ సమగ్రత, సమైక్యతలను కాపాడటంలో ప్రధాన పోషిస్తాయి. భారత మాత సేవలో ప్రాణాలర్పించిన ఆర్డనెన్స్ ఫ్యాక్టరీలకు సంబంధించిన అమరులకు ఘన నివాళులు అర్పించడం, ప్రస్తుతం సేవలు అందిస్తున్న సైనికులకు ధైర్యంగా నిలవడం మన కనీస బాధ్యత.

### గమనిక

గత ఆదివారం (2025 మార్చి 16న) 4వ పేజీలో 'మీడియా.. సోషల్ మీడియా.. ఏది జర్నలిజం?' శీర్షికతో ప్రచురితమైన కామెంటరీలో "ఎంతగా అంటే ఇటీవల లోక్‌సభ సాధారణ ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వంలోని మంత్రుల పాడ్‌క్యాస్ట్‌ల కోసం ఒప్పందాలు జరిగాయి."కి బదులుగా "ఎంతగా అంటే ఇటీవల లోక్‌సభ సాధారణ ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వంలోని మంత్రుల పాడ్‌క్యాస్ట్‌లు కేంద్ర ప్రభుత్వం 'మైగవ్ (MyGov)' కొలాబరేషన్(సహకారం)తో జరిగాయి." అని చదువుకోగలరు.
సం॥

# కార్మిక కోడ్‌ల రద్దు...
# ప్రైవేటీకరణ వద్దు


కేంద్ర కార్మిక సంఘాల డిమాండ్

రెండు నెలల ప్రచారోద్యమం

మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు

**న్యూఢిల్లీ:** కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ, నిరుద్యోగం, పేదరికం, అసమానతలను పెంచేసిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటానికి కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శ్రామికుల కష్టాలను పట్టని సర్కార్ మెడలు వంచి తమ డిమాండ్లు సాధించుకోవాలని సంకల్పించాయి. నాలుగు కార్మిక కోడ్‌లను బేషరతుగా ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు అప్పగించడంపై వెనక్కు తగ్గాలని ఉమ్మడిగా డిమాండ్ చేశాయి. న్యూదిల్లీలోని ప్యారే లాల్ భవన్‌లో జరిగిన కార్మిక జాతీయ సదస్సు సందర్భంగా ప్రజలు, కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను తిప్పికొట్టాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తీర్మానించాయి. ఉమ్మడి పోరాటానికి సంకల్పిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. అంతకుముందు రెండు నెలల పాటు ప్రచారోద్యమాన్ని చేపట్టేలా నిర్ణయించాయి. సదస్సులో అమర్‌జీత్ కౌర్ (ఏఐటీయూసీ), అశోక్ సింగ్ (ఐఎన్‌టీయూసీ), హర్భజన్ సింగ్ (హెచ్‌ఎంఎస్), తపన్ సేన్ (సీఐటీయూ), హరీశ్ త్యాగి (ఏఐయూటీయూసీ), కె.ఇందు ప్రకాశ్ మెనన్ (టీయూసీసీ), లతా బేన్ (ఎస్‌ఈడబ్ల్యూఏ), రాజీవ్ డిమ్రీ (ఏఐసీసీటీయూ), జవహర్ ప్రసాద్ (ఎల్‌పీఎఫ్), అశోక్ ఘోష్ (యూటీయూసీ) ప్రసంగించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఇక చాలు అంటూ ఐక్యంగా గళం వినిపిద్దాం.. మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం అని నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక కోడ్‌లను రద్దు విషయంలో రాజీ లేని పోరాటం చేద్దామన్నారు. నయా ఉదారవాద వినాశకార విధానాలకు ప్రత్యామ్నాయంగా 17 అంశాల డిమాండ్ల పట్టికకు కట్టుబడాలని నాయకులు పునరుద్ఘాటించారు. సదస్సుకు దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు, బొగ్గు, ఉక్కు, నౌకాశయాలు, విద్యుత్, టెలికాం, పోస్టల్, రైల్వే, రక్షణ, రోడ్డు రవాణా, విద్య, ఆరోగ్యం, జల, సౌర సేవల సంఘాల కార్యకర్తలు, నాయకులతో పాటు ప్రైవేటు, అసంఘటిత రంగానికి చెందిన ఒప్పందఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్వయం ఉపాధి, గిగ్ వర్కర్లు, ఇంటిపనివారు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, బీడీ, నిర్మాణరంగ కార్మికులు, లోడింగ్, అన్‌లోడింగ్ చేసే వారు హాజరయ్యారు. కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక బీజేపీ ప్రభుత్వ విధానాలపై ఐక్యం గళం వినిపించారు. డిమాండ్ల సాధనకు సంఘటిత పోరుకు సంకల్పించారు.

# ‘మహాకుంభ్’పై చర్చకు విపక్షాల పట్టు



లోక్‌సభలో గందరగోళం

మోదీ ప్రకటనలో తొక్కిసలాట మరణాలను కూడా చేర్చాలని డిమాండ్

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో మంగళవారం గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. మహా కుంభ్‌పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రకటన చేయగా, దానిపై ప్రశ్నలు అడగాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుబట్టారు. దీంతో విపక్ష సభ్యుల నిరసనల మధ్య లోక్‌సభ బుధవారానికి వాయిదా పడింది. అంతకు ముందు సభలో మోదీ మహాకుంభ్‌పై ప్రకటన చేసిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు తమ సీట్లలో లేచి నిలబడి నిరసన వ్యక్తం చేశారు. మోదీ ప్రకటనలో తొక్కిసలాట మరణాలను కూడా చేర్చాలని వారు డిమాండ్ చేశారు. దీంతో సభను మధ్యాహ్నం ఒంటిగంట వరకు వాయిదా వేశారు. ప్రతిపక్ష సభ్యులను మాట్లాడటానికి అనుమతించాలని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పీకర్ ఓం బిర్లాను కోరారు. వారు కూడా తొక్కిసలాట మరణాలను ప్రకటనలో చేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, టిఎంసి, ఇతర ప్రతిపక్ష పార్టీల సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లగా, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు నిరసనగా వాకౌట్ చేశారు. కాగా, పతిపక్ష పార్టీలు మహాకుంభ్ పై చర్చించాలని డిమాండ్ చేశాయని, ఈ అంశంపై తమ అభిప్రాయాలను అందరితో పంచుకోవాలని భావించాయని పార్లమెంటరీ వర్గాలు తెలిపాయి. అయితే బిఎసి సమావేశంలో కూడా మహా కుంభ్ పై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. జనవరి 29న మహా కుంభ్‌లో జరిగిన తొక్కిసలాటవగా, 30 మంది యాత్రికులు మరణించగా, 60 మంది గాయపడ్డారు. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైన వెంటనే రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తన మంత్రిత్వ శాఖకు సంబంధించి గ్రాంట్ల డిమాండ్లపై చర్చకు సమాధానమిచ్చారు. ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు వెల్‌లో నిరసన కొనసాగించారు, దీంతో స్పీకర్ కార్యకలాపాలను, జల్ శక్తి మంత్రిత్వ శాఖ గ్రాంట్ల డిమాండ్లపై చర్చను చైర్మన్ బుధవారానికి వాయిదా వేశారు.

**భారత్ శక్తిని ప్రపంచం మొత్తం చూసింది : మోదీ**

అందరి సహకారంతో మహా కుంభమేళా విజయవంతమైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచం మొత్తం భారత దేశ శక్తిని చూసిందని కొనియాడారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా కుంభమేళాను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం అందరి కృషి ఫలితం అని మోదీ అన్నారు. ‘మహాకుంభమేళా విజయం అందరూ కలిసికట్టుగా చేసిన కృషి ఫలితం. భారత్ గొప్పతనాన్ని మహాకుంభ్ రూపంలో ప్రపంచం మొత్తం చూసింది. మహా కుంభ్‌లో జాతీయ మేల్కొలుపును మనం చూశాం. ఇది కొత్త విజయాలకు ప్రేరణనిస్తుంది. మన సామర్థ్యంపై ఉన్న అనుమానాలను కుంభమేళా పటాపంచలు చేసింది. కుంభమేళాలో భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ఆవిష్కృతమయ్యాయి. ఇది దేశ ప్రజల విజయం. కుంభమేళా ప్రజల్లో ఆధ్యాత్మిక స్ఫూర్తిని పెంచింది. ఈ చారిత్రాత్మక ఘట్టం భవిష్యత్తు తరాలకు ఉదాహరణగా నిలుస్తుంది’ అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 45 రోజులపాటూ సాగిన ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారని మోదీ తెలిపారు. రాజకీయ, సినీ, వ్యాపార, విదేశీ ప్రముఖులు ఈ కుంభమేళాకు హాజరైనట్లు చెప్పారు. కుంభమేళా నీళ్లను తాను మారిషస్‌కి కూడా తీసుకెళ్లినట్లు ప్రధాని చెప్పారు. ప్రయాగ్‌రాజ్‌లోని గంగ, యమున, సర్వతి నదులు కలిసే పవిత్ర త్రివేణీ సంగమంలో 66 కోట్ల మంది పుణ్యస్నానాలు చేసినట్లు వెల్లడించారు.

## ప్రతిపక్ష నేతను లోక్‌సభలో మాట్లాడనివ్వరా?



**న్యూఢిల్లీ :** మహా కుంభమేళాపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటన అనంతరం ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ కొద్దిసేపు వాయిదా పడగా లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు (ఎల్‌ఒపి) రాహుల్ గాంధీ స్పందిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎల్‌ఒపిని మాట్లాడనివ్వాలని, కానీ ‘నవ భారతం’లో అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. పార్లమెంట్ వెలుపల విలేకరులతో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, మహా కుంభమేళా అంశంపై తాను కూడా మాట్లాడాలని అనుకున్నానని తెలిపారు. జనవరి 29న ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయినవారికి ప్రధాని మోడీ శ్రద్ధాంజలి ఘటించి ఉండవలసిందని రాహుల్ అన్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు జరిగిన మహా కుంభమేళా విజయంపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు ప్రతిపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేసిన నేపథ్యంలో లోక్‌సభను మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొద్ది సేపు వాయిదా వేశారు. ప్రధాని మాట్లాడిన తరువాత ప్రతిపక్ష సభ్యులు అనేక మంది తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. ‘ఆయన చెప్పిన విషయాన్ని సమర్థించాలని అనుకున్నాను. మహా కుంభమేళా మన సంప్రదాయం, చరిత్ర, సంస్కృతి. (మహా కుంభమేళాలో తొక్కిసలాటలో) ప్రాణాలు కోల్పోయిన వారికి ఆయన నివాళి అర్పించలేదనే ఫిర్యాదు కూడా ఉంది’ అని రాహుల్ చెప్పారు. ‘కుంభమేళాకు వెళ్లిన యువజనులకు ప్రధాని నుంచి అందవలసింది మరొకటి ఉందని, వారికి ఉపాధి అవసరమని చెప్పాలని అనుకున్నాను. ప్రధాని ఉపాధి కల్పనపై మాట్లాడవలసి ఉంది’ అని రాహుల్ అన్నారు. మిమ్మల్ని మాట్లాడనివ్వలేదా అని అడిగినప్పుడు రాహుల్ సమాధానం ఇస్తూ, ‘మమ్మల్ని మాట్లాడనివ్వలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రకారం, ఎల్‌ఒపిని మాట్లాడనివ్వాలి, కానీ అనుమతి ఇవ్వలేదు, అయితే, ఇది నవ భారతం’ అని చెప్పారు. సభలో ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వాలని కాంగ్రెస్ వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ‘ప్రతిపక్షానికి కూడా మనోభావాలు ఉంటాయి. తమ అభిప్రాయాలను వ్యక్తీకరించేందుకు వారికి ఎటువంటి అభ్యంతరాలూ వ్యక్తం కాకూడదు’ అని ప్రియాంక అన్నారు.

# వైష్ణోదేవి ఆలయంలో భద్రతా వైఫల్యం



**జమ్ము :** జమ్ములోని వైష్ణోదేవి ఆలయంలో భద్రత వైఫల్యం వెలుగు చూసింది. ఒక మహిళ తనిఖీలు నిర్వహించే సిబ్బంది కళ్లుగప్పి తుపాకీతో ఆలయంలోకి ప్రవేశించింది. ఈ నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక మహిళ వద్ద ఆయుధాన్ని గుర్తించిన అధికారులు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమె వద్ద నుంచి తుపాకీని వారు స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళను ఢిల్లీ పిఎస్‌లో పని చేస్తున్న జ్యోతి గుప్తాగా పోలీసులు గుర్తించారు. గడువు ముగిసిన లైసెన్స్‌డ్ తుపాకీని ఆమె ఆలయంలోకి తీసుకువచ్చినట్లు, ఆమెపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు. ఈ ఘటన ఆలయానికి వచ్చే భక్తులను ఒక్కసారిగా ఉలికిపాటుకు గురి చేసింది. ఆయుధంతో ఆమె ఆలయంలోకి ప్రవేశించే వరకు భద్రత సిబ్బంది ఎవరూ దానిని గుర్తించకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

30 గుడిసెలు, రెండు కర్మాగారాలు దగ్ధం

**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ద్వారకా మోర్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో కనీసం 30 గుడిసెలు, రెండు కర్మాగారాలు, కొన్ని దుకాణాలు కాలిపోయాయని ఢిల్లీ అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. 30 గుడిసెలు, రెండు తాత్కాలిక ఐస్ క్రీం ఫ్యాక్టరీలు, కార్ ఉపకరణాలు, కిరాణా దుకాణాలు అగ్నిప్రమాదంలో కాలిపోయాయని ఆయన అన్నారు. తెల్లవారుజామున 3:50 గంటలకు మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని అధికారి తెలిపారు. మంటలను ఆర్పిన తర్వాత, గుడిసెలు కోల్పోయిన మురికివాడల నివాసితులు తమ పాత్రలు, ఇతర వస్తువులను తనిఖీ చేస్తున్నట్లు కనిపించింది. ఇక్కడ దాదాపు 150 గుడిసెలు ఉన్నాయి. నివాసితులందరూ కార్మికులు, రోజువారీ వేతనాలు సంపాదించడానికి వివిధ కర్మాగారాల్లో పనిచేస్తున్నారు. ఐస్ క్రీములు అమ్మడం, ఇతర ప్రదేశాలలో పనిచేయడం ద్వారా మేము రోజుకు రూ. 150 నుండి రూ. 300 వరకు సంపాదిస్తాము. అగ్నిప్రమాదం త్వరగా వ్యాపించడంతో మేము మా వస్తువులను తీసుకెళ్లలేకపోయామని శశి దేవి అన్నారు. మరో మహిళ గురియా మాట్లాడుతూ, ‘ఐస్ క్రీం ఫ్యాక్టరీలలో ఒకదాని నుండి పొగ వస్తున్నట్లు తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో గమనించాను. మంటలు చాలా వేగంగా వ్యాపిస్తుండటంతో నేను వెంటనే నా పొరుగువారిని గుడిసెలను ఖాళీ చేయమని చెప్పాను’. కిరాణా సామాగ్రి అమ్మే సుశీల, మంటలను గమనించినప్పుడు అందరూ నిద్రపోతున్నారని చెప్పారు. ‘మా వస్తువులను మాతో తీసుకెళ్లడానికి సమయం లేదు. ఇప్పుడు, మాకు సరిగ్గా పడుకోవడానికి ఇల్లు కూడా లేదు. తినడానికి ఏమీ లేదు’ అని సుశీల పిటిఐతో అన్నారు. బాధితుల్లో కొందరు తమ ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలు వంటి పత్రాలు కాలిపోయాయని, వాటిని తిరిగి పొందడానికి ప్రభుత్వ సహాయం అవసరమని చెప్పారు. కొంతమంది నివాసితులు తమ పాఠశాల పుస్తకాలు అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో తమ పిల్లల చదువు గురించి కూడా ఆందోళన వ్యక్తం చేశారు. హరికేశ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారు, కానీ మా ఇంట్లో ఉన్నవన్నీ బూడిదయ్యాయని అన్నారు.

# కుంభమేళా మృతుల సంఖ్యావివరాలు లేవు

లోక్‌సభలో మంత్రి నిత్యానంద్‌రాయ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** మహాకుంభమేళాలో జరిగిన తొక్కిసలాటపై ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం విచారణ జరిపిందనీ, ఐతే ఈ తొక్కిసలాటలో మృతులు, గాయపడివారి సంఖ్యావివరాలు మాత్రం కేంద్ర ప్రభుత్వం వద్ద లేవని లోక్‌సభకు మంగళవారంనాడు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు. కాంగ్రెస్ ఎంపీలు కె.సి.వేణుగోపాల్, కిర్సన్ నామ్డియోలు అడిగిన ఒక ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానం చెప్పారు. ఈ తొక్కిసలాటలో ఎంత మంది మరణించారు? ఎంతమంది గాయపడ్డారు? ఈ ఘటనలకు గల కారణాలపై అధికారులు ఎంటి దర్యాప్తు చర్యలు తీసుకున్నారు? అని కాం గ్రెస్ ఎంపీలు ప్రశ్నించారు. “రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూలులో పేర్కొన్న విధంగా ప్రజాభద్రత, పోలీసు వ్యవహారాలు అన్నీ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయనీ తమకు సంబంధం లేదని మంత్రి చెప్పారు. మతపరమైన జాతరల నిర్వహణ, గుంపుల భద్రత, భక్తులకు సదుపాయాలు సమకూర్చే నిబంధనలు, బాధ్యతలు, ఆ సందర్భంగా జరిగే విధ్వంసాలను నియంత్రించే బాధ్యతలు వంటివన్నీ ప్రజా భద్రత పరిధిలోకి వస్తాయని, ఈ విషయాలను రాష్ట్ర ప్రభుత్వమే చూసుకుంటుందని మంత్రి సమాధానం చెప్పారు. ఏ విధమైన విధ్వంసాలు జరిగినా వాటిపై విచారణ, కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం వంటి విషయాలన్నీ రాష్ట్ర ప్రభుత్వం చిట్టాలోకి వస్తాయన్నారు. అందువల్ల వీటికి సంబంధించిన గణాంకాలు కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండబోవన్నారు. మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు మరణించారనీ, మరో 60 మంది గాయపడ్డారనీ ఉత్తర ప్రదేశ్ డిజిపి వైభవ్ కృష్ణ గతంలో చెప్పారు.

# దుకాణాలపై పేర్లు తమిళంలో ఉండాల్సిందే..

త్రిభాషా విధానంపై వివాదం వేళ

పుదుచ్చేరి ప్రభుత్వం కీలక ప్రకటన



**పుదుచ్చేరి :** తమిళనాడు అధికారిక డిఎంకె పార్టీ, కేంద్రం మధ్య కొంతకాలంగా హిందీ భాష విషయంలో వివాదం కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో తమిళం మాట్లాడే ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉన్న కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరి నుంచి కీలక ప్రకటన వెలువడింది. దుకాణాలు, వ్యాపార సముదాయాల సైన్‌బోర్డులపై పేర్లు తమిళంలో ఉండాల్సిందేనని సిఎం రంగస్వామి అన్నారు. ఈమేరకు సూచనలు చేస్తూ సర్క్యులర్ జారీ చేస్తామని చెప్పారు. పుదుచ్చేరిలో తమిళం, తెలుగు, మలయాళం, ఇంగ్లీష్, ఫ్రెంచ్ అధికారిక భాష లు. అయితే ఇక్కడ తమిళభాష మాట్లాడేవారి సంఖ్యే ఎక్కువ. ఇదిలాఉంటే.. జాతీయ విద్యా విధానంలోని (ఎన్ఇపి) త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలు ఉండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈనేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈక్రమంలోనే పుదుచ్చేరి నుంచి స్పందన వచ్చింది. ఇదిలాఉంటే.. కేంద్రం, తమిళనాడు డిఎంకె ప్రభుత్వాల మధ్య హిందీ గొడవ.. రూపీ లోగో వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆ రాష్ట్ర బడ్జెట్ లోగోలో ఇప్పటివరకు ఉన్న రూపీ అనే లోగో స్థానంలో తమిళంలోని ‘రూ’ అనే తమిళ అక్షరాన్ని మార్చడమే ఇందుక్కారణం. భాష విషయంలో ఎంత దృఢంగా ఉన్నామో చెప్పడానికే ఈ మార్పు చేసినట్లు తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ప్రజాస్వామ్యదేశం పోలీస్ రాజ్యంలా పనిచేయకూడదు : సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :** ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయినప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించడాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్యదేశం పోలీసుల రాజ్యం లా పని చేయకూడదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పనిచేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలు చేసే సంస్థలు, కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోద యోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం, చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీం కోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోంది. అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా , జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకుపైగా కస్టడీలో ఉన్న నిందితుడికి బెంచ్ బెయిల్ మంజూరు చేసింది. దర్యా ప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ, నిందితుడికి బెయిల్ పిటిషన్‌ను ట్రయిల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించ గలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీం కోర్టు ముందుకు తీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. చిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరు చేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# అభినందనలు నాకు కాదు..
# రాహుల్‌గాంధీకి తెలపండి



సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్ బిల్లులు ఉభయ సభల్లో పాస్ కావడంతో బిసి సంఘ నాయకులు మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ అభినందనలు తనకు కాదు ఈ అభినందనలు అందించాల్సింది రాహుల్ గాంధీకి అని పేర్కొన్నారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన రాష్ట్రాల్లో కులగణన నిర్వహిస్తామని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కులసర్వే నిర్వహించామని, 50 శాతానికి మించి రిజర్వేషన్లు పెంచుకోవాలంటే ముందుగా జనాభా లెక్క తేలాలి. ఆ లెక్కలకు చట్టబద్ధత కల్పించాలి.. అప్పుడే రిజర్వేషన్లు పెంచుకునేందుకు వీలుంటుందని... అందుకే రాష్ట్రంలో బిసి కుల సర్వే నిర్వహించుకున్నామని అన్నారు. అసెంబ్లీలో ఫిబ్రవరి 4కు ప్రత్యేక స్థానం ఉందని.. అందుకే ఫిబ్రవరి 4ను సోషల్ జస్టిస్ డేగా ప్రకటించుకున్నామన్నారు. పక్కా ప్రణాళికతో మంత్రివర్గ ఉపసంఘం, అ తరువాత డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఒక టైం ఫ్రేమ్‌లో కులసర్వే పూర్తి చేశామని తెలిపారు. మొదటి విడతలో కులసర్వేలో పాల్గొనని వారికోసం రెండో విడతలో అవకాశం కల్పించామని, పూర్తి పారదర్శకంగా కుల సర్వేను పూర్తి చేశామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లెక్కలు తేల్చాలన్నా మన రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలనేదే మా ఆలోచన అని అన్నారు. ఈ కులసర్వే చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ఇందులో తాము భాగస్వాములవడం తమకు గర్వకారణం మని అభిప్రాయపడ్డారు. దీనిని బిసి సోదరులు అర్థం చేసుకోవాలి.. దీన్ని తప్పు పడితే నష్టపోయేది బిసి సోదరులేనన్నారు. కేవలం డాక్యుమెంట్ చేసి వదిలేయకుండా బిల్లు చేశాం, రాజకీయ పరమైన రిజర్వేషన్లు, విద్యా ఉద్యోగ రిజర్వేషన్ల కోసం వేర్వేరుగా రెండు బిల్లులు శాసనసభలో ఆమోదించుకున్నామని తెలిపారు. మండల్ కమిషన్ కూడా బిసిల లెక్క 52 శాతం అని తేల్చిందని, తాము నిర్వహించిన కులసర్వే ద్వారా బిసిల లెక్క 56.36 శాతంగా తేల్చామన్నారు. లెక్క తేల్చడం కోసమే స్థానిక ఎన్నికలు వాయిదా వేశామని స్పష్టం చేశారు. సిఎంను కలిసి అభినందించిన వారిలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎలు ఆది శ్రీనివాస్, శంకర్, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హన్మంత్‌రావుతో పాటు బిసి నేత జాజుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు
# రష్యా ప్రతినిధుల ఆసక్తి..



రాష్ట్రంలో అనుకూలతలను వివరించిన మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించిన రష్యా ప్రభుత్వ ప్రతినిధులకు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంగళవారం అసెంబ్లీ మీటింగ్ హాల్‌లో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పారిశ్రామికవేత్తలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలను మంత్రి వివరించారు. గ్లోబల్ కేపిటల్ ఆఫ్ ఏఐగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టులో రష్యా కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా చొరవ చూపాలని ప్రతినిధులను కోరారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ప్రపంచ స్థాయి నిపుణులను తయారు చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ కంపెనీల్లో అధిక శాతం తెలంగాణలో తమ కార్యకలాపాలను నిర్వర్తిస్తున్నాయన్నారు. జీసీసీలకు హబ్, వ్యాక్సీన్ కేపిటల్‌గా హైదరాబాద్ మారిందన్నారు. యూఎస్ తర్వాత అతిపెద్ద జీసీసీని అమెజాన్ హైదరాబాద్ లో ఏర్పాటు చేయడం తమకు గర్వకారణమన్నారు. టీ హబ్, టీ వరక్స్ వంటి సంస్థల ద్వారా నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటీ, ఇన్నోవేషన్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఇతర అంశాల్లో రష్యా ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పౌర సేవలను ప్రజల ముంగిటకు చేర్చేందుకు రష్యాలో అమలవుతున్న ఉత్తమ పద్ధతులపై అధ్యయనం చేస్తామన్నారు. సమావేశంలో రష్యా ప్రభుత్వ ప్రతినిధులు లిడ్మిలా ఒగారోడోవా, డిమిత్రీ స్టారోస్టిన్, రామిల్ ఖిస్మాటుల్లిన్, వెరా ప్రోంకినా, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మణిపూర్ బడ్జెట్‌కు రూ.51,463 కోట్ల అదనపు వ్యయానికి పార్లమెంట్ ఆమోదం



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపూర్‌కు సంబ ంధించిన గ్రాంట్ల అనుబంధ డిమాండ్లను మంగళవారం పార్లమెంట్ ఆమోదించింది. దీనివలన మణిపూర్ బడ్జెట్‌కు సంబంధించి ప్రస్తుత, ఆర్థిక సంవత్సరంలో రూ. 51,463 కోట్ల అదనపు వ్యయం అవుతుంది. 2025–26 సంత్సరానికి మణిపూర్ బడ్జెట్, రాజ్యసభ లోక్‌సభకు తిప్పిపంపించిన 4 బిల్లులు ఉన్నాయి. 2021–22 ఆర్థిక సంవత్సరానికి రూ.1,291కోట్ల అదనపు మంజూరు కోసం డిమాండ్లు, 2024–25 సంవత్సరంలో మణిపూర్ గ్రాంట్ల కోసం రూ.1,861 కోట్ల అనుబంధ డిమాండ్లను కూడా పార్లమెంట్ ఆమోదించింది. లోక్‌సభ మార్చి 11న గ్రాంట్లకు సంబంధించిన అనుబంధ డిమాండ్లను 2025–26సంవత్సరానికి మణిపూర్ బడ్జెట్‌ను ఇప్పటికే ఆమోదించడం జరిగిపోయింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాలుగుబిల్లులపై చర్చ అనంతరం ఇచ్చిన సమాధానం తర్వాత రాజ్యసభ కేటాయింపు బిల్లు–2025, కేటాయింపు (నెంబర్ 2) బిల్లు 2025, మణిపూర్ కేటాయింపు బిల్లు2025 లను లోక్‌సభకు తిప్పి పంపించింది. ప్రభుత్వం కోరిన స్థూల అదనపు వ్యయం కోసం రూ.6.78లక్షల కోట్ల రెండవ బ్యాచ్ అనుబంధ డిమాండ్లు రూ.6.27లక్షల కోట్లు సేవింగ్స్, రిసిప్ట్స్‌తో సరిపోతాయి. గ్రాంట్ల కోసం రెండవ బ్యాచ్ సప్లిమెంటరీ డిమాండ్‌ల ప్రకా రం... ప్రభుత్వం ప్రస్తుత, ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ఖర్చు చేసిన నికర అదనపు వ్యయం రూ.51,462.86 కోట్లుగా ఉన్నది. గ్రాంట్ల కోసం డిమాండ్లు సహా రూ.5.54 లక్షల కోట్ల సాంకేతిక అనుబంధ గ్రాంట్ల డిమాండ్లు కూడా ఉన్నాయి. ఇది రుణాన్ని తిరిగి చెల్లించే దిశగా సాగుతోంది. మణిపూర్ బడ్జెట్ మొత్తం వసూళ్లకు రూ.35,368కోట్లను అందిస్తుంది. మొత్తం వ్యయం రూ.35,104కోట్లుగా అంచనా వేయబడింది. రాష్ట్రం సొంత పన్ను ఆదాయం రూ.2,634కోట్లు కాగా, నాన్ ట్యాక్స్ దాదాపు రూ.400 కోట్లుగా ఉంది. ఇది ఓట్ ఆన్ అకౌంట్ కోసం ఆరు నెలల కాలాన్ని, ఈ దశ కోసం రూ.17,947కోట్లు అడుగుతోంది. ప్రస్తు తం రాష్ట్రపతి పాలన కింద ఉన్న మణిపూర్ కోసం కంటింజెన్సీ ఫండ్ సృష్టించేందుకు ఓట్ ఆన్ అకౌంట్ రూ.500కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసింది. మణిపూర్‌కు ఈ ఆకస్మిక నిధిని సృష్టించే అధికారం పార్లమెంట్‌కు 2025 ఫిబ్రవరి 13న రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేయబడిన ప్రకటన ఫలితంగా సంక్రమించింది.

## చేనేత ఔన్నత్యానికి ముగ్ధులైన ఛత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్సిటీ విద్యార్థులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి చేనేత పరిశ్రమను సందర్శించిన ఛత్తీస్ ఘడ్ అమిటీ యూనివర్సిటీ విద్యార్థులు నేత కార్మికుల కళను చూసి మురిసిపోయారు. ఫ్యాషన్ టెక్నాలజీలో మొదటి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ రాష్ట్రానికి చెందిన 17 మంది విద్యార్థులు ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా మంగళవారం పోచంపల్లి చేనేత పరిశ్రమను చేనేత కార్మికుల గృహాల వద్దకు వెళ్లి నేరుగా మగ్గంపై నేస్తున్న చీరల తయారీ పని తీరును పరిశీలించారు. కాకా పురస్కార హ్యాండ్లూమ్ యూనిట్‌లో చేనేత వస్త్రాల తయారీ ప్రతి దశను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాషన్ టెక్నాలజీలో రెండకు అనుగుణంగా చేనేత కార్మికులు చేస్తున్న సృజనాత్మక కృషిని అభినందించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ దీప్తిక విద్యార్థులతో కలిసి వచ్చారు.

## యాదగిరిగుట్టలో మిస్ యూనివర్స్ విక్టోరియా ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామిని మంగళవారం విశ్వసుందరి (మిస్ యూనివర్స్) విక్టోరియా క్జార్ థెయిల్విగ్ దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయ ఈశాన్య దిశలో ఉన్న అఖండజ్యోతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తూర్పు రాజగోపురం నుండి త్రితల గోపురం గుండా ఆలయంలోకి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన విశ్వసుందరి చేరుకున్నారు. క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి మిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వర్ణ ధ్వజస్తంభానికి మొక్కి గర్భాలయంలోకి వెళ్లారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మంటపంలో అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భాస్కర్ రావు లడ్డూప్రసాదం, స్వామివారి శేష వస్త్రాలు అందజేసి నారసింహుడి ఫోటోను బహూకరించారు.

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రథమ స్థానంలో నిలవాలి

తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** ఇమాంపేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలవాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇమాంపేట కెజిబివిలో సువెన్ ఫార్మసి కంపెనీ సహకారంతో షెల్ఫ్,వాలిబాల్ కోర్టులను ప్రారంభించి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, నోటు పుస్తకాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్‌తో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులని వారు జీవితాల్లో ఉన్నత స్థాయిలో ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో మొదటి ర్యాంకు వచ్చిన వారికి నగదు బహుమతులను అందజేస్తామని ప్రకటించారు. మొదటి బహుమతికి రూ. 6వేలు, రెండవ బహుమతిగా రూ. 4వేలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఈఒ అశోక్, సువెన్ ఫార్మ ప్రతినిధులు రమేష్, మూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆర్‌డిఒకు అఖిలపక్షం, రైతు సంఘం నాయకుల వినతి

**ప్రజాపక్షం/కోదాడ:** ప్రస్తుతం యాసంగి సీజన్‌లో వరి పంట కోతలకు వస్తున్న సందర్భంగా వరి పండించిన రైతులు నష్టపోకుండా మద్దతు ధర వచ్చేలా చూడాలని అఖిలపక్ష రైతు సంఘం నాయకులు బొల్లు ప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్డీవో సూర్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోతలు సమీపిస్తున్నందున ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అదే విధంగా రైతులు, ధాన్యం కమిషన్ ఏజెంట్లు, రైస్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఏ ఒక్క రైతు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపో కుండా చూడాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో హెచ్‌ఎంటి, చింట్లు, వంటి సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధరతో పాటు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డా వెంకటయ్య, వక్కంతుల నర్సింహారావు, ఉదయగిరి, కొల్లు వెంకటేశ్వర్లురావు, మేదరమెట్ల వెంకటేశ్వర్లురావు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



# రబీ ధాన్యం సేకరణకు రెడీ

ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేయాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** 2024/ 25 రబీ ధాన్యం మార్కెట్ కు రానున్న నేపథ్యంలో రబీ ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పౌరసరఫరాలు, వ్యవసాయ అనుబంధ శాఖలు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణ, మద్దతు ధర పై దాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు ఉద్దేశించి శనివారం ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటు చేసిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ రబీలో వరి పంటకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రేడ్ ఏ రకానికి రూ. 2320లు, సాధారణ రకానికి రూ.2,300ల మద్దతు ధరను ప్రకటించాయని, అంతేకాకుండా సన్నధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాల్ కు రూ. 500లు బోనస్ ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం రబీలో జిల్లా వ్యాప్తంగా 2 లక్షల 5 వేల హెక్టార్లు సాగయ్యిందని, 12 లక్షల 14449 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం జిల్లాలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. మార్కెట్ కు 11 లక్షల 26021 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేయడం జరిగిందని, ఇందులో మిల్లర్లు 5,68,152 మెట్రిక్ టన్నులు ,సివిల్ సప్లైస్ కార్పోరేషన్ ద్వారా 5,57,869 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఖరీఫ్ లో 2 లక్షల 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ఇందులో 2,10,000 మెట్రిక్ టన్నులు దొడ్డు ధాన్యం, 74,3 టన్నులు సన్న ధాన్యాన్ని కొన్నట్లు తెలిపారు.కాగా గత రబీలో జిల్లాలో 3 లక్షల 7018 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రబీ లో వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకుగాను జిల్లావ్యాప్తంగా 375 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో 304 కేంద్రాలు దొడ్డు ధాన్యం కొనుగోలుకు, 71 కేంద్రాలు సన్నధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేస్తామని, మార్కెట్ కు వచ్చే ధాన్యం ఆధారంగా కొనుగోలు కేంద్రాలను పెంచడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.రబీ ధాన్యం కొనుగోలుకు కోటి 39 లక్షల 46,725 గన్ని బ్యాగులు అవసరం అవుతాయని కలెక్టర్ తెలిపారు.ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే రైతులు ,కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సంప్రదించేందుకుగాను గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని ,ఈ సెల్ లో ఏర్పాటుచేసిన 9963407064 నంబర్ కు వారి సమస్యలను తెలియజేయవచ్చని ఆమె వెల్లడించారు .రబీ ధాన్యం కొనుగోలు సందర్భంగా ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వద్దని, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన తూ.చా తప్పకుండా పాటించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, డిసిఓ పత్యనాయక్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి ఛాయాదేవి, ఆర్టీవో, లీగల్ మెట్రాలజీ అధికారులు తదితరులు వారి శాఖల ద్వారా నిర్వర్తించే విధులపై వివరించారు.అనంతరం రబీ ధాన్యం మద్దతు ధర, ధాన్యం సేకరణ పై రూపొందించిన గోడ పత్రికను, కరపత్రాలను విడుదల చేశారు.ఈ సమావేశానికి జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్ష ,కార్యదర్శులు, ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.



## ఎంఆర్‌పిఎస్ దీక్షకు సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఎస్‌సి వర్గీకరణే లక్ష్యంగా పోరాటం చేస్తున్న ఎంఆర్‌పిఎస్‌కు బిసి హక్కుల సాధన సమితి సంపూర్ణ మద్దతు ఉంటుందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. మంగళవారం మండలం కేంద్రంలో వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మహోత్తర పోరాటం కొనసాగుతుందని గుర్తు చేశారు. ఈ పోరాటం విజయాల అంచుకు చేరిందని, శాసన సభలో చర్చ చేసి బిల్లు ఆమోదం తెలుపుతూ కేంద్రానికి పంపడం అభినందనీయమని చెప్పారు. అలాగే బిసి వర్గీకరణ చేపట్టి 42శాతం అమలు చేస్తూ ప్రభుత్వం శాసన సభలో ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఇంజమూరి మల్లయ్య, మండల అధ్యక్షులు యడవెల్లి అరుణ్ మాదిగ, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య మాదిగ, నాయకులు వడ్లపూడి ఉపేందర్ మాదిగ, ఎల్ నాగార్జున, పట్టణ అధ్యక్షులు పున్నయ్య మాదిగ పాల్గొన్నారు.

## వేగవంతంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల ప్రక్రియ

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఇందిరమ్మ ఇండ్లకు సంబదించిన లబ్ధిదారుల నిర్మాణాల పనుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు, యమ్‌పిఓలతో ఇందిరమ్మ ఇండ్లు, త్రాగు నీరు, పన్ను వసూళ్లు, ఎల్ఆర్ ఎస్‌లపై అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి మండలాల వారిగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ ఎంపికైన ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి L1,L2,L3 జాబితాలోని కుటుంబ వివరాలను పరిశీలించాలన్నారు. అర్హులైన నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందించే విధంగా కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన వారందరూ గడువులోగా తమ ప్లాట్లు రేగులరైజ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 31లోపు ఎల్ఆర్ఎస్ రాయితీని దరఖాస్తుదారులు వినియోగించుకొని లబ్ధి పొందాలని తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రెవిన్యూ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. గ్రామాలలో ఎంపికైన ఇండ్లకు మార్కింగ్ ను వేగవంతం గా పూర్తి చేయాలని, ఎంపికైన గ్రామ పంచాయతి సెక్రెటరీలను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక త్వరగా పూర్తి చేయాలన్నారు. మిగిలిన అన్ని గ్రామాలలోని సంబంధించిన ఇండ్ల వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి నివేదిక సమర్పించాలని ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్లకు, మండల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభారాణి, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, డిఆర్‌డివో నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయసింగ్, హౌసింగ్ ఈఈలు టి. నాగేశ్వర రావు, ఎం.శ్రీ రాములు పాల్గొన్నారు.





## రైతుల పంటకు మద్దతు ధర

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చంద్రశేఖర్ డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తీసుకవచ్చిన నూతన వ్యవసాయ మార్కెట్ విధానంను విరమించుకోవాలన్నారు. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ. 500బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఖరీఫ్‌లో రైతులకు పూర్తి స్థాయిలో నేటికి ఇవ్వలేదన్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో మలు కాలేదని, రైతు భరోసా నేటికి అందలేదన్నారు. ఎస్ఆర్ఎస్‌పి కాల్వల ద్వారా విడతల వారిగా పంట సాగుకు నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం నీరు అందించకపోవడంతో చేతికి వచ్చిన వరిపంట ఎండిపోయి రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ. 30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమితి సభ్యురాలు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను చెల్లించని దుకాణాలు సీజ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాల గూడ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని దుకాణాలను అధికారులు, సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య మంగళవారం సీజ్ చేశారు. పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద బి.సైదానాయక్ దుకాణాదారుడు సుమారు రూ.2.90లక్షలను రెండు సంవ త్సరాలుగా బకాయి ఉండగా రెడ్ నోటీసును పది రోజుల క్రితం ఇవ్వగా చెల్లించకపో వడంతో తాళాలు వేసేందుకు యత్నించగా వాగ్వాదానికి దిగారు. చెల్లించకపోవడంతో సీజ్ చేశారు. అదేవిధంగా సాగర్‌రోడ్డులోని టాప్ షాప్ యజమాని రెండు సంవత్సరాలుగా రూ.2,29,860 బకాయి ఉండగా సీజ్ చేశారు. అదేవిధంగా హౌసింగ్‌బోర్డు కాలనీలోని దుకాణ సముదాయంలో ఆరు దుకాణాలు రూ.6,60,465 బకాయి ఉండగా సీజ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్, ఆర్ఐ జ్ఞానేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

## రబీ యాసంగి పంట కొనుగోలుకు ముందస్తు ప్రణాళిక



యాదాద్రి రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**ప్రజాపక్షం/యాదాద్రి :** రబి (యాసంగి) సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారులు, హార్వెస్టింగ్ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో రబి 2024/25 (యాసంగి ) సీజన్‌లో సుమారు 4.50 లక్షల మెట్రిక్ ధాన్యం రానున్నందున, పంట పొలాల వద్ద దశలవారీగా నియంత్రణకు సంబంధిత అధికారులందరూ ముందస్తు చర్యలు చేపట్టాలని, జిల్లాలోని మార్కెట్ యార్డులలో స్థలం ఉన్నందున మరియు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం పోయడానికి తక్కువ స్థలం ఉండడం వలన కోతలను దశలవారీగా చేపడితే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం దశలవారీగా వచ్చే అవకాశం ఉందని తెలిపారు. దానికిగాను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హార్వెస్టర్ యాజమాన్యాలపై కొంత మేరకు నియంత్రణ ఉండాలన్నారు. హార్వెస్టర్ మిషిన్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 18 25 ఆర్.పి.ఎం వద్ద నడిస్తే మరియు బెల్టును టైట్ చేసి సరియైన గేర్‌లో నడిపితే కొంతమేరకు తాలును నివారించవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఏఈవోలు, ఏవోలు వరి కోతలను నియంత్రించాలని కోరారు. క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగా ఏ పంట ఎన్ని రోజులకు కోత దశకు వస్తుందో వ్యవసాయ శాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నందున దానికి తగినట్లుగా కోతలను నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, జిల్లా రవాణా అధికారి సాయి కృష్ణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత, జిల్లా సహకార అధికారి శ్రీధర్ , జిల్లా మార్కెటింగ్ అధికారి సబిత, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## మండలిలో ఉపాధ్యాయుల గొంతుకను అవుతా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి





**ప్రజాపక్షం/కోదాడ:** హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణలో తాను ముందుంటానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. శాసన మండలిలో ఉపాధ్యాయుల గొంతుకనై సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారనని చెప్పారు. పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో గత మూడు రోజులుగా సాగుతున్న విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా, సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల డిఎలు, పిఆర్‌సి సర్వీస్ రూల్స్, హెల్త్ కార్డులు సాధించే బాధ్యత తనదేనన్నారు. హక్కుల సాధన కోసం అవసరమైతే ఉద్యమ కార్యచరణ నిర్వహిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం క్రీడల నిర్వహణకు పిఆర్‌టియు నుండి రూ.లక్ష అందిస్తామని ప్రకటించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గోదాడ యూనిట్ అధ్యక్షులు వేనేపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర మహిళ ఉద్యోగుల చైర్మన్ ఉమా, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, బొల్లం రాంబాబు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జితేందర్ రెడ్డి, నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరబాబుబ్రమరాంభ పాల్గొన్నారు.

## జోగులాంబ ఆలయ అభివృద్ధిపై సమీక్ష

**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రఖ్యాత జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ అజయ్ కల్లం సమీక్ష నిర్వహించారు. మంగళవారం ప్రజా భవన్ లో జరిగిన ఈ భేటిలో జోగులాంబ ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన ప్రణాళిక పై చిన్నారెడ్డి, అజయ్ కల్లం చర్చించారు. గతంలో మహబూబ్ నగర్ కలెక్టర్ గా విధులు నిర్వహించిన సందర్భంగా అజయ్ కల్లం జోగులాంబ ఆలయాన్ని వెలుగులోకి తీసుకుని వచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. జోగులాంబ ఆలయ అభివృద్ధిలో ఉన్న అనుభవాన్ని అజయ్ కల్లం పంచుకున్నారు. జోగులాంబ ఆలయ అభివృద్ధి కోసం దేవాధాయ, ధర్మాధాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ సహా ఆలయ కమిటీతో ఇప్పటికే రెండు సార్లు సమీక్షా సమావేశాన్ని నిర్వహించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. వచ్చే 20వ తేదీన మరోమారు సమావేశాన్ని నిర్వహించి జోగులాంబ ఆలయ అభివృద్ధి పనుల పై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు చిన్నారెడ్డి వివరించారు. సత్వరమే చేపట్టాల్సిన పనుల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈ బేటీలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాఘవ రెడ్డి, రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీడ్స్ గ్రోవర్ సంఘం అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కేశవులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు పార్టీలు సహకరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఓటరు జాబితా ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా మార్పులు చేర్పులకు రాజకీయ పార్టీలు సహకరించాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయా రాజకీయా పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరు నూతనంగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, అదేవిధంగా అభ్యంతరాలు, ఓటరు చిరునామా మార్పు, బదిలీలు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం నిరంతరం కల్పించిందన్నారు. ఎన్నికల ప్రక్రియకే కాకుండా ఓటరు జాబితా తయారీ, ప్రక్షాళనలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, సురేష్, పుష్పలత, ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, జేఏ ఫణి, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరు బాలు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, గంధం రామకృష్ణ, పందిరి అనిత, పాతూరి శరత్, రవినాయక్, వెంకటేశ్వర్లు, శ్రీనునాయక్, సత్యప్రకాశ్, సయ్యద్‌ఫారుఖ్, దినేష్‌లు పాల్గొన్నారు.

## ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట(పెన్‌పహాడ్):** సాగునీరు లేక ఎండిపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలంలోని దుబ్బతండ, మేగ్యతండ గ్రామాల్లో ఎస్ఆర్ఎస్‌పి కాల్వ కింద సాగు చేసిన వరి పంటలు ఎండిపోవడంతో ఆయన పరిశీలించారు. రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ కరువు కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిందేనని అన్నారు. తమది రైతు ప్రభుత్వమని చెబితే మోసపూరిత హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ ఇవ్వలేదన్నారు. రైతు భరోసా కూడా నేటికి కొంత మంది రైతులకే ఇచ్చిందన్నారు. ఇదే విషయాన్ని తాను రైతు పక్షాన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదిస్తే సమావేశాల నుండి తనను సస్పెండ్ చేశారన్నారు. తాను సస్పెండ్ చేసినంత మాత్రాన రైతులపక్షాన తన పోరాటం ఆగదన్నారు. ప్రజా గొంతుకనై ప్రజా సమస్యలపై పోరాడుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిపి నెమ్మాది భిక్షం, సూర్యాపేట మాజీ జెడ్‌పిటిసి జీడి భిక్షం, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్, పిఎపిఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, నాయకులు తూముల ఇంద్రసేనారావు, మిర్యాల వెంకటేశ్వర్లు, బిట్టు నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.



## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

ప్రజాపక్షం/నేలకొండపల్లి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ను మంగళవారం ఖమ్మం ఆర్డీవో నరసింహారావు తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. వివిధ అంశాల పై అధికారులకు, సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఎల్ఆర్ఎస్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుద్ధారం లోని ఓ రైతు ఫిర్యాదు మేరకు భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహశీల్దార్ జె.మాణిక్యారావు, డిప్యూటీ తహశీల్దార్ ఇమ్రాన్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్ రావు, సర్వేయర్ మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరిస్తా..

### టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



ప్రజాపక్షం/ మధిర : గురుకులాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణాపురం గురకుల పాఠశాల( ఎంజిపి), బోనకల్, ముదిగొండ గురకుల పాఠశాలల(ఎస్‌డబ్ల్యుఆర్ఎస్)ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీగా తన గెలుపులో గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల ఆదరణ మరువలేనిదని అన్నారు.గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం గురుకుల ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సన్మానించారు. పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, మోత్కూరి మధు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి, పుట్లూరి వెంకటేశ్వరరెడ్డి, డి.వెంకటేశ్వరరావు, మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్ అసోసియేట్ అధ్యక్షులు ఎండి.జమీర్, గౌరవాధ్యక్షులు పిల్లి నర్సింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి పరామర్శ



ప్రజాపక్షం/ మధిర : మధిర మున్సిపాల్టీ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పలువురు ముఖ్య నాయకులను మంగళవారం బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు పరామర్శించారు. సిపిఎం పార్టీ నాయకులు, మాజీ కౌన్సిలర్ కట్టా గాంధీ ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారికి ఇంటి వెళ్లి పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు కపిలవాయి జగన్మోహన్‌రావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కమల్‌రాజు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం 21వ వార్డు నందు యార్లగడ్డ రమేష్ అస్వస్థతకు గురికాగా ఆయనను కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకుని పరామర్శించారు. బిఆర్ఎస్ టౌన్ సెక్రటరీ అరిగె శ్రీనివాసరావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ యన్నంశెట్టి అప్పారావు, కటికల సత్యనారాయణరెడ్డి, సయ్యద్ ఇక్బాల్, వంకాయపాటి నాగేశ్వరరావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/జూలూరుపాడు:కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాజీవ్ యువ వికాసాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దొండపాటి శ్రీనివాసరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం కింద క్యాటగిరీ1 కింద రూ. లక్ష వరకు రుణం అందించి 80 శాతం రాయితీ ఇస్తుందన్నారు. క్యాటగిరీ 2 కింద రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు రుణాలను మంజూరు చేసి 70 శాతం రాయితీ కల్పిస్తుంది అని వివరించారు. క్యాటగిరీ 3 కింద రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షల లోపు రుణాలను అందజేసి 60 శాతం రాయితీ ఇవ్వనుందన్నారు. లోన్ తీసుకుని ఉపాధి పొందుతూ వ్యాపార రంగంలో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతూ ఉండాలని అన్నారు.

## నేడు మేకల సంగయ్య వర్ధంతి

ప్రజాపక్షం/ఖమ్మం : సిపిఐ సీనియర్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల సంగయ్య తొమ్మిదవ వర్ధంతి సభ బుధవారం సిపిఐ కార్యాలయంలో జరుగుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. గిరిప్రసాద్ భవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే వర్ధంతి సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

## వ్యవసాయ మార్కెట్ యార్డ్ పరిశీలన

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : ఎర్రుపాలెం వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డును మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మంగళవారం పరిశీలించారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ కె.చంద్రశేఖర్‌ను యార్డులో నిల్వలు, గోడౌన్ సామర్ధ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న రైతులు యార్డ్‌లో సరైన ప్లాట్‌ఫామ్స్ లేవని, వే మెంట్ కాటా పనిచేయటం లేదని పలు సమస్యలు తెలిపారు.డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కదృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సూపర్వైజర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భట్టి పద్దు సానుకూలమేనా?




ప్రజాపక్షం/ఖమ్మం : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. ఆర్థికశాఖమంత్రిగా జిల్లా నుండి అరుదైన గౌరవం పొందిన భట్టి తన పద్దును జిల్లాకు సానుకూలంగా మలుస్తారన్న ఆశ ఉమ్మడి జిల్లా ప్రజల్లో ఉంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు చెందిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో భారీగా నిధులు కేటాయించి పూర్తయ్యేందుకు భట్టి పద్దు సహకరిస్తుందన్న ఆశతో రైతాంగం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి కావడానికి సరిపడ నిధులను కేటాయించాలని కోరుతున్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పంట కాలువల భూ సేకరణ జరగలేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ తవ్వకానికి నిధులు కేటాయించాల్సి ఉంది. సీతారామ పూర్తి చేయడానికి పెరిగిన అంచనాల నేపథ్యంలో భారీ మొత్తంలోనే నిధులు కేటాయించాల్సి ఉంది. దీనితో పాటే సుమారు 70 టిఎంసిలు నిల్వ చేయగలిగే సీతమ్మ సాగర్‌ను కూడా పూర్తి చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది. ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు మన రాష్ట్ర వాటాగా నిధులు కేటాయించాల్సి ఉంది. గతంలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రాచలం రామాలయంకు సంబంధించి భారీగానే నిధులు కేటాయిస్తామని చేసిన ప్రకటనకు అనుగుణంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్నాయి. చాలా చోట్ల నిధుల లేమితో ప్రాజెక్టులు నత్తనడకన నడిచేందుకు కారణమవుతున్నాయి. ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేసేందుకు చేపట్టిన సమీకృత విద్యా భవనాలను, హాస్టల్ భవనాలను పూర్తి చేయాల్సి ఉంది. అందుకు ఈ ఏడాది బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించాల్సి ఉంది. ఉమ్మడిజిల్లాలో కొత్తగా రెండు మున్సిపాలిటీలు ఏర్పాటయ్యాయి. వీటి అభివృద్ధి కోసం నిధులు కేటాయించాల్సి ఉంది. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం జీవోలను విడుదల చేసింది. జీవోలకు అనుగుణంగా నిధులు కేటాయించాల్సి ఉంది. ఇదే సమయంలో జిల్లా వ్యాప్తంగా అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధుల కేటాయింపు జరపడంతో పాటు ఖమ్మంకు రింగ్ రోడ్డు ఏర్పాటు ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉన్నది. ఈ రింగురోడ్డుకు సంబంధించి నిధులు కేటాయించాల్సి ఉంది. వ్యవసాయరంగ అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపుజరగాల్సిఉంది. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలుపుతూ కార్పోరేషన్‌గా ఏర్పాటు చేశారు. కార్పోరేషన్ ఏర్పాటుతోపాటు కార్పోరేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించాల్సి ఉంది. సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. మొత్తంగా భట్టి పద్దులో ఖమ్మంజిల్లాకు సానుకూలత రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## ప్రైవేటుకు దీటుగా బోధన

ప్రజాపక్షం/నేలకొండపల్లి: కార్పోరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో బోధన జరుగుతుందని అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి (ఏయంవో) రవికుమార్ పేర్కోన్నారు. మండలం లోని అమ్మగూడెం ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్య కోసం అనేక మార్పులు చేస్తుందని అన్నారు. అరిఫిషియల్ విద్య తో మరింత మెరుగైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వెంగళ రావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణారావు, మాజీ సర్పంచ్ గండు సతీష్, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.గోవిందరావు, మారగాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాల నిర్వహణలో భద్రాద్రి ఆదర్శం

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా



ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజాదరణ మెండుగా ఉందని, ప్రజల పక్షాన నిలిచే పార్టీలనే జనం ఆదరిస్తారని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. జగ్దల్‌పూర్‌లోని సమావేశాన్ని ముగించుకుని కొత్తగూడెం మీదుగా విజయవాడ వెళుతున్న క్రమంలో ఆయన సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌ను సందర్శించి జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషాతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా రాజకీయ పరిస్థితులను అగితెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ నిర్వహించే ప్రజాపోరాటాలకు రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లా ఆదర్శంగా ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎందరో జాతీయ నాయకులను కమ్యూనిస్టు పార్టీకి అందించిందని, ప్రజాప్రతినిధులుగా ప్రజా గొంతుకను వినిపించే నేతలను చట్టసభకు పంపించిందన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు జిల్లాలో పార్టీ విస్తరణకు, ప్రజాప్రతినిధిగా, ప్రజా సమస్యల పరిష్కారంకోసం నిత్యం శ్రమిస్తుండటం హర్షణీయన్నారు. జిల్లాలో ఉన్న పోడుభూముల సమస్యలపై, పేదలకు నివాస స్థలాల కోసం, కార్మిక, రైతాంగ సమస్యలపై భద్రాద్రి జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ బలమైన ఉద్యమాలు నిర్వహించిందన్నారు. సకాలంలో 2025 సభ్యత్వాన్ని పూర్తి చేసి రాష్ట్ర, కేంద్రానికి అందజేయడం పట్ల జిల్లా నాయకత్వాన్ని అభినందించారు. సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతవసంతోత్సవాలు జరుగుతున్నాయని, ఈ డిసెంబర్ 26వ తేది వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని చెప్పారు. జాతీయ,రాష్ట్రాల స్థాయిలో భారీ బహిరంగ సభలు నిర్వహస్తామని చెప్పారు. ఆయన వెంట సిపిఐ జాతీయ నాయకులు రామకృష్ణ పాండే, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తదితరులున్నారు.



# అక్రమార్కులపై పోలీసుల కన్ను

### ఆక్రమణదారులపై కేసులు

ప్రజాపక్షం/ఖమ్మం : రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసాలకు పాల్పడుతున్న వారిపై ఖమ్మం పోలీసులు దృష్టిసారించారు. ఖమ్మం రూరల్ మండలంలో రెండు రోజుల క్రితం కేసులు నమోదు చేసిన పోలీసులు ఖమ్మంలో ఆక్రమణలకు పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో డబుల్ రిజిస్ట్రేషన్లు, ఇతరులు కొనుగోలు చేసిన నివాస స్థలాలకు సంబంధించి డ్యూప్లికేట్ పత్రాలు సృష్టించి ఆక్రమించడం లేదా బలవంతపు ఆక్రమణలతో అసలు హక్కుదారులను భయపెడుతున్నారు. ఈ దశలో ఖమ్మం పోలీసులు ముగ్గురు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై మంగళవారం కేసు నమోదు చేశారు. సిపి సునీల్ దత్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం అర్బన్ మండలం అగ్రహారం ప్రాంతంలోని సర్వే నెం.42ఈ, 42ఈఈలో తమకు సంబంధం లేని పలు ప్లాట్లపై ముగ్గురు రియల్ వ్యాపారులు తప్పుడు ధృవపత్రాలు సృష్టించి విక్రయించారు. ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటకు చెందిన మానుకొండ శ్రీనివాస్, ఖమ్మం నగరానికి చెందిన రాజగిరి, శ్రీనివాస్ నగర్‌కు చెందిన రవిలపై కేసు నమోదు చేశారు. లక్షల రూపాయలు తీసుకుని మోసం చేసినట్లు పోలీస్ దర్యాప్తులో వెల్లడైంది. వినుకొండ మరియన్న ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సిపి తెలిపారు. ముఖ్యంగా భూములు, ప్లాట్ల కొనుగోలు చేసే ముందు సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయి లేనివి క్షేత్ర స్థాయిలో పరిశీలించుకోవాలని సిపి సూచించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ యజమానులు ప్లాట్ల అభివృద్ధి పేరుతో ఫైనాన్సర్ల నుండి రుణం పొంది రిజిస్ట్రేషన్ చేసి మరల అవే ప్లాట్లను ఇతరులకు మోసం చేసి విక్రయిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యాపారుల పట్ల కొనుగోలు దారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## ప్రైవేట్ చిట్ కేసులో ఏడేళ్ల జైలుశిక్ష

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :ప్రైవేట్ చిట్ కేసులో నిందితునికి ఏడేళ్ల జైలుశిక్ష, లక్షన్నర జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయ అధికారి జి.రాజగోపాల్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఫిర్యాదుదారుడైన కె.ఉపేందర్ నిందితుడైన బానోత్ వీరన్న ప్రైవేటు చిట్టి ఏర్పాటు చేయగా 30 నెలల కాలానికి నెలకు రూ. 10వేల చొప్పున 29నెలలు చెల్లించాడు. ఉపేందర్‌తో పాటు మరో 139మంది ఈ చిట్‌లో ఉన్నారు. వాటి బాపతు రూ. 86,87,832 లను చెల్లించారు. ఉపేందర్‌కు మాత్రం డబ్బులు చెల్లించకుండా రేపు మాపు అంటూతిప్పుతున్నారని2017నవంబర్ 17న రఘునాథపాలెం పోలీసులకు ఉపేందర్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారించిన న్యాయమూర్తి నేరం రుజువైనందున శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున శంకర్ వాదించగా లైజన్ అధికారిగా కె. శ్రీకాంత్, హోంగార్డు ఎస్‌డి యూసఫ్ సహకరించారు.

### ఫైలింగ్ సర్వీసెస్ సమస్యలు పరిష్కరించండి

### రిజిస్ట్రార్‌కు వినతి

ఈ ఫైలింగ్ సర్వీసెస్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రిజిస్ట్రార్ ఆఫ్ ఐటి కం సెంట్రల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.ప్రవీణ్‌కుమార్‌కు మంగళవారం సీనియర్ న్యాయవాది తాళ్లూరి దిలీప్ వినతిపత్రం అందజేశారు.సివిల్‌కేసు నెంబర్ అయిన తర్వాత స్కాన్ చేయడం వల్ల న్యాయవాదులకు సులువుగా ఉంటుందని, సవరణలు చేయాలని కోరారు. ఈ ఫైలింగ్‌కు సంబంధించి న్యాయవాదులకు అవగాహన తరగతులు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

## వయోపరిమితి పెంపు ఘనత 'ఎఐటియుసి'దే



ప్రజాపక్షం/ఇల్లందు: కారుణ్య ఉద్యోగాల నియామకాలకు వయోపరిమితి పెంపు ఘనత ఏఐటీయూసీదే అని డిప్యూటి ప్రధాన కార్యదర్శి, శాఖ కార్యదర్శులు కె.సారయ్య, ఎం.డి.నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఏరియా వర్క్‌షాప్, సీహెచ్‌పి, స్టోర్ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్తంగా మంగళవారం ఏర్పాటు చేసిన గేట్ సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సొంతింటి కల రూ.10లక్షల వడ్డీ లేని రుణాల కోసం యాజమాన్యంతో చర్చిండటం జరిగిందని, సింగరేణిలో నూతనగనులు ఏర్పాటు చేయడం ఎంతో అవసరమని యాజమాన్యంతో మాట్లాడినట్లు తెలిపారు. కారుణ్య ఉద్యోగాల వయోపరిమితి 40సంవత్సరాల వయసుకు పెంచడం జరిగిందన్నారు. టెక్నీషియన్లకు, గనుల సూపర్‌వైజర్లకు సర్ఫేస్‌లో సరయ్యే ఉద్యోగాలివ్వడం, గతంలో గనుల ధృవీకరణపత్రం ఆలస్యం కావడంతో ఉద్యోగాలు కోల్పోయిన జేఎంఈటీలకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించిన ఘనతకూడా ఏఐటీయూసీదే అని అన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రూ.20లక్షలు వడ్డీ లేని రుణాలు, ఇంటిస్థలం, పెర్క్స్ మీద ఆదాయపుపన్ను రీయంబర్స్‌మెంట్, టెక్నీషియన్లకు సహాయకులను ఇవ్వడానికై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. మెడికల్ కళాశాలల్లో కార్మికుల పిల్లలకు ప్రత్యేక కోటా, పదవీవిరమణ చేసిన కార్మికులకు, వివిధ ఏరియాలల్లో పనిచేస్తూ ఓ చోట ఇల్లు ఉన్న కార్మికులకు కూడా ఏరియా వారికి ఆ ఏరియాల్లోనే మందులు పంపిణీ చేసేలా యాజమాన్యంతో చర్చించామన్నారు. యూనియన్ చేసే పోరాటాలకు భవిష్యత్తులో కూడా ఇదే సహకారాలు కార్మికులు అందించి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉపాధ్యక్షులు దాసరి రాజారాం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరిమి సుందర్, వర్క్‌షాపు పిట్ సహాయ కార్యదర్శులు జక్కుల శ్రీనివాస్, రంజిత్ కుమార్, వెంకటరెడ్డి, శ్రీనివాస్, హేమంత్ కుమార్, నరేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లు వేగవంతం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :ఆస్తి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. మంగళవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లపై ఆర్‌వో, ఆర్ఐలతో కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు వస్తున్న దృష్ట్యా పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా కమర్షియల్ బకాయిలపై అధిక దృష్టి పెట్టాలని వంద శాతం వసూళ్లు అయ్యేలా దృష్టి సారించాలన్నారు. అవసరమైతే బకాయిలు ఉన్న ఆస్తులను సీజ్ చేయాలన్నారు. ప్రతి బిల్ కలెక్టర్ ఉదయం ఏడు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు తమ డివిజన్లలో పన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. కమర్షియల్ ఏరియాల్లో రాత్రిపూట కలెక్షన్ నిర్వహించాలన్నారు. ఉదయం, సాయంత్రం నివాస ప్రాంగణాల్లో పన్నులు వసూలు చేయాలని, ఉద్యోగస్తులు ఇంట్లో ఉండే సమయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు వస్తే ఆర్‌వో, లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి మిగిలిన వసూళ్ల లక్ష్యాన్ని కూడా సాధించాలని కమిషనర్ సూచించారు.



## గిరిజనులతో మమేకం కావాలి

ప్రజాపక్షం/అశ్వారావుపేట : మారుమూల ప్రాంత కొండ కోనల్లో నివసించే ఆదివాసి గిరిజనులకు సేవ చేసుకునే అవకాశం అధికారులకు దక్కిందని, అటువంటి అధికారులు గిరిజనుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తప్పనిసరిగా పరిష్కరిస్తే జీవితాంతం గిరిజనులు మిమ్మల్ని దేవుళ్లుగా భావిస్తారని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ అన్నారు. మంగళవారం కావడిగుండ్ల, గాండ్లగూడెం, కొండరెడ్ల గ్రామాల్లో సభల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కొండ కోనల్లో నివసించే గిరిజనులకు అడవులపై పూర్తి ఆధిపత్యం ఉందని, అటవీ ఫలాలతో మొదలుకుని ప్రతి అంశంలో వారికి హక్కు ఉంటుందన్నారు. కొండరెడ్ల గిరిజనులు నివసించే ఆవాసాల్లో తప్పనిసరిగా రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా గిరిజనుల సాగు చేసుకునే పొలాల పోడు పట్టాలు విషయంలో ఏ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్, జివిఆర్ ట్రస్టు చైర్మన్ జలగం ప్రసాదరావు, ఎఫ్‌డిఓ దామోదర్‌రెడ్డి, ఎస్సీ ఎన్పీడిసిఎల్ మహేందర్ తదితరులున్నారు.

## రైతుబంధు కింద రైతులకు రుణాలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతుబంధు పథకం క్రింద ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో రైతులకు రుణాలు అందిస్తున్నట్లు ఖమ్మం ఎఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. రైతుబంధు పథకానికి సంబంధించి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ప్రభుత్వంరూ.ఐదు కోట్లు కేటాయించిందని ఆయన తెలిపారు. మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రైతుబంధు పథకం కింద ఐదుగురు రైతులకు మంజూరైన రూ. 10 లక్షల రుణాన్ని చైర్మన్ యరగర్ల హన్మంతరావు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేని సమయంలో నిల్వ చేసిన పంటలపై ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా రుణాన్ని అందజేస్తుందని తెలిపారు. మిర్చి పంటకు సంబంధించి రైతులు గోడౌన్‌లో, కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకుంటే వాటికి సంబంధించి ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే సంబంధిత రైతులకు నిల్వ చేసిన పంటకు సంబంధించి 75 శాతం రుణాన్ని, రెండు లక్షల లోపు అందిస్తామన్నారు.ప్రస్తుతం మార్కెట్‌లో మిర్చికి ఆశించిన ధర లేదని రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకుంటే రైతు బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చునని తెలిపారు. రైతులు వంగవీటి భద్రయ్య, వంగవీటి మణిశంకర్, పంది శ్రీను, పంది సత్యావతి, పంది నారాయణ తదితరులు 100 బస్తాల చొప్పున మిర్చిని నిల్వ చేసుకున్నారని వారికి ఒక్కొక్కరికి రెండు లక్షల చొప్పున అందించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లతీఫ్, బోజడ్ల సత్యనారాయణ, వనిగళ్ల బాబురావు, బానోత్ రమేష్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు వినతి

### బస్తాకు సుమారు రూ.1,520 చెల్లిస్తున్నట్లు రైతాంగం వెల్లడి




ప్రజాపక్షం/సత్తుపల్లి: ఆరుగాలం కష్టించి పంట పండించిన రైతన్న ఎదురు చూసిన రోజు రానే వచ్చింది. తను పడ్డ శ్రమకు ఫలితం దక్కుతుందని, ఈసారైనా అప్పులు తీరిపోతాయని, కలలు కన్న రైతన్నకు కలలు నిజమవుతాయో లేక కలలుగానే మిగులుతాయో చూడాలంటే మరి కొద్ది రోజులు వేచి చూడాల్సిందే మరి. ఇప్పటికే సత్తుపల్లి నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభం కాగా, సత్తుపల్లి మండలంలో సుమారు 250 ఎకరాలలో, కల్లూరు మండలంలో 230 ఎకరాలలో వరి కోతలు జరిగినట్లు ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పెనుబల్లి, వేంసూరు, తల్లాడ మండలాలలో సైతం త్వరలోనే వరి కోతల ప్రారంభమవ్వనున్నట్లు రైతులు తెలుపుతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి మద్దతు ధరకు అమ్ముకుంటే తమకు ఓ రూపాయి గిట్టుబాటు అవుతుందని అనుకునే లోపే దళారి రంగ ప్రవేశం చేసి రైతన్న నడ్డివిరుస్తున్నారు. నాడు పంటకు సాయం చేసిన దళారులు, నేడు ఆరుగాలం కష్టించి పండించిన పంటను పావలా, అర్ధకు కొనుగోలు చేస్తుంటే మారుమాట చెప్పలేని రైతన్న మౌనంగా కూర్చుండి పోతున్నాడు. వరి కోతలు జరుగుతుండటంతో దళారులు రంగ ప్రవేశం చేసి బస్తాకు రూ.1,520 ధర నిర్ణయిస్తూ రైతుల నెత్తిన కుచ్చుటోప్పి పెడుతున్నట్లు తెలుస్తుంది. తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, మద్దతు ధర కేటాయించి ఆదుకోవాలని ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లాలో 18 ఏళ్లు నిండిన అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా ఓటు హక్కు కల్పించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓటరు జాబితా సవరణపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటరు జాబితా చాలా కీలకమని సరైన ఓటరు జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. ఓటరు జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవిఎం యంత్రాలు, బ్యాలెట్ పేపర్లు ఎన్నికల వ్యవస్థకు కీలకమని తెలిపారు. జిల్లాలో ఫారం 6 క్రింద 4,734 దరఖాస్తులు రాగా 3,267 నూతన ఓటర్లను నమోదు చేశామని, 943 దరఖాస్తులు తిరస్కరించామని 550 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫారం 7 క్రింద 3,352 దరఖాస్తులు రాగా 2,450 పరిష్కరించామని, 411 దరఖాస్తులను తిరస్కరించామని, 491 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం 8 క్రింద 11, 820 దరఖాస్తులు రాగా, 9,573 పరిష్కరించామని, 1320 తిరస్కరించామని, 927 పెండింగ్‌లోఉన్నాయనితెలిపారు. జిల్లాలో ఉన్న 1,459 పోలింగ్ కేంద్రాలకు గాను ఈవిఎం గోడౌన్‌లో 5,824 బ్యాలెట్ యూ నిట్లు, 2,202 కంట్రోల్ యూనిట్లు, 2, 218 వివిప్యాట్లు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థుల వ్యయ వివరాలు నమోదు చేయలేదన్నారు.కలెక్టరేట్ ఎన్నికలవిభాగ పర్యవేక్షకులు సిహెచ్ స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ విసిని సస్పెండ్ చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాకతీయ విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను సస్పెండ్ చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జార్జ్‌రెడ్డి పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మందాసురేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడారు.ఉమ్మడి వరంగల్,ఆదిలాబాద్,ఖమ్మం పరిధిలో ఉన్న వివిధ డిగ్రీల మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫలితాలు విడుదల కాగా యూనివర్సిటీ పరిధిలో పలు కళాశాలల ఫలితాలు నిలిపివేశారన్నారు. కాకతీయ పరిధిలోని 303 డిగ్రీ కళాశాలలు ఉన్నాయని,బకాయి చెల్లించని 117 కళాశాల విద్యార్థుల సెమిస్టర్ ఫలితాలు నిలిపేశారన్నారు. ఏఐఎస్ఎఫ్‌జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ, జార్జ్‌రెడ్డి పిడిఎస్‌యు, జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, ఇందు, వర్ష, టిబి విలాషా పాల్గొన్నారు.

## సిపిని కలిసిన బల్దియా కమిషనర్, ఎసిబి అధికారులు



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఇటీవల వరంగల్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్‌ను జడబ్ల్యూఎంసి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.




**వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనర్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా ఏసీబీ అధికారులు డిఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాజు, ఎల్.రాజు మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు పోలీస్ కమిషనర్ పలు విషయాలపై ఎసిబి అధికారులతో ముచ్చటించారు.

## గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడు మృతి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట డివిజన్‌లోని ఖానాపురం మండల ఓ ప్రముఖక పత్రికలో సీనియర్ జర్నలిస్టు చలిగంటి కొమురయ్య (48) మంగళవారం ఉదయం గుండెపోటుతో నర్సంపేట పట్టణంలోని కొమురయ్య నివాసం వద్ద ఆయన భౌతిక కాయానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి, రాయిడి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్, గోనె యువరాజు, బిజెపి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, నర్సంపేటమండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, ఖానాపురం మండల పార్టీ అధ్యక్షులు రాధారపు అశోక్, బీజేవైఎం నియోజకవర్గ నాయకులు జూలూరి మనీష్ గౌడ్, జిల్లా ఎస్టి మోర్చా నాయకులు బానోత్ రమేష్ నాయక్, మహిళ మోర్చా జిల్లా నాయకులు సూత్రపు సరితలు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొమురయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు సంతోషదాయకం

సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి రాములు



**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా శాసనసభలో బిసి 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ విద్య ఉద్యోగ అవకాశాల్లో ఒక బిల్లు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచుతూ మరో బిల్లును ప్రవేశపెట్టిన సిఎం రేవంత్ రెడ్డి, బిసి సంక్షే మ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి రాములు సిపిఐ పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తు అలాగే ప్రైవేటు రంగంలో ఉద్యోగాలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించే అంశాన్ని ప్ర భుత్వం పరిశీలించాలని ఆయన కోరారు. తెలంగాణ ప్రభుత్వమే కుల గణ న సర్వే చేసిందని సర్వే వివరాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం సంతోషకరమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం తెలంగాణ చరిత్రలోనే నూతన అధ్యాయానికి నాంది పలకనుందని పేర్కొన్నారు.

## విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా



**ప్రజాపక్షం/పరకాల :** విద్యుత్ఘాతంతో ఇల్లు దగ్ధమైన ఘటన హనుమకొండ జిల్లా పరకాల మండలం కామారెడ్డి పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. విషయం తెలిసిన పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి బాధితులు రేణుకుంట్ల కుమారస్వామి(ధర్మ),సమ్మయ్య కుటుంబాలను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు,నిత్యావసర వస్తువులు, వంటసామాగ్రి, 5 క్వింటాళ్ల బియ్యం,రూ.1 లక్ష నగదు కాలి బూడిద అయినట్లు బాధితులు మాజీ ఎమ్మెల్యే తెలుపుతూ వాపోయారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ...బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. పరకాల తహసీల్దార్ కు ఫోన్లో మాజీ ఎమ్మెల్యే మాట్లాడాతూ ఘటన స్థలాన్ని సందర్శించి ఇరుకుటుంబాలకు తక్షణమే బియ్యం, నిత్యావసర సరుకులు అందేలా చూడాలని కోరారు.భాదితులకు ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం అందివ్వాలని,ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. మండల, గ్రామ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ కళాశాల ఏర్పాటు కోసం ముఖ్యమంత్రికి లేఖ

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):** భద్రాచలం కేంద్రంగా న్యాయ కళాశాల ఏర్పాటు చేసే దిశగా ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నట్లు గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మంగళవారం పత్రిక ముఖంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలం కేంద్రంగా ఆదిమ జాతుల కోసం న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంత చట్టాలు, జీవోలు ప్రతి ఆదివాసీ యువకులు తెలుసుకోవాలంటే ఖచ్చితంగా లా చేయాల్సిన అవసరం ఉందని, మన ప్రాంత చట్టాల కోసం ప్రభుత్వాలతో కొట్లాడి మన రిజర్వేషన్లు పొందే దిశగా ముందుకు పోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ బిడ్డలను విద్యకు దూరం చేస్తూ మన చట్టాలను జీవోలను మనకు తెలియనివ్వకుండా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే త్వరలో హైదరాబాద్ కేంద్ర ఇందిరాపార్క్‌లో భారీయెత్తున ధర్నా చేపడతామని, ఈ ధర్నాకు ఆదివాసీ ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, యువత మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.

# ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ల్యాండ్ రెగ్యులరేషన్ స్కీమును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్స్‌తో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సుదీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న ఎల్ఎర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ఈ నెలాఖరు వరకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం కల్పించిందని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్ లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్ వంటి పలు వెసులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. ఒక లే అవుట్ లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉంటే, మిగిలిపోయిన 90 శాతం ప్లాట్లకు ఎల్అర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ కు అవకాశం కల్పించారని, అలాంటి వారికి కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎస్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని అన్నారు. ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్ఆర్ఎస్ కొరకు ఎదురు చూస్తున్నారని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ అమలులో పలు వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎస్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి ఏదేని సలహాలు కొరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 26–08–2020న ఎల్ఆర్ఎస్‌కు 8312 ఇంటి ప్లాట్లు, 60 లే అవుట్స్ కు దరకాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 4909 మందికి క్రమబద్ధీకరణ సమాచారం అందినట్లు తెలిపారు. మిగిలిన దరకాస్తులు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతి రాజ్ శాఖల అధికారులు విచారణ చేయనున్నారని అన్నారు. ఈ సందర్భంగా లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డా క్యుమెంట్ రైటర్లు సిటిజన్ లాగిన్ లో సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టిపిఓ సునీల్, లే అవుట్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# జయ నర్సింగ్ కాలేజీని గ్రేటర్ అధికారులు సీజ్

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** గత మూడేళ్లుగా మున్సిపల్ కార్పోరేషన్‌కు బకాయి పడి ఉన్న ఆస్తి పన్ను రూ. 44 లక్షలు చెల్లించని కారణంగా కమిషనర్ ఆదేశాల మేరకు హన్మకొండలోని జయ నర్సింగ్ కాలేజీని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ.. జయ నర్సింగ్ కళాశాల యాజమాన్యం కోర్టులో కేసు కొనసాగుతుందని చెబుతూనే నర్సింగ్ కళాశాలను నడుపుతున్నారని గుర్తించిన బల్దియా పన్నుల అధికారులు బకాయి పడి ఉన్న పన్నులు చెల్లించాలని కోరుతూ రెడ్ నోటీసు జారీ చేయడం జరిగిందని, అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో మంగళవారం ఉదయం నర్సింగ్ కళాశాల విద్యార్థులను సిబ్బందిని బయటికి పంపించి కళాశాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. బల్దియాకు చెందిన అధికారులు గత వారం రోజులుగా ప్రాపర్టీ టాక్స్ చెల్లింపు విషయంలో ఇప్పటికే సుమారు 356 ప్రాపర్టీలను సీజ్ చేయడం




జరిగిందని, నగర ప్రజలు ప్రాపర్టీ, నల్లా బకాయి వెంటనే చెల్లించాలని అధికారుల కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ యూసుఫోద్దీన్, ఆర్ఐలు సురేష్, రజనీ, భరత్, చంద్ర, శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు రూ.3లక్షలు అందించడం భేష్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు రూ.3లక్షలు అందించడం హర్షణీయమని జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్టీ, బిసి, మైనార్టి యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద మార్చి 17 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది. దీంతో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు శివరాజ్ యాదవ్ పాలాభిషేకం చే శారు. శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తర్వాత యువతకు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ గంగం నర్సింహారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు బాలరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర, మాజీ కౌన్సిలర్లు రామచంద్రం, బొట్ల శ్రీను, నాయకులు లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# బాలికను కిడ్నాప్ చేసిన వ్యభిచార ముఠా అరెస్టు

వివరాలు వెల్లడించిన వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్

**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ నగరంలో సంచలనం సృష్టించిన మైనర్ బాలిక కిడ్నాప్ కేసును మిల్స్ కాలనీ పోలీసులు ఛేదించారు. మంగళవారం నిందితులను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 11న మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ బాలిక మిస్సింగ్ అయిందని ఫిర్యాదు రాగా దర్యాప్తు చేపట్టారు. బాలికని ములుగు క్రాస్ రోడ్డు వద్ద గుర్తించారు. ఆమెని విచారించగా తనని కొంతమంది కిడ్నాప్ చేసి గంజాయి తాగించి అత్యాచారం చేసినట్లుగా తెలిపింది. దాంతో వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్, సెంట్రల్ జోన్ డిసిపి ఆధ్వర్యంలో వరంగల్ ఎసిపి పర్యవేక్షణలో మూడు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించి వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు దామెర మండలం ల్యాదేళ్ల గ్రామానికి చెందిన ఓ మహిళగా గుర్తించారు. ఈ మహిళ పడుపు వృత్తి చేస్తూ ఉండేది. ఈ క్రమంలో ఆమెకి పరిచయం ఉన్న మైనర్ నిందితురాలు తల్లిదండ్రులు మరణించడంతో తన ఇంట్లోనే ఉంచుకునేది. ఈ క్రమంలో ఎవరైనా కొత్త బాలికలు,మైనర్లయితే ఎక్కువ డబ్బులు కష్టమర్ నుండి వసూలు చేయొచ్చునని పథకం వేసింది. ఈ క్రమంలో తన వద్ద ఉన్న మైనర్ నిందితురాలితో బాలికలను ట్రాప్ చేయించేది. ఇందులో భాగంగా బాధితురాలితో పరిచయం పెంచుకొని స్కూల్ కి వెళ్లే సమయంలో మైనర్ నిందితురాలు శంభునిపేట్ కి చెందిన తన లవర్ అబ్దుల్ అఫ్సాన్ సహాయంతో మద్యం, గంజాయి తాగడం అలవాటు చేసింది. అనంతరం షాపింగ్ చేయించి బట్టలు కొనిచ్చారు. బాధితురాలు వారిని పూర్తిగా నమ్మిన తరువాత ఈనెల 11వ తేదీ సాయంత్రం ఇంటి నుండి బయటకు రప్పించి అబ్దుల్ అఫ్సాన్, అతని స్నేహితులైన షేక్ శైలాని బాబా, మొహమ్మద్ అల్తాఫ్ కలిసి కారులో తీసుకెళ్లారు. వారికి తరుచూ గంజాయి విక్రయించే మీర్జా ఫైజ్ బేగ్



(ఐదూద్ ) వద్ద గంజాయి కొనుగోలు చేసి నర్సంపేట దగ్గరలోని పాడుబడిన షేక్ సైలానిబాబా ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ బాధితురాలికి గంజాయి తాగించి ఆమె మత్తులోకి వెళ్లగానే సైలాని బాబా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నీవు గంజాయి తాగుతుండగా, వ్యభిచారం చేస్తుండగా వీడియో తీశామని, రేపటి నుండి తాము చెప్పినట్లు చేయాలని ఈ విషయం ఎవరికైనా చెబితే వీడియో బయట పెడతామని బెదిరించారు. అనంతరం ఆమెని ములుగు క్రాస్ రోడ్డు వద్ద దించారు. నిందితులు అప్పటి నుండి పరారీలో ఉన్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు మంగళవారం ఉదయం నిందితులు అందరినీ అరెస్ట్ చేశారు. విచారణలో వారు తమ నేరాన్ని అంగీకరించారు. అలాగే నిందితుడైన మీర్జా ఫైజ్ బేగ్ ( వదూద్ ) వద్ద నుండి 1.8 కేజీల గంజాయిని కూడా సీజ్ చేశారు. ప్రధాన నిందితురాలి ఇంటి వద్ద 4300 కండోమ్ పాకెట్స్ తో పాటు రూ.75 వేల నగదు, ఒక కారు, నాలుగు మొబైల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకి గతంలో కూడా నేరచరిత్ర ఉన్నట్టుగా విచారణలో వెల్లడైంది. నేరస్తులపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసుని ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వరంగల్ ఏసీపీ నందిరామ్, మిల్స్ కాలనీ సీఐ వెంకటరత్నం, మిల్స్ కాలనీ ఎస్ఐ లు శ్రీకాంత్, సురేష్ లను సీపీ అభినందించారు.

# మండల పరిషత్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ఎస్ఇఆర్‌టి స్టేట్ టీమ్ అబ్జర్వర్ మాథయినా హిమ్మద్ ములుగు జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మల్లారెడ్డి జిల్లా పరిషత్ వెంకటాపూర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల మీద భయాన్ని తొలగిస్తూ చక్కటి అవగాహన ను, ప్రేరణను కల్గించారు. అలాగే విద్యార్థులను సబ్జెక్ట్స్ కి సంబంధించిన కనీస అభ్యసన సామర్థ్యాలను పలు ప్రశ్నల ద్వారా పరీక్షించి సంతృప్తిని వ్యక్తం చేయడం జరిగింది. ఆహ్లాద కరమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని, సందేహాలను సంబంధిత సబ్జెక్టు టీచర్స్ ద్వారా డైరెక్ట్ గా, వాట్సప్ ద్వారా, ఫోన్ ద్వారా గ నివృత్తి చేసుకోవాలన్నారు. విషయాలను బట్టి పట్టకుండా బేసిక్ కాన్సెప్ట్స్‌ని గుర్తు పెట్టుకుంటే మంచి మార్కులు తెచ్చుకొని మీ తల్లిదండ్రులకు, మీ స్కూలుకి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా స్కూల్ రికార్డ్స్ చెక్ చేసి ఉపాధ్యాయులకు తగిన సలహాలు మరియు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా సమయ పాలన పాటించాలని, స్కూలు రికార్డ్స్ అప్డేట్ గా ఉంచుకోవాలని, బోధనలో లిప్ ని అమలు చేస్తూ, టీఎల్ఎం, లెర్నింగ్ ఔట్ కమ్స్, చైల్డ్ రైట్స్



ప్రతి తరగతిలో ప్రదర్శించాలని, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కి, కల్చరల్ ఆక్టివిటీస్ కి ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పాటు ను అందించాలని ఉపాధ్యాయులకు సూచిస్తూ, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వీటిని సక్రమంగా అమలు చేసే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. రాధిక, టీచర్స్ బాబూరావు, ఫిరోజ్, కిరణ్ కుమార్, సంధ్యారాణి, జగన్ మోహన్, మహేష్, అంబేద్కర్, కిషోర్ బాబు, జ్యోస్న, సిఆర్పీ కుమార్ పాడియా ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ అండ్ టీచర్స్ పాల్గొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వేగం పెంచండి : కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** జిల్లాలో జాతీయ ఉపాధిహామీ పథకంలోపనుల్లో వేగం పెంచాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టరేట్‌లో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఏపిఓలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(ఎన్ఆర్ఈజిఎస్) పనుల్లో వేగం పెంచి కూలీల సంఖ్య వందశాతం హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, మార్చి 31లోపు జిల్లాలో ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో భాగంగా జరుగుతున్న పనులు కాలువ పూడిక తీత, చెక్‌డ్యాం నిర్మాణం, ఇంకుడు గుంతలు, తదితర పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, డిఆర్‌డిఓ పిడి మధుసూధన్‌రాజు, జిలాలోని ఎంపిడిఓలు, ఏపిఓలు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# అసెంబ్లీలో బిసి బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నాం

బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బిసిలకు విద్యా, ఉద్యోగాల్లో మరియు స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రాజకీయ రిజర్వేషన్ లను 42 శాతం పెంచుతూ నిన్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిసి బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందడం హర్షనీయమని బిసి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ చట్టం బిసిల మొదటి పోరాట విజ యం అని ఆయన ప్రకటించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం ప్రత్యేక చొరవతో అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ చట్టం చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డికి, పి సిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, ఇదే సమయంలో ఈ బిల్లు కు బేషరతుగా మద్దతు తెలిపిన బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ పార్టీల నేతలకు సమస్త బిసి సమాజం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన తెలిపారు. బిసి బిల్లు ఆమోదం తదుపరి అమలు కోసం ఢిల్లీ కేంద్రంగా జరిగే పోరాటంపైన అన్నిరాజకీయపార్టీలుకలిసి రావాలని ఆయన కోరారు.

# చిన్నారులకు నాణ్యమైన ఆహారం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని మరిగడి గ్రామ పంచాయితిలోని ఎంపీపీఎస్ పాఠశాల పరిధిలో గల అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో పిల్లలకు అందించే ఆహారాన్ని పరిశీలించి, చిన్నారులకు అందించే ఆహారం పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం కలెక్టర్ పిల్లలతో కాసేపు సరదాగా గడిపారు. కేంద్రం ద్వారా వారికి నేర్పిస్తున్న విద్యాబోధనలు, రైమ్స్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట జీసీడీవో గౌసియా బేగం, సంబంధిత అధికారులు, అంగన్వాడి టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి


హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/ హనుమకొండ:** సమాజంలో ఆపదలో ఉన్న వారికి దాతలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయ ప్రాంగణం వద్ద తలసేమియా బాధితుల కోసం ర క్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ము ఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రక్తదానం చేసి ఉ ద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులకు క లెక్టర్ అభినందనలు తెలియజేశారు. రక్తదాతలకు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెం కట్ రెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డిఆర్డిఓ మేన శ్రీను, బిసి సంక్షే మ శాఖ అధికారి రామ్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో పెండింగ్ అభివృద్ధి పనులపై ప్రస్తావించిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండలంలోని పలు అభివృద్ధి పను లు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాల పనులను పూ ర్తి చేయాలని పాలకుర్తి ఎ మ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అ సెంబ్లీలో ప్రస్తావించా రు. మంగళవారం అసెంబ్లీ స మావేశాలలో నియోజకవర్గానికి సంబంధితంచిన పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఆమె తీసుకెళ్లారు. బస్టాండ్ ప్రాంగణం చిన్నగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడు



తున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. చెన్నూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన నిధులు ఇప్పటికి విడుదల కాలేదని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున తక్షణమే మిగిలిన నిధులు విడుదల చేసి పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.

# తెలుగు వర్సిటీకి సురవరం పేరు పెట్టడం హర్షణీయం

**ప్రజాపక్షం / నల్లబెల్లి :** రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగిస్తూ సురవరం ప్రతాపరెడ్డి పేరును పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు . మంగళవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు . ఈసందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని తెలుగు వర్సిటికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగిస్తుండటంతో పాటు తెలంగాణలో ఆంధ్ర మహాసభ ఏర్పాటులో తొలిసారిగా కవి సమ్మేళనం నిర్వహించి తెలంగాణ అస్తిత్వాన్ని చాటిని సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం రాష్ట్రా ప్రభుత్వన్ని అభినందించారు . తెలంగాణలోని తెలుగు వర్సిటికి సురవరం ప్రతాపరెడ్డి



పేరు పెట్టడం పట్ల పొట్టి శ్రీరాములను అవమానించినట్లు కాదన్నారు . స్థానిక సంస్థల ఎన్నికల్లో ,విధ్య ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం పెంచడం బిల్లు అమోదించడం పట్ల హర్ష వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమంలో మండల బిసి హక్కుల సాధన సమితి అధ్యక్షుడు చీకటి ప్రకాష్ ,మేడిపల్లి రాజు ,కోల లింగాయ్య ,రాపర్తి సంపత్ జెట్టి వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు .

ఫోకస్

# మహిళ




## భద్రత ముసుగులో అవకాశాలకు తెర!

భద్రత పేరుతో మహిళలకు పలు ఉద్యోగావకాశాలు దక్కకుండా పోతున్నాయి. వివిధ చట్టాలను అనుసరించి, రాత్రిపూట మాత్రమేకాదు... కొన్ని పరిశ్రమల్లో పగలు పనిచేయడం నుంచి కూడా మహిళలను మినహాయించాలి. కొన్ని రకాల యంత్రాలపై పనిచేస్తున్నప్పుడు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయేమోనన్న అనుమానమే ఇందుకు ప్రధాన కారణం. దేశ వ్యాప్తంగా రాష్ట్రాలు ఏవీ ఈ మినహాయింపులను సడలించలేదు. ఎలక్ట్రోప్లేటింగ్, పెట్రోలియం ఉత్పత్తులు, పురుగుల మందు తయారీ, పునర్వినియోగపరచదగిన బ్యాటరీల తయారీ వంటి రంగాల్లో మహిళలకు భద్రత పేరుతో అవకాశాలకు గండిపడింది. నిర్దిష్ట పారిశ్రామిక ప్రక్రియలో పని చేయకుండా మహిళలపై 139 నిషేధాలు అమలవుతున్నాయి. చాలా సందర్భాలలో, ఈ ఉద్యోగాలలో పనిచేసే పురుషుల కంటే మహిళలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతారనడానికి ఎలాంటి హేతుబద్ధమైన వివరణలు లేవు. కానీ, సంప్రదాయంగా వస్తున్న మినహాయింపులను ఆధునిక కాలంలోనూ కొనసాగుతున్నాయి. కొన్ని ఫ్యాక్టరీల్లో మహిళలతో పని చేయించడాన్ని కొన్ని రాష్ట్రాలు ఆమోదిస్తుంటే, మరికొన్ని రాష్ట్రాలు నిషేధిస్తున్నాయి. అంటే, మహిళలకు అమలవుతున్న మినహాయింపులకు ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేదని స్పష్టమవుతున్నది. ఉదాహరణకు, పరిశ్రమల అంతటా ఉపరితలాలను శుభ్రం చేయడానికి ఉపయోగించే ఫ్రిక్షన్ బ్లాస్టింగ్‌లో మహిళలు పని చేయడాన్ని కర్నాటక ఆమోదించింది. కానీ, పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నిషేధించింది. ఒకే రకమైన పని ఒక రాష్ట్రంలో తప్పయితే, మరో రాష్ట్రంలో ఒప్పు ఎలా అవుతుంది? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైరుధ్యాలపై దృష్టి సారించి, మహిళలకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచాలి.



### భద్రతా చర్యలే మార్గం..

మహిళలు రాత్రిపూట పనులు చేయకూడదని లేదా కొన్ని కర్మాగారాల్లో వారు ఉనికి ప్రమాదకరమని పేర్కొనే చట్టాలు... బలంగా పాతుకుపోయిన అభిప్రాయాలు మారాలి. కేవలం పని విషయంలో మాత్రమేకాదు.. మిగతా అన్ని విధాలుగానూ మహిళల భద్రతకు చర్యలు తీసుకోవడం ప్రభుత్వాల బాధ్యత. వారు నైట్ షిఫ్ట్‌లో పని చేస్తే లేదా ఫలానా రకమైన ఫ్యాక్టరీలో పని చేస్తే భద్రత కల్పించడం కష్టమని చేతులెత్తేయడం బాధ్యతారాహిత్యమే అవుతుంది. పితృస్వామ్య విధానం ఆధారంగా మహిళల పనిపై నిషేధాలు మొదలయ్యాయి. వారి భద్రత పేరుతో ప్రతిబంధకాలు సామాన్యమయ్యాయి. 'ప్రమాదకరమైన పరిస్థితులు' అనే పేరుతో కొన్ని రంగాల్లో వారి ప్రవేశాన్ని శాశ్వతంగా నిషేధిస్తున్నాయి. ప్రమాదకరమైన పరిస్థితులు కేవలం మహిళలకు మాత్రమే ఉంటాయా? పురుషులకు ఉండవా? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. నిజానికి భద్రతను కల్పిస్తే, సవాలక్ష ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. మహిళలు సమస్యలు ఎదుర్కొంటారన్న అనుమానం ఉన్న ఫ్యాక్టరీల్లో సిసిటివి ఏర్పాట్లు ఉండాలి. అదే విధంగా జిపిఎస్ ఆధారిత రవాణాను అందుబాటులో ఉంచాలి. ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన చిక్కులు ఉన్నాయంటూ హెచ్చరించడాన్ని మానుకొని, వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు, యాజమాన్యాలు కృషి చేయాలి. అదే సమయంలో, వేరువేరు ప్రాంతాల్లో వేరువేరుగా ఉంటున్న చట్టాల స్థానంలోనే, ఏకీకృత విధానాలను అమల్లోకి తీసుకురావాలి. చట్టాల్లో మార్పులు, సవరణలు అసాధ్యమేమీ కాదు. ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టసభల్లో తీర్మానాల ద్వారా ఈ ప్రక్రియను ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి చేసుకోవచ్చు.

## లేటు వయసులో చదువు!

ఆర్థిక ఇబ్బందుల కారణంగా మూడో తరగితోనే విద్యాభ్యాసాన్ని ముగించింది కేరళకు చెందిన సతీ దేవి. కొంతకాలం దిన సరి కూలీగా పని చేసింది. కుటుంబాన్ని పోషించడానికి బీడీలు చుట్టింది. కల్లాలీలో పశువుల కాపరిగా రోజులు దొర్లిస్తున్న సమయంలోనే ఆమెకు చదువుకోవాలన్న ఆలోచన వచ్చింది. ప్రపంచాన్ని తెలుసుకోవాలంటే, విస్తృత పఠనం అవసరమని నమ్మింది. అప్పటికి ఆమె వయసు 50 సంవత్సరాలు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం దిద్దుకున్న అక్షరాలు.. చదువుకున్న పదాలను మరచిపోయింది. అందుకే, కొత్తగా అక్షరాలు దిద్దడం మొదలు పెట్టింది. క్రమంగా



స్ఫూర్తిప్రదాతలు..

పదాలు రాయడం, చదవడం నేర్చుకుంది. పశువులను మేపుతూ, దొరికి ఖాళీ సమయంలో ఏదో ఒక పుస్తకం చదువుతూ గడిపింది. చదువు పట్ల సతీ దేవికి ఉన్న ఆసక్తిని గమనించిన కొంత మంది విద్యార్థులు, గ్రామస్థులు ఆమెకు పుస్తకాలు ఇవ్వడం మొదలు పెట్టారు. తన వద్ద ఉన్న ప్రతి పుస్తకాన్నీ ఎంతో శ్రద్ధగా చదువుతూ, అడపాదడపా సాహితీ చర్చల్లో పాల్గొంటూ తనకంటూ ఒక గుర్తింపు సంపాదించింది. క్రమంగా సతీ దేవి పేరు ఇతర ప్రాంతాల్లోనూ మారుమోగింది. యాభై ఏళ్లు దాటిన తర్వాత చదవడం నేర్చుకున్న ఆమెను ఆదర్శ మహిళా పేర్కోవడం, గౌరవించడం ప్రారంభమైంది. ఇప్పటికే కొన్ని వందల పుస్తకాలు చదివిన సతీ దేవి, రచనలు చేయడం కూడా ప్రారంభించింది. తన జీవిత కథను పుస్తకం రూపంలోకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఉంది. ఒక పశువుల కాపరి సాహితీ వర్గాల్లో చురుగ్గా పాల్గొనే స్థాయికి చేరడం అరుదు. ఆ అరుదైన ఘనతను సాధించింది కాబట్టే, సతీ దేవి స్ఫూర్తిప్రదాతగా మన్ననలు పొందుతున్నది.

## అంతా పెత్తందారులే!



మహిళల విషయంలో అంతా పెత్తందారులే... అందరూ కాపలాదారులే. వారి కదలికలను నిశితంగా పరిశీలిస్తూ, ఏం చేయాలో... ఏం చేయకూడదో సూచనలు, సలహాలిచ్చేవారు ఎక్కువ. ఈ 'సోషల్ పోలిసింగ్' మహిలను ఇబ్బందులకు గురిచేయడమేకాదు, వారి ఉపాధికి, ఆదాయానికి కూడా గండికొడుతున్నాయి. ఉదాహరణకు మద్యం తయారీ కర్మాగాల్లో మహిళలపై నిషేధం అనాదిగా కొనసాగుతున్నది. మద్యం తయారీ లేదా విక్రయ కేంద్రాల్లో పని చేసే మహిళలు మద్యం తాగడానికి అలవాటుపడే ప్రమాదం ఉందన్న అనుమానమే ఈ నిషేధానికి ప్రధాన కారణం. మహిళలు మద్యం సేవించకూడదనే నిబంధన కూడా పురుషాధిక్య సమాజం విధించిందే. కేవలం మద్యం తాగుతారన్న అనుమానంతో వారికి ఉద్యోగాలు ఇవ్వకపోవడం దుర్మార్గం. పంజాబ్ ఎక్సైజ్ చట్టం (1914) నూట పదేళ్లుగా, ఏదో ఒక రూపంలో అమల్లో ఉంది. మహిళలు మద్యానికి బానిసలు కాకుండా, పురుషుల నుంచి అఘాయిత్యాలకు గురికాకుండా జాగ్రత్త పడేందుకే వారిని పనుల్లోకి తీసుకోవడం లేదన్నది ఆ చట్టం సారాంశం. మహిళలు మద్యం తాగడం నైతికంగా సరికాదని వివరణ కూడా ఉంది. అనాదిగా వస్తున్న సోషల్ పోలిసింగ్ కొనసాగింపే ఈ వైవిధ్యాలకు కారణం. ఇదే కారణాన్ని చూపుతూ, పశ్చిమ బెంగాల్ మహిళలను ఆల్కహాల్ అందించే లేదా అమ్మక పరిశ్రమలో పాల్గొనడానికి అనుమతించదు. మద్యం సేవ పరిశ్రమలో మహిళలు పాల్గొనడానికి అనుమతించిన రాష్ట్రాల్లో కూడా, వారి ప్రమేయం మద్యం సేవించే రకంపై ఆధారపడి ఉంటుంది. ఇది ఏకపక్ష నిర్ణయానికి పరాకాష్ట. భారతదేశం మద్యం పరిశ్రమను, దేశీయ, విదేశీ అనే రెండు తరగతులుగా విభజిస్తుంది. కొన్ని రాష్ట్రాలు మహిళలను ఒకదానిలో పాల్గొనడానికి అనుమతిస్తాయి. మరొకదాని నుండి నిరోధిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోని మహిళలు విదేశీ మద్యాన్ని అందించవచ్చు లేదా అమ్మవచ్చు. కానీ, దేశీయ మద్యం సర్వ్ చేయడం లేదా అమ్మడం నిషిద్ధం. ఆంధ్రప్రదేశ్‌లోని మహిళలు దేశ మద్యాన్ని సర్వ్ చేయవచ్చు లేదా అమ్మవచ్చు. కానీ, విదేశీ మద్యం విషయంలో నిషేధం కాదు. తెలంగాణ వంటి ఇతర రాష్ట్రాల్లో, మహిళలు విదేశీ మద్యం విక్రయించడానికి లైసెన్స్ పొందవచ్చు , కానీ విదేశీ మద్యం అందించే సంస్థలలో పని చేయడానికి వీల్లేదు. మహిళలకు సోషల్ పోలిసింగ్ తెచ్చిపెట్టిన సమస్యల్లో ఇది కూడా ఒకటి.

## కాంతివంతమైన చర్మం కోసం..

కాంతివంతమైన చర్మం కోసం అనేక మార్గాలు ఉన్నాయి. అయితే, మొదట చర్మ రకం ఏంటో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఎందుకంటే ప్రతి చర్మ రకానికి ఒకే చికిత్స పనిచేయదు. మీ చర్మం పొడిగా, నూనెగా, మిశ్రమంగా లేదా సున్నితంగా ఉందా అని తెలుసుకోండి. చర్మ రకానికి సరిపోయే ఉత్పత్తులను ఎంచుకోండి. ముఖం కడుక్కోవడానికి, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ వంటి ఉత్పత్తులను ఎంచుకునేటప్పుడు దీనిని గుర్తుంచుకోండి. కొన్ని సహజ ఇంటి నివారణలు కూడా చర్మ సమస్యలకు సహాయపడతాయి. అలోవెరా జెల్, పెరుగు, బేకింగ్ సోడా వంటివి మొటిమలకు చికిత్స చేయడానికి సహాయపడతాయి. వివిధ మార్గాల్లో సేకరించిన వివరాలను అనుసరించి.. చర్మ సమస్యలకు చికిత్స చేయడానికి సమయం పడుతుంది. రాత్రిపూటే ఫలితాలు రావాలని ఆశించకండి. క్రమం తప్పకుండా చికిత్స కొనసాగించండి, మార్పులను గమనించగలరు. చర్మ సమస్యలు తీవ్రంగా ఉంటే లేదా ఇంటి చికిత్సలతో మెరుగుపడకపోతే, డాక్టర్‌ను తప్పక సంప్రదించాలి. చర్మవ్యాధి నిపుణుడు చర్మ సమస్యకు కారణాన్ని నిర్ధారించి సరైన చికిత్సను అందిస్తారు.

**ముఖానికి కలబంద:** కలబంద చర్మానికి చల్లబరిచే, శాంతపరిచే లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది దురద, వాపు, మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. దానిని నేరుగా మొక్క నుంచి తాజాగా వాడవచ్చు లేదా జెల్ రూపంలో కొనుగోలు చేయవచ్చు.

**తేనె:** తేనె యాంటీబాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది మొటిమలు, ఇతర చర్మ సంక్రమణలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. దీనిని నేరుగా చర్మానికి అప్లై చేయవచ్చు లేదా మొటిమల చికిత్సకు ఫేస్ మాస్క్‌లో ఉపయోగించవచ్చు.

**నార్వేజీయన్ క్రీమ్:** నార్వేజీయన్ క్రీమ్ అనేది చాలా జిడ్డుగల మాయిశ్చరైజర్, ఇది చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి పొడి, పగిలిపోయిన చర్మాన్ని రక్షించడానికి సహాయపడుతుంది. ఇది చర్మం వ్యాధులైన ఎగ్జిమా, సోరియాసిస్ చికిత్సకు కూడా ఉపయోగించవచ్చు.

**కోకోనట్ ఆయిల్:** కొబ్బరి నూనె అనేది మరొక జిడ్డుగల మాయిశ్చరైజర్, ఇది చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి సంరక్షించడానికి సహాయపడుతుంది. ఇది యాంటీబాక్టీరియల్ , యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది మొటిమలు, ఫంగస్ సంక్రమణలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

**ఆపిల్ సైడర్ వెనిగర్:** ఆపిల్ సైడర్ వెనిగర్‌లో యాంటీబాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇది మొటిమలు ఇతర చర్మ సంక్రమణలకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. ఇది చర్మాన్ని సమతుల్యం చేయడంలో pH స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. ఇది జిడ్డుగల చర్మానికి మంచిది.

---

# బడ్జెట్‌లో వ్యవసాయరంగానికి కేటాయింపులు తగ్గించిన బిజెపి ప్రభుత్వం

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మోదీ ప్రభుత్వ హయాంలో గత 15ఏళ్ళలో వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమైపోయిందని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తుందని ఆయన ఆరోపించారు. రైతుసంఘం మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభలు మంగళవారం బయ్యారం మండల కేంద్రంలోని కోదండరాం ఫంక్షన్ హాల్లో రైతుసంఘం అధ్యక్షుడు నెల్లూరి నాగేశ్వరావు అధ్యక్షతన జరిగింది. మహాసభలు ముఖ్య అతిధిగా హాజరై బాగం మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి రైతుసంఘంగా ఎఐకెఎస్ అనేక రైతాంగ సమరశీల పోరాటాలు చేసిందన్నారు. రైతన్నకు అండగా నిలుసున్నది రైతు సంఘం అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ఆయన కోరారు. కేంద్రప్రభుత్వం కార్పోరేట్ అనుకూల విధానాలతో రైతాంగాన్ని సంక్షోభంలోకి నెట్టి దేశంలో రైతుల ఆత్మహత్యలకు కారణమవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో జరిగే రైతుసంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రైతాంగానికి పిలుపునిచ్చారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు బి.అజయ్‌సారథిరెడ్డి, నల్లు సుధాకర్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీనివాస్, నెల్లూరి నాగేశ్వరావు, మేక వీరన్న, సారిక శ్రీనివాస్, నాదెళ్ళ పద్మ, కళింగరెడ్డి పాల్గొన్నారు.

# సింగరేణిలో ప్రైవేట్ టెండర్లు రద్దు చేయండి

వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్



**ప్రజాపక్షం/కాసిపేట :** ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిన టెండర్లను రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వంతో చర్చించి రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కాసిపేట 1వ గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, సత్తుపల్లి, ఇల్లందు గనులకు సింగరేణి టెండర్లలో పాల్గొనకుండా గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ, సింగరేణికి అవకాశం కల్పించకుండా ప్రైవేట్ వ్యక్తులకు టెండర్లు ఇచ్చారన్నారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను కోరుతున్నామని తెలిపారు. టెండర్లు రద్దు చేయకపోతే గతంలో జరిగినట్లే సమ్మె చేసి హక్కులను సాధించుకుంటామని, ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని హెచ్చరించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ టెండర్లలో పాల్గొనడానికి సింగరేణికి అవకాశం కల్పించాలని డిప్యూటి సిఎం బట్టి విక్రమార్కను కోరినట్లు తెలిపారు. ఇన్‌కమ్ టాక్స్, సొంత ఇంటి పథకం విషయంలో కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కార్పొరేట్ హాస్పిటల్ ఏర్పాటుకు అంగీకారం జరిగినట్లు వెల్లడించారు. డిస్మిస్ అయిన కార్మికుల విషయంలో, ఐదేళ్లలో 100 మందికి ప్రతి సంవత్సరం ఉద్యోగ అవకాశం కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించిందని పేర్కొన్నారు. కోల్ ఇండియాలో లేని 11 రకాల అలవెన్స్‌లను పెంచేందుకు అంగీకారం జరిగినట్లు తెలిపారు. సొంత ఇల్లు కట్టుకున్న కార్మికులకు క్వార్టర్ వెకేషన్ సర్టిఫికెట్ ఇవ్వడానికి అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. గత 56 సంవత్సరాలుగా స్ట్రక్చర్ సమావేశాలు జరగకపోయినా, సింగరేణిలో ఎన్నికలు వద్దని యాజమాన్యానికి లేఖ రాసిన సంఘాలు, ఇప్పుడు ఎఐటియుసిని విమర్శించడం తగదన్నారు. సమావేశంలో ఫిట్ సెక్రటరీ మినుగు లక్ష్మీ నారాయణ, బ్రాంచ్ ఇంచార్జ్ చిప్ప నరసయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ఎస్ నాగేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

---

# భవన నిర్మాణ కార్మికులకు రక్షణ చట్టాలు

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల రక్షణకు ఉన్న చట్టాలను అమలు చే యాలని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కుల రక్షణకు కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా 3వ మహాసభ ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను అమలు చేయాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను మహాసభ ద్వారా డిమాండ్ చేశా రు. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న తాపీ మేస్త్రీలు, సెంట్రింగ్ వర్కర్స్, ఎలక్ట్రీషన్, ప్లంబర్, పెయింటర్స్, కార్పెంటర్స్, మట్టి పని వర్కర్, మార్బుల్ వర్కర్, తదితర రంగాలలో పనిచేసే కార్మికులందరిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఆయా రంగాలలో పనిచేస్తున్న కార్మికులను ఐక్యం చేసి కమిటీలు వేసుకొని వారి హక్కుల కోసం ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యకు పరిష్కారం చూపే విధంగా స్థానిక నాయకత్వం ముందుకు వెళ్లాలని సూచించారు. కార్మికులకు అడ్డాలు లేని ప్రాంతాలలో అధికారులు దృష్టికి తీసుకెళ్లి అడ్డాల కోసం షెడ్లు నిర్మించి మూత్రశాలలో ఏర్పాటు చేసే విధంగా ప్రజావాణిలో దరఖాస్తు చేయాలని ఆయన కోరారు. కార్మికులంతా కలిసిమెలిసి ఐక్యమత్యంతో హక్కుల కోసం మన యూనియన్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేసుకోవాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో కుడుదుల వెంకటేష్, బండారి లావణ్య, నారాయణ, వై.రాము, పి.శ్రీనివాస్, రమేష్, ఈర్ల రవి, సతీష్, శ్రీపతి మమత, శ్రీపతి అనిత, శ్రీపతి వసంత, కాగిత పద్మ, గామిడి మల్లక్క, బల్ల శ్రీకాంత్, కుమారస్వామి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌హెచ్‌పిలకు ఉద్యోగ భద్రత : ఎఐటియుసి డిమాండ్

ఎఐటియుసిలో ఎంఎల్‌హెచ్‌పి ఉద్యోగుల చేరిక



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** నేషనల్ హెల్త్ మిషన్‌లో ప్రైమరీ హెల్త్ సెంటర్ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పి)లకు రూ.44వేల వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ జిల్లా స్థాయి సమావేశం గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జ్యోతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు సిహెచ్ రాజారెడ్డి హాజరుకాగా రాజేష్ ఖన్నా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ గైడెన్స్ ప్రకారం ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు ఎఐటియుసి అండగా ఉండి పోరాటం నిర్వహిస్తుందన్నారు. సమావేశం అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహేష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా పులి లావణ్య, బొల్లం జెస్సికా, ప్రధాన కార్యదర్శి కీర్తన, ప్రవలిక, సహాయ కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా శిరీష, మమత, సలహాదారులుగా గంగరబోయిన జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.లిఖిత, రాణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయియీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, ప్రధాన కార్యదర్శి ఎ.గణేష్, ఎమ్‌ఎల్‌హెచ్‌పి, తదితరులు పాల్గొన్నారు.

# యువజన రంగానికి నిధులు కేటాయించాలి : ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం) :** రాష్ట్ర ప్రభుత్వం యువజన కమిషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని ఎఐవైఎఫ్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్ డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ మండల మూడవ మహాసభ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. సభకు హాజరై మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో యూత్ డిక్లరేషన్‌లో జాబ్ క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగ భృతి రూ.4 వేలు ఇస్తామని ప్రకటించిందన్నారు. విద్య, ఉపాధి కల్పనకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. యూత్ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని, కమిషన్‌కు గ్రాంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కోర్టు వివాదాలు, న్యాయ వివాదాలు లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. విభజన హామీల అమలు కోసం కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం సమావేశంలో మండల ఎఐవైఎఫ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆలం శెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ నయిమ్‌తో 13 మంది సభ్యులతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు బత్తిని నరేష్, ఎండి నయీమ్, అల్లంశెట్టి వెంకటేష్, నాయకులు దుంప పరుశురాములు, అంబోజు నవీన్, భాషబోయిన నరేందర్, శ్రీరామోజు నవీన్, ఎర్రంబెల్లి నరేష్, మారుపాక లోకేష్, రాంపాక చందు తదితరులు పాల్గొన్నారు.


# వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు

రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సమాజ మనుగడలో ప్రధాన భూమిక పోషిస్తున్న వ్యవసాయ రంగాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని రైతు సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనంలో కనకబండి సీతారాములు అధ్యక్షతన జరిగిన రైతు సంఘం మండల 3వ మహాసభకు గోవిందరావు హాజరై మాట్లాడారు. పాలకులు కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమాన్ని విస్మరించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సరైన ధర రాక తెచ్చుకున్న అప్పులు తీరక రైతుల గోసలు ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతులందరికి రైతు భరోసా, రైతు బోనస్ ఇవ్వాలని, 55 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పింఛన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా కనకబండి సీతారాములు, కార్యదర్శిగా పాల్తియ శ్రీనివాస్‌తో పాటు మండల కమిటీని 11 మందిని ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కర్నాటి భాను ప్రసాద్, బానోతు రాముకోటి, మారిశెట్టి వేంకటేశ్వరరావు, కుంచం భిక్షం, చిర్ర ప్రసాద్, చావా గణపతి, వల్లాల కృష్ణ, పొలంపల్లి నారాయణ, భూక్యా రాములు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, బాలిన కృష్ణంరాజు, చిలివేరు రేణుబాబు, మేకల పుల్లయ్య, ముత్యాల వేంకటేశ్వర్లు, బాలెబోయిన వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్లపై అధికారుల పర్యవేక్షణ ఏదీ?



ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామంలో ఓ ఆశ్చర్య సంఘటన చోటు చేసుకుంది.పారుపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయం పక్క గల్లీలో ఇటీవల నూతనంగా మంజూరైన ఐదు లక్షల వ్యయంతో సిసి రోడ్డు వేశారు. అంతా బాగానే ఉన్న రోడ్డు మధ్యలో ఓ ఎలక్ట్రికల్ స్తంభం ఉండడంతో సదరు కాం ట్రక్టర్ ఆ స్తంభాన్ని తొలగించకుండా సిసి రోడ్డు అలాగే ఉంచి రోడ్డు వేశారు. సిసి రోడ్డు పరిశీలించాల్సిన పంచాయతీ రాజ్ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తు న్నారు. రోడ్డు వేసి సుమారు వారం గడుస్తున్న సరిగ్గా నీళ్లు పట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో రోడ్డుకు అక్కడక్కడ పగుల్లు కూడా ఎర్పడ్డాయి. రోడ్డు నిర్మాణంలో అధికారుల పర్య వేక్షణ లేకుండా ఇష్టారాజ్యంగా వేయడం సబబు కాదని గ్రామస్తులు వాపోయారు.

ఫోటో జగిత్యాల రూరల్ 01ఎండిపోతున్న పంటను చూపిస్తున్న

## పంటకు నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి



జగిత్యాల జిల్లా మాజీ జెడ్‌పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్

ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలం హైదర్పల్లి గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన లైసెట్టి వెంకటేష్, జక్కుల వెంకటీ సంబధించిన నీళ్లు లేక ఎండిపోయి కొన ఊపిరితో ఉన్న పంట పొలాలను జగిత్యాల జిల్లా మాజీ జెడ్‌పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్ తదితర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ ఎండిపోయిన పొలాలను మొరపెల్లి డి 53 కెనాల్ నుంచి నీళ్లు వెంటనే విడుదల చేసి నీళ్లు లేక ఎండిపోయి కొన ఊపిరితో ఉన్న పొలాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ ప్రజా పాలనలో రాష్ట్రంలో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్న కనీసం పట్టించుకునే నాధుడే లేడన్నారు. మళ్ళీ కెసిఆర్ వస్తేనే రైతు జీవితాలు బాగుపడతాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. రూరల్ మండల అధ్యక్షుడు ఆనంద రావు, మాజీ సర్పంచ్ అంజయ్య, సీనియర్ నాయకులు గంగారెడ్డి, ఉప సర్పంచ్ గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు రాజేష్, శంకర్, గ్రామ రైతులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళ వారం జిల్లా కలెక్టర్ బి .సత్య ప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, గదులు ,ఆసుప్రతిల్లో ఉన్నల్యాబ్‌ను,ఓపిరిజిస్టర్,ను ఐపి రికార్డ్స్ ,ల్యాబ్ రికార్డ్స్ ,మెడికల్ ఫార్మసిని పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన పలు విషయాలను మెడికల్ అధికారి శ్రీకాంత్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యసేవల అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు . ఆరోగ్య మహిళా కేంద్రంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు ఉచితంగా అందించే ఆరు రకాల వైద్య పరీక్షలను థైరాయిడ్, క్యాన్సర్, అస్తమా వంటి పరీక్షలు ఎలా చేస్తున్నారని డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ మధుసూదన్ ,తహసిల్దార్ వరందన్, ఎంపిడిఒ రామ్ రెడ్డి, ఎంపిఒ సురేష్ రెడ్డి, ఆర్ ఐ అనూష ,కార్యదర్శిరవిరాజ్, ఎఎన్ఎంలు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఒకరి మృతి

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : వెల్దుర్తి గ్రామానికి చెందిన రైతు మతలాపురం రాజం వ్యవసాయం చేస్తూ తను చేసిన అప్పులు కట్టలేనని, మానసికంగా బాధపడుతూ మంగళవారం ఉదయం తమ గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయడు. జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి గ్రామానికి చెందిన మతలాపురం రాజం 55 సంలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తాను చేసిన అప్పులు కట్టలేనని, మానసికంగా బాధపడుతూ, తనకు తానుగా మంగళవారం ఉదయం వెల్దుర్తి గ్రామ శివారులోని వేప చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయడని రాజం కుమారుడు మతలాపురం మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## 'రాజీవ్ యువ వికాసం'తో దళిత గిరిజనుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి : దళిత గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరుతో సంక్షేమ పథకాన్ని ప్రారంభించడం పట్ల జిల్లా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోతు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ధన్యవాదాలు తెలియజేస్తూ సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు తినిపించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాం గ్రెస్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా దాదాపు 5లక్షల మంది యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రూ.6వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వేల సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపడుతూ నిరుద్యోగ యువతకు సైతం చేయూతను అందించే విధంగా కృషి చేస్తోందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగాల నాయకులు జీడిరమేష్,రంగా, ముదావత్ వినోద్, ప్రేమ్, దండి రవి, హస్తపురం రమేష్, సముద్రాలఅజయ్,కిరణ్, రాజ్ కుమార్, గాలి అనిల్, మీసాల సాయిలు, తప్పట్ల అంజయ్య తదితరులున్నారు.

## కరువు...కన్నీళ్లకు కాళేశ్వరం ప్రాజెక్టుతోనే చరమగీతం

### నాడు కెసిఆర్ ఆలోచనతోనే బీడు భూములన్నీ సాగు భూములైనయ్

### మహా పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రిగా కెసిఆర్ గొప్పగా ఆలోచన చేసి రైతుల కన్నీళ్లకు, కరువుకు కాళేశ్వరం ప్రాజెక్టుతో ముగింపు పలికాడని, కానీ ఈనాడు కాంగ్రెస్ సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తూ కరువుకు ఆజ్యం పోస్తున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజమెత్తారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గోదావరి నది నుంచి ఆదివారం ప్రారంభమైన గోదావరి గోస మహాపాదయాత్ర పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చేరుకోగా రాత్రి అక్కడే బస చేసిన మాజీ ఎమ్మెల్యే సోమవారం ఉదయం మహాపాదయాత్రను ప్రారంభించారు. అంబేద్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరువు తాండవం చేస్తుందని, రాష్ట్రం ఏర్పాటు కాకముందు గోదా వరినది ఎలా ఎడారిలో ఉందో ఈనాడు అదే ప్రభుత్వంలో ఎడారిగా మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందు వరకు నిండుకుండలా ఉన్న గోదావరినది ఈనాడు చుక్క నీరు లేక వెలవెలబోయిందన్నారు. ఆనాడు కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపం పోసి తెలంగాణ ప్రాంతంలోని బీడు భూములకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కానీ ఈనాడు తెలంగాణరాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కాళేశ్వరంను నిర్లక్ష్యం చేస్తూ నిర్వీర్యం చేయాలనే కుట్రలు చే స్తోందని, ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడం మూలంగా ఈనాడు రైతన్నలు సాగునీటి కోసం గోసపడుతున్నారని, గత యాస ంగి, ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగునీరు లేక పంటలు ఎండిపోయి రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నా కనీసం ప్రాజెక్టులో నీళ్లు ఆపి సాగునీరు అందించాలనే ఆలోచన చేయడం లేదని ఆయన మండిపడ్డారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో కొన్ని ప్రా ంతాల్లో మూడు పంటలు తీసిన సందర్భాలు ఉన్నాయని, కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం లో ఒక్క పంటను కూడా సాగు చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కనువిప్పు కలుగాలనే తా ను గోదావరి గోస మహా పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రారంభమైన మహాపాదయాత్రకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కొనసాగిన పాదయాత్రలో భారీగా పార్టీశ్రేణులు తరలివెళ్లారు. ఈ మహాపాదయాత్రలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు రూ.30వేల కోట్లు

### బిసి సంక్షేమ సంఘం డిమాండ్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు రూ.30 వేల కోట్లను కేటాయించాలని, రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసిలకు గత ప్రభుత్వాలు మొండిచెయ్యి చూపించాయ్యని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యా యం చేయాలని బిసి సంక్షేమ సంఘం వారు డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం చేశారు. బిసి రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బిసిలకు 100 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి తూతూ మంత్రంగానే 6,7 కోట్లు మాత్రమే కేటాయించారని, రాబోయే బడ్జెట్‌లో రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్నబీసిలకు 30 వేల కోట్లను కేటాయించాలని సబ్‌ప్లాన్ అమలు చేయాలని, కాంట్రాక్ట్‌లో 40 శాతం బిసి రిజర్వేషన్ కల్పించాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటరి తిరుపురం రాంచందర్, బిసి మహిళ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా(న్యాయవాది), సాంస్కృతిక కార్యదర్శి బొమ్మిడి నరేష్‌కుమార్, బిసి యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు , అనుమల్ల సంజయ్ సామ్రాట్, బిసి నాయకులు తదితరుల పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలి

### సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి




ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి: రానున్న కరీంనగర్ కార్పోరేషన్ ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కరీంనగర్ నగర శాఖ ఆద్వర్యంలో కార్యదర్శుల సమావేశం పైడిపల్లి రాజు అధ్యక్షతన బద్దం ఎల్లారెడ్డి భవ న్‌లో జరిగింది. ఈ సందర్బంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్‌లో గత పాలకవర్గం హా యం లో స్మార్ట్ సిటీ పనుల్లో జరిగిన కోట్ల రూపాయల అవినీతి అక్రమాలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమా ండ్ చేశారు. కరీంనగర్ నగరంలోని 60 డివిజన్లలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త శాయశక్తుల కృషి చేయాలని ఆయన కోరారు. నగరంలోని పేదలు ఇండ్లు లేక చాలా మంది గుడిసెల్లో, కిరాయి ఇండ్లలో ఉంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతూ కాలం వెల్లదీ స్తోందన్నారు. వెంటనే ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చాలా మంది పేదలకు రేషన్ కార్డు లేక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వ నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. నగరంలో ఇప్పటికీ చాలా మందికి 500 రూపాయల గ్యాస్ పథకం అమలు కావడం లేదని, 200 యూనిట్ల లోపు కరెంటు ఫ్రీ సైతం అమలు జరగడం లేదని, అర్హులైన పథకాలు అందని ప్రజలందరినీ సమీకరించి భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, న్యాలపట్ల రాజు, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, చెంచల మురళి, కసిబోజుల సంతోష్ చారి, గామినేని సత్తయ్య, టి.సదయ్య, జి.సాంబరాజు, టి.సంపత్ తదితరులున్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు

### జిల్లా వైద్యాధికారి ప్రసన్న కుమారి



ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి : నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అన్న ప్రసన్నకుమారి సోమవారం రాత్రి ధర్మారం లోని సూర్య ఆదిత్య నర్సింగ్ హోమ్ లో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేసి అబార్షన్ లు చేస్తున్నారనే సమాచారం మేరకు డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది తో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సూర్యా నర్సింగ్ హోమ్, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ మరియు పిసిపిఎన్‌డి.టి యాక్ట్ ( గర్భస్థ శిశువు లింగ ఎంపిక నిషేధిత చట్టం) నిబంధనలు సరిగా పాటించని కారణంగా ఆసుపత్రి , స్కానింగ్ సెంటర్ ల రిజిస్ట్రేషన్ లను సస్పెండ్ చేసి, స్కానింగ్ మిషిన్, ఆసుపత్రిని సీజ్ చేయడం జరిగినదని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నర్సింగ్ హోమ్ ను తనిఖీ చేయడం జరిగిందని, ఈ నర్సింగ్ హోమ్ కు 9 బెడ్స్ తో నడుపుటకు అనుమతి ఉండగా 25 కంటే ఎక్కువ బెడ్స్‌తో నడుపుచున్నారని, అపరిశుభ్రమైన వాతావరణం లో ఉన్న ఆపరేషన్ థియేటర్లో ఆపరేషన్ నిర్వహించడం, కనీస పేషెంట్ భద్రత కూడా తీసుకోవడం లేదని, బయో మెడికల్ వేస్ట్ నిర్వహణ చేయడం లేదని, చట్ట ప్రకారం రెండు సంవత్సరముల వరకు గర్భిణీలకు స్కానింగ్ చేసిన వివరాలను జాగ్రత్త పరచవలసి ఉండగా అలా చేయడం లేదన్నారు. డా. లావణ్య వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని, ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాక్టీస్ చేయుటకు అర్హత లేదని స్కానింగ్ రికార్డులకు, ఫామ్ – ఎఫ్ లకు మరియు ఒ.పి. రిజిష్టర్ లో ఉన్న వివరాలకు పొంతన కలవడం,ఇలాంటివి గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చేసి అబార్షన్ లను చేస్తూ, అనుమతి లేని డాక్టర్ లు కన్సల్టేంట్ గా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమములో స్థానిక పోలీస్ లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ ఆధారిత అక్రమ రవాణా పలు అంశాలపై అవగాహన

### పాల్గొన్న సఖి సెంటర్ కేసు సహాయకురాలు శారద, జిల్లా లీడ్ బ్యాంక్ కౌన్సిలర్ మధుసూదన్



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:జగిత్యాల మండల ఐకెపి కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గ్రామ సమాఖ్య అసిస్టెంట్లలకు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాళ్లకు మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా వంటి అంశాలపై ఒక్కరోజు అవగాహన కార్యక్రమాన్ని జగిత్యాల సఖి సెంటర్ జిల్లా కేసు సహాయకురాలు ఏ.శారద నిర్వహించారు. సఖి సెంటర్ జిల్లా కేసు సహాయకురాలు మాట్లాడుతూ గ్రామీణా పేదరిక నిర్మూలన సంస్థ హైదరాబాద్, ప్రజ్వల సంస్థ సహకారంతో గ్రామాల్లో ఐకెపి విఒఎ ద్వారా మానవ అక్ర మ రవాణా ను ఎలా అరికట్టవచ్చు అనే అంశంపై లోతైన అవగాహన మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పి ంచడం, నేరాలను అరికట్టడంలో సహాయ సహాకారాలు అందించాలానే అంశంతో ముందుకు వెళ్లడం జరుగుతు ందని, గ్రామ స్థాయిలో గ్రామ సమాఖ్యలు, వి.ఓ.ఏ.లు, పోలీస్ విభాగం, చైల్డ్ లైన్, సఖి సెంటర్ లాంటి వారితో కలిసి పనిచేసి బాధితులకు రక్షించేందుకు ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ కౌన్సిలర్ మధుసూదన్, డిపిఎం వనజ తదితరులు గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికి తెలియజేసి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వనజ, ఎపిఎం వి.గంగాధర్, భాగ్యలక్ష్మి, సిసిలు పి.గంగారాం, బి.రవీందర్, బి.మరియా, పి.విద్యాసాగర్, జి.శ్రీనివాస్, జగిత్యాల అర్బన్, రూరల్ మండలాల అధ్యక్షురాళ్లు యం.సత్తవ్వ, డి.గంగభావని, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

## చివరి ఆయకట్ట వరకూ సాగునీరు చేరేలా చర్యలు

### ఆసుపత్రి మరమ్మతు పనులు సకాలంలో పూర్తి చేయాలి

### - తబిత ఆశ్రమ భవన నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సమర్పించాలి

### విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్‌కోయ శ్రీ హర్ష







ప్రజాపక్షం/గోదావరిఖని : చివరి ఆయకట్టు మంథని వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం, పెద్దపల్లి ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. గోదావరిఖని జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు, ప్రస్తుత ఆసుపత్రిలోని అంతర్గత మరమ్మతు పనులను, రామగుండం వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం, తబితం ఆశ్రమం, పెద్దపల్లి మండలం అప్పన్న పేట వద్ద ఎస్సారెస్పీ కాలువ, పెద్దపెల్లి పట్టణంలోని కూనారం రోడ్ సమీపంలో గల బాల సదనం భవనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో వస్తున్న రోగులు వారికి అందుతున్న సేవలు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఆసుపత్రి భవన నిర్మాణ పనులు, ఆస్పత్రి లోపల చేపట్టిన అంతర్గత మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖనిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమంలో వృద్ధులకు అవసరమైన వస్తువుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రామగుండంలో తబిత ఆశ్రమాన్ని పరిశీ లించి తబిత ఆశ్రమంలో ఆగిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులకు ప్రతి పాదనలు తయారు చేయాలని కలెక్టర్ జిల్లా సంక్షేమ అధికారిను ఆదేశించారు. పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఎస్సారెస్పీ నుంచి విడుదలయ్యే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, చివరి ఆయకట్టు మంథని వరకు సాగు నీరు చర్యలకై అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఉండటానికి వీలు లేదని కలెక్టర్ అధికారులకు సూ చించారు. పెద్దపల్లిలోని బాలసదనం ప్రారంభించిన మూడు నెలల సమయంలోనే 18 మంది పిల్లలు చేరడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. బాల సదనంలోని పిల్లలకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని, అవసరమైన నిధులను ప్రత్యేకంగా మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేణుగోపాల్, ఈఈ నీటి పారుదల శాఖ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### 'ఎఐ' ద్వారా విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన

### పెద్దపల్లి జిల్లాలో 20 పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు

సర్కారు బడిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమమేధ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు చర్యలు చేపట్టామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగుండం మండలం గోదావరిఖనిలోని గాంధీ పార్క్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ మీడియం ఎంపిపిఎస్ స్కూల్, ఇంగ్లీష్ మీడియంలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎ.ఐ విద్యా బోధన కోసం ఆయా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ లను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏ.ఐ) ను వినియోగిస్తూ విద్యార్థులు ఆకట్టుకునేలా సులభ రీతిలో బోధన ప్రారంభించాలని అన్నారు. కాసేపు చిన్నారు లతో ముచ్చటించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యా శాఖ అధికారి డి.మాధవి, ఎఎంఒ డాక్టర్ పిఎం. షేక్, సంబంధిత అధికారులు, ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు,పాల్గొన్నారు.

## జీవ వైవిధ్యం నేటి తక్షణావసరం



### పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల పాత్ర కీలకం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : పిచ్చుకలు పర్యావరణ మిత్రులని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నేడు జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పర్యావరణ పరిరక్షణలో జీవ వైవిధ్యం కాపాడడంలో పిచ్చుకల పాత్ర కీలకమన్నారు. పిచ్చుకలు పర్యావరణానికి స్నేహితులుగా ఉపయోగపడుతూ మానవులకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రపంచ పిచ్చుకల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కేవలం పిచ్చుకలనే కాదు మనతో పాటు ప్రకృతి లోని అన్ని జీవరాశులను రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. పిచ్చుకలు ఐకమత్యంగా ఉంటూ మనుషులకు గొప్ప సందేశాన్ని అందిస్తున్నాయన్నారు. సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి మాట్లాడుతూ చిత్రలేఖనం, పోస్టర్ తయారీ, పిచ్చుక గూళ్ల తయారీ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 201 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఈ కార్యక్రమం 10వ తరగతి పరీక్షల దృష్ట్యా మార్చి 20కి బదులు మంగళవారం నిర్వహించామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సెక్టోరల్ అధికా రులు కర్ర అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, గాజుల రవీందర్, కెఎస్ అనంతాచార్య, వంతడ్పుల ఆంజనేయులు, డాక్టర్ దివ్యలు పాల్గొన్నారు.




### టిబి వ్యాధి పట్ల అప్రమత్తం అవసరం

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : టిబి వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానం ఉన్న వారం తా టిబి పరీక్ష చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ టిబి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మెట్రోసెమ్ సంస్థ ఆధ్వర్యంలో టిబి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమం మొహతాజ్ ఖానాలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికిహాజరైన కలెక్టర్ పమేలా సత్పతి టిబి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశలోనే టిబిని గుర్తించి మందులు వాడితే సులభంగా నయమవుతుందన్నారు. అన్ని ప్రభుత్వా సుపత్రిలోనూ టిబి పరీక్ష అందుబాటులో ఉందని, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి టిబి తొందరగా వ్యాపిస్తుందని, అందువల్ల సమతుల పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమ అమలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ రిజిస్టరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ రవీందర్, ఇమినైజేషన్ ఆఫీసర్ సాజిద పాల్గొన్నారు.

## రెండో రోజూకు అంగన్‌వాడీల ధర్నా




### కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయింపు, ఎఒకు వినతి

ప్రజాపక్షం/జగిత్యాలరూరల్ : ఐసిడిఎస్‌ను నిర్వర్యం చేసే పిఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్‌ను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ఆపాలని, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్, మినీ టీచర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, వీటి కోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తగిన కేటాయింపులు పెంచాలని పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పుప్పాల శ్రీకాంత్‌మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగులు 48గంటలధర్నాలో మేదటి రోజు రాత్రి కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడె రోడ్డు పైన బస చేశారు. 2వ రోజు కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఒకి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో మొబైల్ అంగన్వాడీ సేవల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొస్తుందని, ఇది కూడా ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసే చర్యలేనని అన్నారు. దీనివల్ల అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్, హెల్పర్ అందించే సేవలు ప్రజలకు దూరమవుతాయని, మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ ను ప్రైవేటీకరణ చేయాలని ప్రయత్నం, ఇవన్నీ అమలు జరిగితే రాష్ట్రంలో క్రమంగా ఐసిడిఎస్ బలహీనపడి శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోని ఐసిడిఎస్ ను యదావిధిగా కొనసాగించాలన్నారు. 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందపర్చిన హామీలు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరాటాల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కోమటి చంద్రశేఖర్, అంగన్‌వాడీ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు ఎ.రజిత, కార్యదర్శి గుగ్గిల్ల రజిత, యూనియన్ జిల్లా నాయకులు జయప్రద, స్వప్న, విజయలక్ష్మి, రజిత, సూజత, జ్యోతి, కళావతి, హరిప్రియ, సూరేఖ, సుమలత, రమ, ఆదిలక్ష్మి, వెంకటచారి, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖకు నాచగిరి క్షేత్రం ఆహ్వాన పత్రిక



**ప్రజాపక్షం/గజ్వేల్ :** తెలంగాణ జిల్లాల్లో ప్రసిద్ధ క్షేత్రంగా వెలుగొందుతున్న నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్రంలో ఈ నెల 19వ తేదీ నుండి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. ఈ క్రమంలో మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథ శర్మ నేతృత్వంలో బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రి కొండా సురేఖకు స్వామివారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు సుల్తాన్, మాజీ ఎంపీటీసీ అంజి, అర్చకులు కృష్ణమాచారి, జగన్నాథచార్యులు, గోపాలకృష్ణ శర్మ, హరి శర్మ, సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి నాయకులు దాగం మల్లేష్



**ప్రజాపక్షం/మంచిర్యాల :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. వారి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) జిల్లా నిర్మాణ బాధ్యులు దాగం మల్లేష్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా సిపిఐ కార్యాలయంలో మంగళవారం జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం మూడవ మహాసభల ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులోని నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడకుండా, కేవలం కార్మికులకే ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జాడి పోశం మాట్లాడుతూ మార్చి 28న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో నూతన లేబర్ కార్డుల జారీ, సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, 55 ఏళ్లు పైబడిన కార్మికులకు రూ.3,000 పెన్షన్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, హెల్త్ కార్డులు, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి వంటి పలు డిమాండ్లను నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొనగంటి యోసేపు, శాతం సుమన్, మొగిలి లక్ష్మ ణ్, గాజుల రవికుమార్, గజ్జల తిరుపతి, కొంకుల రాజేష్, బండారి సత్తయ్య,రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర దానంతో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలి : మోతీలాల్



**ప్రజాపక్షం / కాసిపేట :** కాసిపేట మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 100శాతం అక్షరాస్యత సాధించేందుకు మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ, ఓరియంట్ సిమెంట్ కంపెనీ దేవపూర్ సహకారంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా వయోజనులకు చదువు నేర్పేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పుస్తకాలను అందజేశారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో అదనపు పాలన అధికారి మోతీలాల్ ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదలతో అందరికీ చదువు నేర్పించి, అక్షరధానంతో మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. మహిళలు స్వయం ఉపాధి పొందడం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవడానికి ఈ శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య పిడి అడ్మిరా పురుషోత్తం నాయక్, ఎంపిడిఒ సత్యనారాయణ సింగ్, తాసిల్దార్ భోజన్న, ఎంపిఒ షేక్ సఫ్దర్ అలీ, ఎపిఎం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులు



**ప్రజాపక్షం/ సిర్పూర్ (టి) :** మండలం మేడిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రావణపల్లి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31లోపు ఇళ్ల పునాది పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, గ్రామ ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన త్రాగునీరు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎఇను ఆదేశించారు. వేసవికాలం నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాహుల్, సంబంధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిస్పెన్సరీని సందర్శించిన ఎఐటియుసి నాయకులు

**ప్రజాపక్షం/ శ్రీరాంపూర్ :** ఏరియాలోని ఆర్‌కె 8 డిస్పెన్సరిని మంగళవారం ఎఐటియుసి ఏరియా బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు సందర్శించారు. ఆర్‌కె 8 డిస్పెన్సరీ ఫిట్ కార్యదర్శి విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్పెన్సరీలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిస్పెన్సరీలో ఉన్న సమస్యలను జిఎం చర్చల స్ట్రక్చర్ సమావేశంలో పొందుపరిచి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అదనంగా, మహిళా ఉద్యోగుల కోసం ఏరియా స్థాయిలో త్వరలో క్రేచ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఏదైనా సమస్య తలెత్తినప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇంఛార్జ్ జాడి రాజ్ కుమార్, నాయకులు గణేష్, ప్రణయ్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## అగ్రిమెంట్ ప్రకారం రేట్లు అందజేయాలి

ఎఐటియుసి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ డిమాండ్



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సిడబ్ల్యుసి గోదాంలో పని చేస్తున్న హమాలీ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం రేట్లు అందజేయాలని ఎఐటియూసి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. మంగళవారం డబ్ల్యుసి గోదాం ముందు నిరసన తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శ్యామల దేవికు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 సంవత్సరంలో మార్క్‌ఫెడ్, నాఫెడ్ లారీ అసోసియేషన్ అగ్రిమెంట్ ప్రకారం ఎగుమతి ఒక్క బస్తాకు రూ. 13, దిగుమతి ఒక్క బస్తాకు రూ. 4.50పైసలు లారీ అసోసియేషన్ వారి మామూల్ రూ. 1.50 పైసలు ప్రకారం ఇవ్వాల్సి ఉందని, ప్రస్తుతం కాంట్రాక్టర్ రేట్లను తగ్గించే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అగ్రిమెంట్ ప్రకారం రేట్లు అందజేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎఐటియూసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి గోదాం ముకద్దాం ఎస్‌కే దస్తగిరి, సెంట్రల్ హౌసింగ్ కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు అన్నపూర్ణే సాంబాజీ, వసంత్ చౌహాన్, అక్రెవర్ గోపాల్, అబ్దుల్ ఖాలాం, అల్కొండే బందు, అనిల్ పవర్, కె.కపిల్ పాల్గొన్నారు.

## మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ ప్రతినిధి :** ఆదిలాబాద్ పట్టణంలో ని నిషాన్‌ఘాట్, వీకర్ సెక్షన్ కాలనీలో మౌలిక వసతులు ఏ ర్పాటు చేయాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కాలనీ వాసులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 2వ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నిషాన్‌ఘాట్, న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా రోడ్డు, కరెంటు,తాగు నీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాలనీవాసుల సమస్యలను విన్న కలెక్టర్ స్పందించి న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో ఒక వాటర్ ట్యాంక్, ఒక బోరు మంజూరుకు అధికారులకు ఆదేశించాడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. దీంతో పాటు నిషాన్‌ఘాట్ కాలనీలో కూడా సమస్యలు పరిష్కారించాలని కోరారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఖండాల గణేష్, ప్రధాన కార్యదర్శి అర్గంగి రమేష్, నాయకులు మహబూబ్ ఖాన్, సలీం ఖాన్, సబియా సుల్తానా, మున్నాబీ, నగ్మా సుల్తానా, గిరిజబాయ్ లాడే, వైశాలి రాజ్‌పుత్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతంగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోండి : జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



**ప్రజాపక్షం/రామాయంపేట :** అనదికార లే అవుట్ ప్లాట్లు క్రమబద్దీకరించే ఉద్దేశ్యంతో 2020 సంవత్సరంలో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31 2025 లోగా క్రమబద్దీకరించి రుసుము చెల్లించిన వారికి 25శాతం రాయితీ లబిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన క్రమంలో జిల్లాలో లే అవుట్‌లను క్రమబద్దీకరణకు చొరవ చూపుతున్నారని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22000 దరఖాస్తులు క్రమబద్దీకరణ రుసుము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాయని, హౌస్ ఓనర్స్‌కు మెసెజ్ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగునంగా పనిచేయాలని దిశానిర్ధేశం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలులో పలు వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్‌ఆర్‌ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగకుండా రెగ్యులరైజేషన్ కోసం సంబందించి ఏదేని సలహాలు కొరకు మున్సిపల కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు.

### తాగునీటి సరఫరాకు పటిష్ఠ చర్యలు...

మున్సిపాలిటి పరిదిలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమీషనర్ దేవేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారు నిర్దేశి త గడువులోపు, నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో నిర్మాణ పనులు పూ ర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలన్నారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మం డలం జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ మంగళవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. గ్రామం లో ఎన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని వివరాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఎడపల్లిలో బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో కిచెన్, డైనింగ్ హాల్, స్టోర్ రూంలను సందర్శించి బియ్యం, కూరగాయాలు, పప్పు, దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో వంట చేసేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



## ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల జీవన విధానంలో మార్పులు రావాలి



**ప్రజాపక్షం / బాన్సువాడ :** విద్యార్థులకు చిన్ననాటి నుండి పౌష్టికాహారాన్ని అలవాటు చేసేందుకు వాసవి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం ఫుడ్ ఫెస్టివల్ ద్వారా గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని వాసవి పాఠశాలలో ఫుడ్‌పెస్టివల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో 220 రకాల ఆహార పదార్తాలను నిప్పులేకుండా తయారుచేయడం ఎంతో అభినందనీయమని, ఆరోగ్యవంతమైన జీవితం కోసం శాఖాహారంతో పాటు విటమిన్లు కలిగిన పదార్తాలను తీసుకోవడం వల్ల ఎలాంటి అనారోగ్యాలు దరిచేరవన్నారు. ఈ సందర్భంగా ఆవరణలో ఏర్పాటు చేసిన ఫుడ్‌ఫెష్టివల్ ప్రదర్శనను సందర్శించి పలు పదార్థాలను ఆయన రుచి చూసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు వి ద్యాశాఖాధికారి నాగేశ్వరరావు, అనంతాచార్యులు, సాయిలును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాయిలు, పాఠశాల ఛైర్మన్ నాగులగామ గోపినాథ్, నిర్వాహకులు నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేత, కరస్పాండెంట్ విజయ్ కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఎల్‌ఆర్‌ఎస్ 2020 పథకంలో రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం బురుగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్‌తో కలిసి ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు చేసుకొని క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ కల్పించే అవకాశాన్ని అందించిందని, దాన్ని ప్రజలు వినియోగించుకోవాలనే విషయంపై అవగాహన కల్పించాలన్నారు. నూతన ఇంటి నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించడం తప్పనిసరిగా అవసరమని, తద్వారా బ్యాంకు రుణ సదుపాయం పొందవచ్చని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో 78 మంది దరఖాస్తుదారుల్లో కేవలం ముగ్గురు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా చెల్లించారని, మిగిలిన అభ్యర్థులు ఈ నెల 31లోపు రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణను పరిశీలించారు. మొక్కల పెంపకంపై అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని, విత్తనాల అభివృద్ధి, మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటేందుకు మరో రెండు నెలల గడువు ఉన్నందున నర్సరీల్లో విత్తనాలు త్వరగా మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మౌనిక, ఇజిఎస్ ఎపిఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత సహా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో... కెసిఆర్ మల్లన్న సాగర్ సమస్యలపై మాట్లాడాలి

కెసిఆర్‌కు నిర్వాసిత గ్రామాల యువకుల బహిరంగ లేఖ

**ప్రజాపక్షం/గజ్వేల్ :** మల్లన్న సాగర్ ముంపు గ్రామాల సమస్యలను మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీలో లేవనెత్తాలని నిర్వాసిత గ్రామాల యువకులు మంగళవారం బహిరంగ లేఖ రాశారు. భూ సేకరణ సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసే క్రమంగా స్పందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అయితే గత డిసెంబర్ 16వ తేదీన మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామాల సమస్యలపై కెసిఆర్‌కు లేఖ రాసినప్పటికీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెసిఆర్ ఫలితం గానే తాము నట్టేట మునగగా, తమను అనాథలుగా వదిలిపెట్టడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మాజీ మంత్రి హరీష్ రావు ఫిబ్రవరి 7వ తేదీన సిఎం రేవంత్ రెడ్డికి తమ సమస్యలపై లేఖ రాయగా, ప్రతినిత్యం అసెంబ్లీకి వెళ్తు న్న ఆయన మరి ముంపు గ్రామాల సమస్యలపై ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ అక్రమాలు బయటపడతాయనే హరీష్ రావు అసెంబ్లీలో లేవనెత్తడం లేదని తాము భావించాల్సి వస్తుందని తెలిపారు. అలాగే రంగనాయక సాగర్, అనంతగిరి ప్రాజెక్టు నిర్వాసితుల ఇబ్బందులపై సిఎం రేవంత్ రెడ్డికి ఎందుకు లేఖ రాయలేదని నిడదీశారు. నమ్మించి మోసగించిన కెసిఆర్, హరీష్ రావు, వెంకట్రాంరెడ్డిలు ఆర్ అండ్ ఆర్ కాలనీ సందర్శించి చేసిన పాపాలు కడుక్కోవాలని కోరారు. ఇప్పటికైనా అసెంబ్లీలో తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో బాధితులతో కలి సి ఎర్రవల్లి లోనికెసిఆర్ ఫాంహౌజ్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏటిగడ్డ కిష్టాపూర్, లక్ష్మాపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, రాంపూర్, వేముల ఘాట్, పల్లె పహాడ్, ఎర్రవల్లి, సింగారం గ్రామాల యువత పాల్గొన్నారు.



# బిసి,ఎస్‌సి రిజర్వేషన్ బిల్లు ఆమోదం చరిత్రాత్మకం

తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** అసెంబ్లీలో బిసి బిల్లు ఆమోదింపచేయడం చారిత్రాత్మక నిర్ణయం కాగా, రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభోత్సవానికి కృతజ్ఞతగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం గజ్వేల్‌లో సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ వ్యవసా య మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో సామాజిక న్యాయం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటూ పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా బిసి బిల్లు ఆమోదంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో ప్రాధాన్యత దక్కనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఎస్‌సి వర్గీకరణకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతుండగా, అట్టడుగున నిలిచిన దళిత సమాజం ఆర్థికంగా, విద్యాపరంగా, రాజకీయంగా ముందుండాలని సిఎం రేవంత్ రెడ్డి కాంక్షిస్తున్నట్లు చెప్పారు. అలాగే తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు తీర్మానించగా, చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు పేరును ప్రతిపాదిస్తున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యువతను తీర్చిదిద్దే క్రమంలో రాజీవ్ యువ వికాసం పథకంతో వివిధ రకాల ప్రోత్సాహకాలతో ఆర్థికంగా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీ నివాస్ గుప్త, కరుణాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, డాక్ట ర్ వహీద్, యాదగిరి, నేతలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు డిఎలను వెంటనే విడుదల చేయాలి

టిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడ్డ నాలుగు విడతల డిఎలలో రెండు డిఎలు తక్షణమే విడుదల చేయాలని టిఎన్‌జిఒ మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిఎన్‌జిఒ భవన్‌లో పంచాయతీ కార్యదర్శుల ఫోరం బాధ్యులు సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు గత మూడు సంవత్సరాలుగా పెరిగిన నిత్యవసర ధరల కనుగుణంగా రావలసిన డిఎల పెరుగుదల కోసం ఎదురుచూస్తూ నిరాశ నిస్పృహలతో మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరుతో ఉద్యోగులు వేతనాలు పొందడం లేదని ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన పేద ప్రజలకు అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కీర్తి ప్రతిష్టలు పెంచే విధంగా ఉద్యోగులు తాపత్రయ పడుతున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నూతనంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్ర పునర్నిర్మానికై ఉద్యోగులు రెండు గంటలు అదనంగా ప్రభుత్వ సమయానికి నిమిత్తం లేకుండా పనిచేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. విధి నిర్వహణలో అంకితభావంతో అదనంగా ఇప్పటికైనా పనిచేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. లక్షల మంది విద్యార్థులతో ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలలో మెరిట్ సాధించి ఉద్యోగం సంపాదించి ప్రజలకు సేవ చేస్తూనే వేతనం తీసుకుంటున్న సగటు ఉద్యోగిని విస్మరించడం తగదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదమే ఉద్యోగుల పక్షపాతిగా పేర్కొంటున్న నూతన ప్రభుత్వం పునరావృతం చేయకుండా ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి చూపి వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని తెలియజేశారు. అంతకుముందు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సందిల బలరాం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కార్యదర్శులు తమ వేతనంలో నుంచి డబ్బులు వెచ్చించి ప్రభుత్వం వద్ద బిల్లులు సమర్పించి సంవత్సరాలుగా వేచి చూడడం ఇబ్బందిగా మారిందని అన్నారు, పెండింగ్ లో ఉన్న కార్యదర్శులు గ్రామాభివృద్ధి కోసం వెచ్చించిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్ తో కలిసి పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరణ కాపాడిన ఉద్యోగులకు సభ్యత్వనమోదును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో తూప్రాన్ యూనిట్ అధ్యక్షులు శంకర్ గౌడ్, ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్, రాకేష్, లింగప్ప, రవి, రజిత, రమేష్, నవీన్, శ్రీకాంత్, వెంకటరామిరెడ్డి, తదితర పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా రోడ్డు తవ్వకాలు..

అధికారుల ఆదేశాలను సైతం పట్టించుకోని సదరు వ్యక్తి..

ఫిర్యాదు చేయడానికి అధికారుల తర్జన భర్జన



**ప్రజాపక్షం/ముథోల్:** మండలంలోని ఎడ్బిడ్ గ్రామంలో మాజీ ప్రజాప్రతినిధైన ఓ వ్యక్తి అనుమతులు లేకుండా రోడ్డు తవ్వకాలు జరిపి స్థానిక ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. గ్రామంలో ప్రవేశించడానికి రెండు రోడ్లు ఉండగా ఇప్పటికే ఒక రోడ్డు నిర్మాణం పూర్తయి క్యూరింగ్ దశలో ఉంది. రాకపోకలు చేయడానికి ప్రజలకు ఇంకో రోడ్డు ఉన్న ఆ రోడ్డునే సదరు వ్యక్తి ఎవరి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపారు. ఈ తతంగం గత మూడు రోజులుగా జరుగుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.రోడ్డు తవ్వకాల్లో మిషన్ భగీరథ పైప్‌లు పగిలి నీరంతా రోడ్డుపై నిలవడంతో కొన్ని వాహనాలు రోడ్డుపై దిగబడ్డాయని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయమై మిషన్ భగీరథ సిబ్బంది వారికి గ్రామస్తులు తెలియజేయగా పైప్ లైన్ ను సరిచేసి నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు. మూడు నుండి ఐదు ఫీట్ల వరకు రోడ్డు తవ్వకాలు జరిపి రోడ్డు పక్కన ఉన్న ఇళ్ల వారికి ఇబ్బందులు సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే విషయం స్థానిక ఎమ్మెల్యే అయిన పవార్ రామారావు పటేల్ అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించారు. పక్కన నిర్మించిన రోడ్డు క్యూరింగ్ అయ్యేవరకు ఆపాలని పలువురు విన్నవించిన ఆ వ్యక్తి వినకుండా ఇష్టానుసారంగా వ్యవహరించాడన్నారు. కక్షపూరితంగానే రోడ్డు తవ్వకాలు జరిపాడని కొందరు గ్రామస్తులు సదరు వ్యక్తి తీరును వెళ్లబుచ్చారు.రోడ్డు తవ్వకాలు జరిపిన వ్యక్తి ఇదే విసయమై తానేమి కావాలని చేయలేదని రోడ్డు ఎత్తయి అక్కడున్న ఇళ్లలోకి నీరు చేరుతుందని పలువురు కోరగా రోడ్డును చదును చేయడం జరిగిందని పంచాయతీ రాజ్ ఇఇకి వినతిపత్రం అందించినట్లు సోషల్ మీడియాలో పెట్టారు. ఇదే విషయం పంచాయతీరాజ్ డిఇ కమలాకర్, ఎఇ సురేందర్‌లను వివరణ కోరగా నిజానికి తవ్వకాలు జరిపిన రోడ్డు నిర్మానానికి ప్రభుత్వం ప్రొసిడింగ్ అందించిన నిర్మాణం చేపట్టాలని ఎలాంటి అనుమతులు జారీ కాలేవనీ తెలిపారు.అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్న అధికారులు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారని.అడగ్గా సమాధానం ఇచ్చే బదులు దాటవేస్తూ తమ పని రోడ్డు నిర్మాణం చేపట్టడం వరకేనని అది స్థానిక గ్రామ పంచాయతీ ఆధీనంలోనే ఉంటుందని తెలుపుతున్నారు. ఇదే విషయం స్థానిక పంచాయతీ కార్యదర్శి అయిన శివారెడ్డిని అడగగా తమ ఆధీనంలో లేదని ఆయన నెట్ట వేసుకుంటున్నాడు.రోడ్డు తవ్వకానికి ఎలాంటి అనుమతులు లేవని చెబుతూనే ఇలా అధికారులు తర్జనభర్జన పడుతూ ఒకరిపై ఒకరి నెట్టవేసుకుంటున్నారంటే సదరు వ్యక్తి బలం ఎంత వరకుందో మరి.ఈ సమస్యపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేక మౌనం వహిస్తారో చూడాలి...

## క్రీడ

# విరాట్ కోహ్లీకి కపిల్ దేవ్ అండ



బీసీసీఐ మ్యాచ్‌ల సమయంలో ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులతో కలిసి ఉండే విషయంలో కొన్ని పరిమితులు తీసుకొచ్చింది. వీటికి వ్యతిరేకంగా కోహ్లీ వ్యాఖ్యలు చేశాడు. ఈ విషయంలో విరాట్‌కు క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ తన మద్దతు తెలిపాడు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భారత జట్టు పేలవ ప్రదర్శన చేసింది. ఆ తర్వాత నుంచి బీసీసీఐ భారత ఆటగాళ్ల విషయంలో పలు ఆంక్షలు విధించింది. గతంలో కుటుంబసభ్యులు ఆటగాళ్లతో 45 రోజుల వరకు ఉండటానికి అనుమతి ఉండేది. కానీ ఆ వెసులుబాటును టూర్ ప్రారంభమయ్యాక మొదటి రెండువారాలకే పరిమితం చేశారు. ఈ కొత్త నియమంపై ఆర్సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్ సందర్భంగా కోహ్లీ మాట్లాడాడు. సుదీర్ఘ పర్యటనలకు వెళ్లినప్పుడు క్రీడాకారులు తమతో కుటుంబసభ్యులు కూడా ఉండాలని కోరుకుంటారు. ముఖ్యంగా కఠిన సవాళ్లు ఎదురైనప్పుడు కుటుంబంతో కొంత సమయం వెచ్చిస్తారన్నాడు. ఇది ఆటగాళ్లలో మరింత బాధ్యతను తీసుకువస్తుందన్నాడు. 'మీరు క్రికెట్ టూర్ల సమయంలో కుటుంబంతో కలిసి ఉండాలని కోరుకుంటారా? అని ఎవరైనా ఆటగాణ్ని అడితే.. అతను అవును అనే సమాధానమే ఇస్తాడు. నేనైతే నా గదిలోకి వెళ్లి, ఒంటరిగా విచారంగా గడపాలి అని మాత్రం కోరుకోను. కుటుంబంతో ఉంటేనే ఆటలో మరింత బాధ్యతగా ఉండగలం' అని కోహ్లీ వివరించాడు. విరాట్ ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్ కోసం సన్నద్ధమవుతున్నాడు.

### 'ఆట.. కుటుంబం కలిసే ఉండాలి'

గ్రాంట్ థోర్న్టన్ ఇన్విటేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ మాట్లాడారు. ఆటగాళ్లకు వారి జట్టుతో పాటు కుటుంబం కూడా అవసరమే అని అన్నారు. తమ కాలంలో పర్యటనల్లో క్రికెట్, కుటుంబానికి సమాన ప్రాధాన్యం ఇచ్చేవారమని గుర్తు చేసుకున్నారు. 'క్రికెట్ బోర్డు ఇలా పిలుపు ఇచ్చింది అని అనుకుంటున్నాను. ఆటగాళ్లకు కుటుంబం తమతో ఉండటం అవసరమే. అదే సమయంలో జట్టుకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. మా కాలంలో మేం మొదట జట్టుగా ఆడేవాళ్లం, తర్వాత నెమ్మదిగా మా కుటుంబాలు వచ్చేవి. అలా ఆట, కుటుంబం కలిసిపోయి ఉండేవి' అని కపిల్ దేవ్ అన్నారు.

## కోహ్లీ ఘాటు వ్యాఖ్యలు.. దిగొచ్చిన బిసిసిఐ!

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ దెబ్బకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) దిగొచ్చింది. విదేశీ పర్యటనల్లో ఆటగాళ్ల కుటుంబ సభ్యులను అనుమతించడంపై ఆంక్షలు విధిస్తూ బీసీసీఐ నయా రూల్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ నిబంధనపై విరాట్ కోహ్లీతో పాటు ఇతర సీనియర్ ఆటగాళ్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ రూల్‌ను సవరించేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఆ సవాల్‌కు సిద్ధమే

ఐపిఎల్ 2025లో కోల్‌కతా నైట్‌రైడర్స్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. గత సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో టైటిల్ సాధించిన కోల్‌కతా.. గత మెగా వేలంలో శ్రేయస్‌ను రిటైన్ చేసుకోలేదు. రూ.1.50 కోట్లకు దక్కించుకున్న సీనియర్ ఆటగాడు అజింక్య రహానెకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. గతంలో రహానెకు కేకేఆర్ తరఫున ఆడిన అనుభవం ఉంది. తనకు సారథ్య బాధ్యతలు అప్పగించడంపై రహానె సంతోషం వ్యక్తంచేశాడు. కేకేఆర్‌కు కెప్టెన్‌గా ఉండటం తనకు గర్వకారణమని పేర్కొన్నాడు. టైటిల్ నిలబెట్టుకోవడం సవాల్‌తో కూడుకున్నదని, ఆ సవాలుకు తాము సిద్ధంగా ఉన్నట్లు కేకేఆర్ కెప్టెన్ తెలిపాడు. 'ఈ అద్భుతమైన ఫ్రాంఛైజీకి కెప్టెన్‌గా ఉండటం నాకు గర్వంగా ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. కెప్టెన్సీ అనేది సవాలుతో కూడుకున్నది. మేం గత సీజన్‌లో టైటిల్ సాధించాం. దాన్ని నేనెప్పుడూ సాధారణ విషయంగానే చూస్తా. చంద్రకాంత్ సర్ (హెడ్ కోచ్) ముంబయి కోచ్‌గా ఉన్నప్పుడు కలిసి పనిచేశాం. ఆయన ఎలాంటి పద్ధతులు పాటిస్తాడో నాకు తెలుసు. చాలా క్రమశిక్షణతో, ఫోకస్‌తో ఉంటాడు. ప్రతిఒక్కరి నుంచి ఉత్తమ ప్రదర్శన ఎలా రాబట్టాలో ఆయనకు తెలుసు. మా ఆటగాళ్లతో నాకు మంచి కమ్యూనికేషన్ ఉంది. మైదానంలో తమ భావాలను వ్యక్తీకరించడానికి వారికి స్వేచ్ఛనిస్తా. అందరినీ అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తా. మళ్లీ టైటిల్‌ను కాపాడుకోవడం సవాలుతో కూడకున్నదే. కానీ, మళ్లీ విజేతగా నిలిచేలా మేం ఆడతాం. ఈ సీజన్‌లో మేం కచ్చితంగా ఉత్తమంగా రాణిస్తాం' అని రహానె వివరించాడు. ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే ఆరంభ పోరులో కోల్‌కతా, బెంగళూరు జట్లు తలపడనున్నాయి.



అజింక్య రహానె

## రీల్

# కూలీలో ఆ స్టార్ హీరో రోల్ సస్పెన్స్?



ప్రస్తుతం సౌత్ సినిమా నుంచి భారీ హైప్‌లో పలు అవైటెడ్ చిత్రాల్లో సూపర్ స్టార్ రజినీకాంత్ అలాగే యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ కలయికలో చేస్తున్న భారీ చిత్రం కూలీ కూడా ఒకటి. మరి ఈ సినిమాలో కింగ్ నాగార్జున, రియల్ స్టార్ ఉపేంద్ర అలాగే మళయాళ సహా తమిళ్ నుంచి మరింత మంది స్టార్స్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. అయితే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ నటుడు అమీర్ ఖాన్ కూడా ఉన్నారు అని ఆల్రెడీ టాక్ ఉంది. కానీ తనని మాత్రం మేకర్స్ సస్పెన్స్‌గానే ఉంచుతున్నారని చెప్పాలి. సినిమాకి సంబంధించి వదులుతున్న ప్రమోషనల్ కంటెంట్‌లో తన విజువల్స్ చూపించకుండా జాగ్రత్త పడుతున్నారు. అయితే మొన్న లోకేష్ కనగరాజ్ తో డిస్కషన్‌లో ఉన్నట్టు ఓ పిక్ బయటకి వచ్చింది కానీ అది కూలీ సెట్స్ నుంచే అని చెప్పడానికి లేకుండా పోస్ట్ చేశారు. ఇలా ఈ స్టార్ హీరో విషయంలో మాత్రం మేకర్స్ అమీర్ ప్రెజెన్స్ ఉన్నట్టే చూపించడం లేదు. మరి తాను ఉన్నారా లేదా అనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్ గానే కొనసాగుతుంది.



# 'కల్కి2' పై అదిరే అప్‌డేట్

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. గతేడాది విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ప్రేక్షకులు అందరూ 'కల్కి2' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో పార్ట్2పై దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అసలు ప్రాజెక్ట్K అంటే ఏంటి అనే దగ్గరే ఉన్నాం. అది పూర్తయిన దాని బట్టి షూటింగ్ మొదలుపెడతాం. ఈ ఏడాది చివరి నాటికి సెట్స్‌పైకి వెళ్లే ప్రయత్నం చేస్తాం. 'కల్కి'లో మహాభారతం నేపథ్యాన్ని సెట్ చేసుకుని, సుమతి, అశ్వత్థామ పాత్రలను డిజైన్ చేసుకుని ఇక్కడి వరకూ వచ్చాం. ప్రభాస్ స్క్రీన్ ప్రజెన్స్ పార్ట్2లో కచ్చితంగా ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా భైరవ, కర్ణ యాంగిల్‌లోనే కథ సాగుతుంది. రెండో భాగంలో వీటికి అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఇందుకు చాలా వర్క్ చేయాల్సి ఉంది. విడుదల తేదీపై ప్రస్తుతం స్పందించలేను. ఇప్పటివరకూ ఎవరూ ప్రయత్నించని కాన్సెప్ట్‌లనే ఎంచుకుని సినిమాలు చేశా విలేకరుల సమావేశంలో నాగ్ అశ్విన్ తెలిపారు. ప్రభాస్‌ను వరుస డేట్స్ అడిగినట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాదు, సినిమా పూర్తయ్యే వరకూ మరో మూవీకి వెళ్లకూడదని కండీషన్ పెట్టారట. ఎంత వేగంగా తీసినా ఈ ఏడాది చివరి నాటికి కానీ, ప్రభాస్ 'స్పిరిట్' నుంచి బయట పడలేరు. ఈలోగా నాగ్ అశ్విన్ 'కల్కి2' ఫుల్ స్క్రిప్ట్‌ను రెడీ చేసుకోవడంతో పాటు, పార్ట్2లో ఇతర పాత్రలకు సంబంధించి కొంత షూటింగ్ పూర్తి చేయాలని భావిస్తున్నారు.



# మరోసారి అలాంటి పాత్ర వస్తే నో చెప్పను

### షాలినీ పాండే

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'అర్జున్ రెడ్డి' సినిమా మంచి స్పందనను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రీతి పాత్రలో నటి షాలినీ పాండే అందరినీ మెప్పించారు. అయితే ఆ సినిమాలోని నటీనటుల పాత్రలను కొందరు విమర్శించారు. హీరోయిన్ పాత్ర బలహీనంగా ఉందని కొందరు పోస్ట్‌లు పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో షాలినీ మాట్లాడుతూ అలాంటి పాత్ర మరోసారి వస్తే అంగీకరిస్తారా అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'డబ్బా కార్టెల్' సిరీస్‌లో బలమైన మహిళగా కనిపించిన తర్వాత కూడా షాలినీ మరోసారి 'అర్జున్ రెడ్డి' లాంటి సినిమాను అంగీకరిస్తారా అనే ప్రశ్నకు స్పందిస్తూ.. "నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో నటించిన సినిమా అది. ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తోంది. నా పాత్ర మరింత బలంగా చేయొచ్చేమో అని అనుకుంటున్నా. మరోసారి అలాంటి పాత్ర వస్తే నో చెప్పను. దానిపై మరింత అవగాహన పెంచుకొని నటిస్తాను. అప్పటికంటే ఇప్పుడు నటిగా పరిణితి చెందాను కాబట్టి భిన్నంగా చేయడానికి ప్రయత్నిస్తాను. నిజాయతీగా చెప్పాలంటే దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకొని అంగీకరిస్తా" అని చెప్పారు.

# భీకరదాడులు

(మొదటి పేజీ తరువాయి)

వర్గాలు ధృవీకరించాయి. అతడితోపాటు మరో నలుగురు ప్రభుత్వ నిర్వాహకులు మరణించారు. దాడుల్లో గాయపడిన వారిని నస్సెర్, యూరోపియన్ యూనియన్ ఆసుపత్రులకు తరలించారు. మృతుల బంధువులు శవాలముందు కూర్చుని గుండెలు పగిలేట్టు రోదిస్తున్నారు. గాజా కాలమానం ప్రకారం మంగళవారంనాడు రమదాన్ భోజనానికి ముందుగా తెల్లవారుజామున రెండు గంటలకు ఇజ్రాయెల్ దాడులు మొదలయ్యాయి. హమాస్ నడిపిస్తున్న గాజా ప్రభుత్వ ఆరోగ్యమంత్రిత్వశాఖ ఈ మేరకు ప్రకటన చేసింది. హమాస్ స్థావరాలను, ఇస్లామిక్ జీహదీ ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని విస్తృత దాడులు కొనసాగుతున్నాయని ఇజ్రాయెల్ సైన్యం చెప్పింది. మరోవైపు శిథిలాల అడుగున చిక్కుకుని సజీవంగా ఉన్నవారికోసం సహాయ బృందాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేస్తున్నాయి. యుద్ధ ప్రాంతాన్ని ఖాళీచేయాలని సైన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రజలు ఎటు వెళ్ళాలో తెలియక దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. ఖాన్ యూనుస్‌కుగానీ, గాజాసిటీ పశ్చిమ ప్రాంతాలకు గానీ తరలివెళ్ళిపోవాలని పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ ఆదేశించింది. గాజాలో ప్రతి ఆరు, ఏడు సెకన్లకు ఒక పేలుడు సంభవిస్తోందని ఐక్యరాజ్యసమితి సహాయబృంద సభ్యుడు ఒకరు చెప్పారు. గాజాలో బందీలందరినీ విడుదల చేయాలని, కాల్పుల విరమణ కొనసాగించాలనీ అడిగినా హమాస్ తిరస్కరించడంతో విసుగెత్తి మరో మార్గంలేక యుద్ధాన్ని పునఃప్రారంభించినట్లు ఇజ్రాయెల్ విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఓరెన్ మార్మోర్‌స్టెయిన్ ప్రకటించారు. బందీలందరినీ విడుదల చేసేవరకూ తమ పోరాటం కొనసాగుతుందని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ చెప్పారు. గాజాపై తిరిగి యుద్ధం ప్రారంభించేముందు అమెరికాకు ఆ విషయాన్ని ఇజ్రాయెల్ తెలియజేసిందని అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. అమెరికాకు చెప్పిన తర్వాతే ఈ దాడులు మొదలయ్యాయి. 17నెలల యుద్ధంలో 45 రోజులు మాత్రమే కాల్పుల విరమణ అమలు జరిగింది. అమాయకులైన, ఎలాంటి రక్షణాలేని, నిరాయుధులైన పాలస్తీనా ప్రజలను ఇజ్రాయెల్ చంపుతోందనీ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని తల్లకిందులు చేసేసిందనీ, తక్షణం ఈ విషయంలో భద్రతా మండలి జోక్యం చేసుకోవాలని ఐక్యరాజ్యసమితికి హమాస్ సంస్థ విజ్ఞప్తి చేసింది. బందీలను విడుదల చేయాలని ఎన్నిసార్లు అడిగినా హమాస పదే పదే తిరస్కరించిందనీ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు వ్యతిరేకించిందనీ నేతన్యాహూ కార్యాలయం తెలియజేసింది. ఇక మరింత ఉద్ధృతస్థాయిలో తమసైన్యం ప్రతిస్పందిస్తుందని నేతన్యాహూ ప్రకటించారు. హమాస్‌వద్ద ఇంకా 59 మంది బందీలు ఉన్నారు. ఐతే వీరిలో కేవలం 24 మంది మాత్రమే సజీవంగా ఉండి ఉంటారని కూడా అంచనావేస్తున్నది. బందీల కుటుంబాలన్నీ ఒక సంఘంగా ఏర్పడి ప్రభుత్వంతో మంతనాలు చేస్తున్నాయి. బందీల ప్రాణాలను పణంగాపెట్టిన ఇజ్రాయెల్ ప్రభుత్వం తాజాగా గాజాపై దాడులు ప్రారంభించిందనీ, వారి ప్రాణాలను త్యాగం చేసిందనీ బందీల కుటుంబాల సంఘం విమర్శిస్తున్నది. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవడానికి విస్తారంగా జరిపి చర్చలు, చేసిన ప్రయత్నాలు విఫలం కావడంవల్ల, బందీలందరినీ విడుదల చేయాలని కోరుతూ తాము తిరిగి యుద్ధం ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందానికి కాలం చెల్లిందనీ, దానిని వదిలేశామని ఇజ్రాయెల్ రక్షణ దళాల (ఐడిఎఫ్) నాయకుడు ప్రకటించారు. కైరో,దోహాలలో అనేక నెలలుగా మధ్యవర్తులు చేసిన కృషి ఫలితంగా ఎట్టకేలకు ఈ ఏడాది జనవరి 19న ఇజ్రాయెల్–హమాస్ మధ్య 45 రోజుల మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముక్కుతూ మూల్గుతూ అమలు జరిగింది. ఈ విరమణ సమయంలో అటు హమాస్, ఇటు ఇజ్రాయెల్ సైన్యం అనేకసార్లు ఉల్లం ఘన చర్యలకు పాల్పడ్డారు. ఈ విరమణ సమయంలో 25 మంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ స్వాధీనం చేయగా, 1900 మంది పాలస్తినా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేసింది. మార్చి 1వ తేదీతో ముగిసిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలని ఇజ్రాయెల్ పట్టుప ట్టింది. కానీ తిరిగి చర్చలు జరగాలని హమాస్ భీష్మించింది. దీంతో రెండోదశ కాల్పుల విరమణ అమలులో తీవ్ర జాప్యం జరిగింది. ఆ తర్వాత అమెరికా చొరవతో కైరోలో ఇజ్రాయెల్–హమాస్ మధ్య చర్చలు జరిగాయి. ఐతే హమాస్ అలవికాని, అమలు సాధ్యం కాని గొంతెమ్మ కోర్కెలు కోరుతోందని పేర్కొంటూ అమెరికా మధ్యవర్తులు వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ఈ చర్చలు అర్థాంతరంగా ఆగిపోయాయి. దీంతో చర్చలు విఫలమైనట్లు అమెరికా ప్రకటించింది. మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని చర్చలు లేకుండా గుడ్డిగా కొనసాగించాలని ఒత్తిడి చేస్తూ ఇజ్రాయెల్ సైన్యాలు గాజాలోకి ఎలాంటి మానవతా సహాయాన్ని రానివ్వకుండా అడ్డుకున్నాయి. గడచిన 15 రోజులుపైగా గాజాలోకి ఆహారం, ఇతర మానవతా సహాయం ప్రవేశించకుండా ట్రక్కులను ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. దీంతో గాజాలో దాదాపు కరువు పరిస్థితులు విలయతాండవం చేయడం ప్రారంభించాయి. దీంతో ఇజ్రాయెల్ మద్దతుగల హౌతీ ఉగ్రవాదులు గాజా ప్రజలకోసం రంగంలోకి దిగారు. గాజాలోకి మానవతా సహాయాన్ని కొనసాగించాలనీ, ఇజ్రాయెల్ వెంటనే మానవతా సహాయ సరఫరాలను అడ్డుకునే చర్యలు మానుకోవాలని అప్పటి వరకూ ఎర్రసముద్రంలో తిరిగి దాడులు కొనసాగుతాయనీ హౌతీలు ప్రకటించారు.

### గాజాలో హింసకు పూర్తి బాధ్యత అమెరికాదే

గాజాలో హింసకు అమెరికాయే పూర్తి కారణమని హమాస్ సంస్థ విమర్శించింది. మంగళవారం తెల్లవారుజామున గాజాపై ఇజ్రాయెల్ తిరిగి దాడులు ప్రారంభించాక హమాస్ ఒక ప్రకటన చేస్తూ, ఇజ్రాయెల్‌కు పూర్తి నైతిక, ఆయుధ శక్తిసామర్థ్యాలను సమకూర్చి వెనకనుండి అమెరికా ప్రభుత్వమే గాజాలో హింసాకాండకు కారణమైందని విమర్శించింది. గాజాలో ఊచకోతలకు అమెరికా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని హెచ్చరించింది. ఆర్థిక, రాజకీయ మద్దతు ఇవ్వడం ద్వారా ఇజ్రాయెల్‌ను పురిగొల్పి గాజాను అమెరికా నాశనం చేసిందని విమర్శించింది. పాలస్తీనియన్లను వెళ్ళగొట్టి గాజాను ఆక్రమించేందుకు నేరపూరిత చర్యలకు అమెరికా పాల్పడుతోందని ఆరోపించింది. అమెరికా భాగస్వామ్యంతోనే ఇదంగా జరుగుతోందని ఇప్పుడు రుజువైందని హమాస్ అధికార ప్రతినిధి అబ్దుల్ లతిఫ్ అల్ క్వానుయా టెలిగ్రామ్ ద్వారా ఒక సందేశం విడుదల చేశారు.

### ప్రపంచదేశాల ఖండన

గాజాపై ఇజ్రాయెల్ దాడులు పునఃప్రారంభించడాన్ని ప్రపంచదేశాలు ఖండించాయి. చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ స్పందిస్తూ, ఇది చాలా తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. పరిస్థితి చేయిదాటిపోయే చర్యలను అన్ని వైపుల నుండీ అందరూ మానుకోవాలని ఆమె అన్నారు. చర్చల ద్వారా పరిష్కారం సాధించాలన్నారు. రష్యా అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ ఇజ్రాయెల్ చర్యవల్ల మరో విడత ఉద్రిక్తతలు మొదలయ్యాయన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఇజ్రాయెల్ చర్యపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాల్పుల విరమణను గౌరవించాలని కోరారు. బెల్జియం ఉపప్రధానమంత్రి మాగ్జిమ్ ప్రివోట్ ఇజ్రాయెల్ చర్యను ఖండించారు. ప్రతిఒక్కరూ కాల్పుల విరమణ ఒప్పందానికి కట్టుబడి ఉండాలనీ, దానినుండి వెనక్కు మళ్ళకూడదనీ అన్నారు. ఆస్ట్రేలియా విదేశాంగమంత్రి పెన్నీ వోంగ్ స్పందిస్తూ, ప్రజలందరికీ గాజాలో రక్షణ ఇవ్వాలనీ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని కాపాడాలని కోరారు.




సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమిపైకి రానున్న నేపథ్యంలో.. ఓ ఉపాధ్యాయురాలు ఆమెకు స్వాగతం పలికేందుకు వినూత్న ప్రయత్నం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణనానికి చెందిన లీఫ్ ఆర్టిస్ట్, ఉపాధ్యాయురాలు అనురాధ.. రావి ఆకుపై ఆమె చిత్రాన్ని రూపొందించారు. సునీతా విలియమ్స్ తొమ్మిది నెలల తర్వాత భూమిని చేరబోతున్నందుకు అనురాధ ఆనందం వ్యక్తం చేశారు

# విస్తృతంగా ప్రజల్లోకి

(మొదటి పేజీ తరువాయి)

ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజతో కలిసి డి.రాజా మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమంలో సీపీఐ కీలక భూమిక పోషించిందని రాజా వివరించారు. ఎన్నో త్యాగాలు చేసిందని, సంపూర్ణ స్వరాజ్యం కోసం పోరాడినట్లు గుర్తుచేశారు. పార్టీ శత వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా విజయవంతంగా పూర్తి చేసుకుంటున్నామని వివరించారు. అన్ని రాష్ట్రాల్లోను సభలు, సమావేశాల ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. శత వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఈ ఏడాది డిసెంబరు 24, 25 తేదీల్లో విజయవాడలో జాతీయ సెమినార్లు నిర్వహిస్తున్నామని, దీనికి జాతీయస్థాయి పార్టీ నేతలు, వివిధ కమ్యూనిస్టు, ప్రజాసంఘాల ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. డిసెంబరు 26న తెలంగాణలోని ఖమ్మంలో శత వార్షికోత్సవ ముగింపు సభ జరుగుతుందని, ఈ సభకు ముందు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు ఈనెల 23 నుంచి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ అజెండాతో పార్టీ ప్రచార కార్యక్రమాన్ని సీపీఐ నిర్వహిస్తోందన్నారు. పోలీసుల పహారాలో చత్తీస్‌గఢ్ ఉందని రాజా ఆందోళన వ్యక్తంచేశారు. మావోయిస్టుల అణిచివేత పేరుతో అక్కడి ఆదివాసీయులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనుసన్నల్లో... ఆపరేషన్ కగార్ పేరుతో... మావోయిస్టుల అణచివేత ముసుగులో భద్రతా దళాలు అమాయక గిరిజనులపై దాడులకు తెగబడుతున్నాయని దుయ్యబట్టారు. ఆదివాసీలు ఎంతోకాలం నుంచి అటవీ ప్రాంత జలాలు, భూములను కాపాడుతున్నారని తెలిపారు చత్తీస్‌గఢ్‌లోని పరిస్థితులను పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండేతో వెళ్లి అధ్యయనం చేశామని, వాస్తవ పరిస్థితుల్ని అధ్యయనం చేసి... స్థానికులతో మాట్లాడినట్లు రాజా వివరించారు. ఏర్‌టెల్, జియో కలిసి స్పెక్ట్రమ్‌ను ఎలాన్ మస్క్‌కు ధారాదత్తం చేయడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని రాజా స్పష్టంచేశారు. ఎలాన్ మస్క్ పెంటగాన్‌కు మద్దతు ఇస్తున్నారని, తద్వారా భారతదేశ రహస్యాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నప్పటికీ ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదని, ప్రజలు, దేశ భద్రతపై దృష్టి పెట్టడం లేదన్నారు. విద్యారంగంపై కేంద్ర బడ్జెట్‌లో మొక్కుబడిగానే నిధులు కేటాయిస్తున్నారన్నారు. విద్యా రంగానికి దేశ జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని కొఠారి కమిషన్ సిఫార్సు చేస్తే... ఇప్పటివరకు మోదీ ప్రభుత్వం కనీసం 3 శాతం అందించలేని పరిస్థితికి దిగజారిందని మండిపడ్డారు. దీని ప్రభావంతో దేశంలోని అనేక మంది విద్యార్థులు ఉచిత విద్యకు దూరమయ్యారని, కోట్లాదిమంది నిరక్షరాస్యులుగా మారిపోతున్నారని చెప్పారు. దేశాన్ని, ప్రజలను బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఒకే దేశంఒకే భాష, ఒకే దేశంఒకే మతం, ఒకే దేశంఒకే ఎన్నిక తదితర రాజ్యాంగ వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం అవలంబిస్తోందన్నారు. ఉత్తరాది, దక్షిణాది అనే ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ... ప్రజల మధ్య చిచ్చురేపేలా మోదీ ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని ధ్వజమెత్తారు. మోదీ పాలనతో సామాన్య ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని, కార్పొరేట్ వర్గాలకే మేలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గాల పునర్విభజన పేరుతో మోదీ సర్కారు మరో కుట్రకు తెరదీస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్‌లో బీజేపీ ప్రభావం లేకపోవడంతో... అక్కడ బలం పుంజుకోవడానికి అనేక కుయుక్తులు పన్నుతోందన్నారు. సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత స్వదేశానికి తిరిగి రావడం శుభ పరిణామమని రాజా స్వాగతించారు. శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. సీపీఐ తరపున ఆమెను స్వదేశానికి ఆహ్వానిస్తున్నామని రాజా చెప్పారు.




సిపిఐ ప్రధాన కార్యదర్శి రాజాను ఇటీవల తెలంగాణ ఎమ్మెల్సీగా ఎన్నికైన నెల్లికంటి సత్యం విజయవాడలో కలిసి ధన్యవాదాలు తెలిపిన దృశ్యం




అనురాగస్మృతిలో

27వ వర్ధంతి నివాళులు

మీరు లేనిలోటు తీరనిది
మీ మధుర జ్ఞాపకాలు మరవలేనివి
మీ స్ఫూర్తి, స్మృతి మా హృదయాలలో పదిలం,
మీ ఆశయాల సాధనకై ఎల్లవేళలా శ్రమిస్తూ,
నేటి మీ 27వ వర్థంతి సందర్భముగా
మీకివే మా అక్షర నివాళులు.

కీ॥శే॥ పెందుర్తి మధుసూదనరావు గారు

భార్య : పెందుర్తి సుగుణ

కుమార్తెలు: పెందుర్తి ఉషారాణి (లేటు), మైలవరపు విజయభారతి

కుమారులు: పెందుర్తి త్రిభువన్ కుమార్, పెందుర్తి రవీంద్ర ప్రసాద్

కోడళ్ళు, అల్లుళ్ళు, మనమరాండ్రు, మనమళ్లు, ముని మనమరాళ్ళు మరియు ముని మనవళ్ళు

P.M.R. మెమోరియల్ ట్రస్ట్, ఖమ్మం. | నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నేలకొండపల్లి.

పెందుర్తి మధుసూదనరావు గారి స్మారక ఉన్నత పాఠశాల, భైరవునిపల్లి, నేలకొండపల్లి మం॥.


Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com